20-7Pg1exHMNWJQE.qxd:20-7Pg1exHMNWJQE.qxd 01/01/01 9:13 AM Page 1


వాకిలి
గత వారం రోజుల్లోని విశేషాలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-7-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 169 పేజీలు: 12 వెల: 8.00


## రష్యాపై ఇయు మరిన్ని ఆంక్షలు

9లో

ప్రధాని వచ్చేవారం యుకె, మాల్దీవుల పర్యటన

# లిక్కర్ కేసు ఎంపి మిథున్ రెడ్డి అరెస్టు

### ఆరుగంటలుపైగా విచారణ జరిపిన సిట్

### డొల్ల కంపెనీల నుంచి ముడుపులు చేర్చడంపై మిథున్‌ను ప్రశ్నించిన అధికారులు



**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో గత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో జరిగినట్లు చెప్పబడుతున్న లిక్కర్ స్కామ్ వ్యవహారం కేసులో సిట్ విచారణకు వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి శనివారం హాజరయ్యారు. 6గంటలకుపైగా జరిగిన సిట్ విచారణ ఈ సాయంత్రం ముగిసింది. విచారణ ముగిసిన నేపథ్యంలో సీట్ అరెస్ట్ చేస్తున్నట్లు ఆయనకు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని మిథున్ కుటుంబ సభ్యులకు వెల్లడించింది. ఆరు గంటలకుపైగా ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించారు. డొల్ల కంపెనీల నుంచి అంతిమ లబ్ధిదారునికి ముడుపులు చేర్చడంపై మిథున్ రెడ్డిని ఎక్కువగా ప్రశ్నలు అడిగినట్టు తెలుస్తోంది. మిథున్‌రెడ్డి విచారణ ఈ కేసులో కీలకంగా భావిస్తున్న పోలీసులు.. లిక్కర్ కేసు ప్రాథమిక చార్జ్‌షీట్లను కోర్టుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం. ఏపీ మద్యం స్కాం కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి ఏ4 నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టును ఆశ్రయించాడు. ఆయన ముందస్తు బెయిల్‌ను హైకోర్టు తిరస్కరించింది. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. లిక్కర్ కేసులో తన ప్రమేయం లేకపోయినా రాజకీయ కక్షలో >>2

## మద్యం కుంభకోణంపై ప్రాథమిక నివేదిక సమర్పించిన సిట్ మరో 20 రోజుల్లో పూర్తి చార్జిషీట్

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** సంచలనం సృష్టించిన ఏపీ మద్యం కుంభకోణం కేసుపై సిట్ దర్యాప్తు బృందం ప్రాథమిక చార్జీషీట్‌ను ఏసీబీ కోర్టులో దాఖలు చేసింది. 300 లకుపైగా పేజీలతో దాఖలు చేసిన ఈ ప్రాథమిక చార్జీషీట్‌ను శనివారం కోర్టుకు అప్పగించారు. దీనితోపాటు 100కుపైగా ఫొరెన్సిక్ >>2

# ప్లాస్టిక్‌పై పూర్తి నిషేధం

### అక్టోబర్ 2 నాటికి రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లు, 123 మునిసిపాలిటీల్లో అమలు

### ఆగస్టు 15కు సచివాలయం ప్లాస్టిక్ రహితం

### మహాయజ్ఞంలో ప్రజల భాగస్వామ్యం అవసరం

### తిరుపతిలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో సిఎం చంద్రబాబు



శనివారం తిరుపతిలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

**తిరుపతి,జూలై 19ప్రభాతవార్తప్రతినిధి:** జపాన్ దేశం తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ చెత్తరహిత రోడ్లను తీర్చిదిద్దాలని రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సూచించారు. సమాజంలో వాతావరణం కలుషితమై పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ వస్తువులు వినియోగం పూర్తిగా నిషేధిద్దామని ఆయన పిలుపునిచ్చారు. అక్టోబర్ 2వతేదీకి రాష్ట్రంలోని 17 కార్పొరేషన్‌లలో, 123 మున్సిపాల్టీల్లో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలుచేద్దామన్నారు. వాతావరణం కలుషితమైన క్యాన్సర్ రావడానికి కారణమవుతున్న ఒకేసారి వాడే ప్లాస్టిక్‌ను ముందుగా నిషేధించాల్సిన అవసరం ఉందని సిఎం స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను "స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర"గా తీర్చిదిద్దడంలో భాగంగా శనివారం మధ్యాహ్నం తిరుపతి ఎంఆర్‌పల్లిలోని పోలీసు మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఎం చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వద్దు అనే నినాదాన్ని రాష్ట్రమంతటా అమలు చేయాలని, ఆచరించాలని సూచించారు. స్వర్ణాంధ్ర సాధ్యం కావాలంటే ముందుగా స్వచ్ఛాంధ్రను సాధించాలని అన్నారు. ఇందుకోసం ఇకప్రతినెలా మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని మహాయజ్ఞంలా చేపడదామని, ప్రభుత్వంతోబాటు ప్రజలు భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదామని, ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమంగా తగ్గించే ప్రయత్నం చేద్దామన్నారు. ప్లాస్టిక్ రహితంగా తయారైన సంచులు, వస్తువులు, ఉత్పత్తులను వాడుదామన్నారు. క్లాత్‌బ్యాగ్ వెండింగ్ యంత్రాలను కూడా త్వరలోనే ఏర్పాటు చేసేదిశగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ప్లాస్టిక్ భూతాన్ని అంతంచేద్దామని, వాతావరణం కలుషితమై మనకు క్యాన్సర్‌లు రావడానికి కారణంగా ప్లాస్టిక్ మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కసారి వాడే ప్లాస్టిక్ వస్తువులు, సంచులు,స్ట్రాలు, కప్పులు,సీసాలు, ఆహార ప్యాకింగ్ వంటి వ్యర్థాలు పర్యావరణానికి హానికరంగా మారాయన్నారు. వీటిని రీసైక్లింగ్ చేయడం కూడా కష్టమన్నారు. సహజవాతావరణంలో ఎక్కువ కాలం భూమిలో కలవకుండా కలుషితం అవుతుందన్నారు. మొక్కలు, ఆహారం అంతా విషంగా తయారువుతోందని తెలిపారు. ప్లాస్టిక్‌ను కాల్చితే విషవాయువులు వెలువడి శ్వాససంబంధమైన వ్యాధులు వస్తున్నాయన్నారు. 120 మైక్రాన్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు అన్నిటినీ నిషేధిద్దామని సిఎం హితవు పలికారు. ఆగస్టు 15వతేదీకి రాష్ట్రసచివాలయంలో అసలు ప్లాస్టిక్ వాడకం అనేదిలేకుండా చేస్తామన్నారు. అక్టోబర్ 2గాంధీ జయంతి నాటికి 17 కార్పొరేషన్లలో, మునిసిపా >>2

## 23 దాకా భారీ వర్ష సూచన

### రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు

### గంటకు 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** ద్రోణి,ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఏపీలో పలు ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయి, దీంతో పలు జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈశాన్య బంగాళాఖాతం లోని ద్రోణి,ఉపరితల ఆవర్తన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఐఎండీ రెయిన్ ఎలర్ట్ చేసింది. మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈనేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) కీలక ఏపీని అలర్ట్‌ను జారీ చేసింది. జులై 19 నుంచి 23 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ప్రత్యేకించి కేరళకు అతి భారీ వర్ష సూచన ఉందని తెలిపింది. జులై 19 నుంచి 20 వరకు ఆ రాష్ట్రంలో గరిష్ఠంగా 21 సెంటీమీటర్ల వర్షపాతం కురవొచ్చని ఐఎండీ అంచనా వేసింది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా ప్రాంతం, దక్షిణ కర్ణాటక, లక్షద్వీప్‌లలోనూ అతిభారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు పేర్కొంది. రాబోయే ఐదు రోజుల పాటు దక్షిణాది రాష్ట్రాల్లోని తీర ప్రాంతాల్లో గంటకు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచేఅవకాశం ఉందని వాతావరణ విభాగం తెలిపింది. ఇదే సందర్భంలో రాబోయే ఐదు రోజులు >>2

# ఐసిఎఐ దేశానికి వెన్నెముక

### నేటి సిఎలు అధునాతన ఎఐ పరిజ్ఞానం కలిగి ఉండాలి

### త్వరలో కర్నూలులో డ్రోన్ సిటీ, కడపలో స్టీల్ ప్లాంట్, విశాఖలో ఎఎన్ఎస్ఆర్, సత్వజిసిసి, మిట్టల్ స్టీలు ప్లాంట్ రానున్నాయి: మంత్రి లోకేష్




శనివారం విజయవాడలో జరిగిన ఐసిఎఐ కార్యక్రమంలో మంత్రి లోకేష్‌కు అరుదైన జ్ఞాపికను ప్రదానం చేస్తున్న ప్రతినిధులు

**విజయవాడ.జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** కంప్యూటింగ్ రంగంతో అనుసంధానమైన ప్రతి అంశాల్లో అద్భుతాలు సాధించాలన్నదే ఏపీ ప్రభుత్వం ముందున్న కీలక లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. నేటి సీఏలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచవ్యాప్తంగా అవగాహన ఏఐఆధారిత కమ్యూనికేషన్, నైతికత కలిగి ఉండాలన్నారు. ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) అన్నది భారతదేశ మేధోశక్తికి వెన్నెముక లాంటిది. ఐసిఎఐ స్థాపించి 76 సంవత్సరాలు నిండినా ఆ సంస్థ ఇప్పటికీ యవ్వనంగానే ఉంది. ఇది భారతదేశంలో అతిపెద్ద సంస్థగా మాత్రమే కాదు, ప్రపంచంలోనే అతిపెద్ద అకౌంటింగ్ పవర్‌హౌస్‌గా ఉందన్నారు. గుంటూరు బండ్లమూడి గార్డెన్స్ లో ఐసిఎఐ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యాన "స్ఫూర్తి" పేరుతో నిర్వహించిన మెగా సిఎ విద్యార్థుల సమావేశానికి లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఐసిఎఐ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన, విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందింది. ప్రపంచంలో ఫోరెన్సిక్ అకౌంటింగ్ ప్రమాణాలతో పనిచేస్తున్న మొట్టమొదటి సంస్థ ఇది. ఐసిఎఐ ద్వారా 10లక్షలమందికి పైగా చార్టర్డ్ అకౌంటింగ్ విద్యను అభ్యసిస్తుండగా, ప్రతిఏటా 2లక్షలమంది పరీక్షలు రాస్తున్నారు. 4.07 లక్షల మంది సభ్యులు, 54 విదేశీ చాప్టర్లు కలిగిన అతిపెద్ద సంస్థ ఐసిఎఐ. వ్యాపారం ఎక్కడ ఉంటే భారత్ అక్కడ ఉంటుంది, భారత్ ఎక్కడ ఉంటే అక్కడ ఐసిఎఐఉంటుంది. సౌత్ ఆసియా లోనే మొట్టమొదటి క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతిలో ఆవిష్కృతం కాబోతోంది. గతంలో జన్మభూమి, స్వయం సహాయక సంఘాలు, ఇగవర్నెన్స్, ఐటీ హబ్‌లతో రాష్ట్ర చిత్రపటాన్ని మార్చేసిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీతో ఏపి రూపురేఖలు మార్చబో తున్నారు. మేం మార్పుకోసం వేచిచూడకుండా ఇక్కడనుంచే మార్పునకు శ్రీకారం చుడుతున్నాం. పెట్టుబడుల కోసం పొరుగు రాష్ట్రాలతో పోటీపడు తున్నాం. అభివృద్ధి కోసం పోటీపడతామే తప్ప రాజకీయ ఘర్షణ మా అభిమతం కాదు. అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో ముందుకు >>2

## విజయవాడలో

# లులు మాల్ ఏర్పాటు!

### రూ.1222 కోట్ల పెట్టుబడులు, 1500 మందికి ఉపాధి కల్పన

### ఆర్‌టిసికి గొల్లపూడి వద్ద ప్రత్యామ్నాయ స్థలం

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో లులు మాల్ ఏర్పాటు కానుంది. పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు సమీపంలోని పోలీస్ కంట్రోల్ రూమ్ జంక్షన్ వద్ద ఉన్న గవర్నర్‌పేట2 ఆర్టీసీ డిపో స్థలాన్ని ప్రభుత్వం లులు గ్రూప్‌కు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. లులు గ్రూప్ సంస్థ విశాఖపట్నం, విజయవాడల్లో మాల్స్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ రెండు చోట్లా కలిపి 1,222 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టడంతోపాటు 1,500 మందికి ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేసింది. దీంతో విజయవాడలో లులు సంస్థ మాల్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూమి కేటాయింపుపై ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ పరిశీలన చేసింది. చివరకు గవర్నర్‌పేట2 ఆర్టీసీ డిపో ఉన్న స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా డిపో స్థలాన్ని తమకు ఇవ్వాలంటూ ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఇటీవల లేఖ రాశారు. ప్రస్తుతానికి దీనిపై ఏ నిర్ణయం తీసుకోవాలనే దానిపై ఆర్టీసీ యాజమాన్యం పరిశీలిస్తోంది. ఆ స్థలాన్ని లులు మాల్‌కు ఇవ్వాలంటూ ప్రభుత్వ పెద్దల నుంచి సైతం ఆర్టీసీ ఎండీకి సూచన వచ్చినట్లు సమాచారం. గవర్నర్‌పేట2 ఆర్టీసీ డిపో సుమారు 5 ఎకరాల్లో ఉంది. ఇక్కడ గవర్నర్‌పేట2తో పాటు, ఒకటో డిపోకి చెందిన బస్సులను కూడా ఉంచుతారు. 1, 2 ఆర్టీసీ డిపోల మేనేజర్ల ఆఫీసులు సైతం ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు ఈ భూమిని లులు మాల్ >>2

## మాజీ మంత్రి నారాయణ స్వామికి సిట్ నోటీసులు


### లిక్కర్ కేసు

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కర్ స్కామ్ కేసులో గత ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేసిన నారాయణ స్వామికి సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విచారణకు రావాలంటూ నోటీసుల్లో స్పష్టం చేసింది. కేసులో ఎంపి మిథున్ రెడ్డి ఈ రోజు విచారణకు హాజరయ్యారు. ఇదే కేసులో సిట్ అధికారులు ఇప్పటి వరకు మొత్తం 49 మందిని నిందితులుగా చేర్చారు. అందుతో 11 మందిని సిట్ అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఎ1గా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి (రాజ్ కసిరెడ్డి), ఎ2 దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, ఎ3గా దొడ్డ వెంకట సత్యప్రసాద్, ఎ4 పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎ5 మాజీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి, ఎ6 సజ్జల శ్రీధర్ రెడ్డి, ఎ7గా ముప్పిడి అవినాష్ రెడ్డి, ఎ8గా బూనెటి చాణక్య, ఎ9గా తుకేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఎ10గా సైఫ్ అహ్మద్ ఉన్నారు.

# పరాకాష్టకు చేరుతున్న టిడిపి దుష్ట సంస్కృతి

### రోజాపై ఎమ్మెల్యే భానుప్రకాష్ వ్యాఖ్యలను ఖండిస్తున్నా: మాజీ సిఎం జగన్

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** టీడీపీ దుష్ట సంస్కృతి రోజు,రోజుకు పరాకాష్టకు చేరుతుందని మాజీ ముఖ్యమంత్రి వైసీపీ నేత, మాజీ మంత్రి వైఎస్ జగన్ ఆరోపించారు. మహిళనేతలపైన, కార్యకర్తలపై అత్యంత హేయంగా పోస్టింగులు పెట్టడం,అనుచిత ఆరోపణలు చేయడం టీడీపీ ఆధి నుంచి అనుసరిస్తున్న దుష్ట సంప్రదాయమన్నారు. మళ్ళీ తిరిగి బాధితులపైనే అభియోగాలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మాజీ మంత్రి రోజాపై నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అనుచిత వ్యాఖ్యలు చేసినట్టుగా ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వైసీపీ అధినేత జగన్ వ్యవహారంపై స్పందించారు. రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో భారీ ట్వీట్ చేశారు. మాజీ మంత్రి రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయం. తెలుగుదేశం పార్టీలో దారుణంగా మారిన దుష్ట సంస్కృతికి ఆ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతూ గట్టిగా మాట్లా డుతున్నందుకు, వాటిని ప్రశ్నిస్తున్నందుకూ ఓర్చుకోలేక, రెండుసార్లు ఎమ్మెల్యేగానూ, మంత్రిగానూ పని



చేసిన నా సోదరి రోజాను అత్యంత అసభ్యకరమైన పదజాలంతో దూషించారు. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదు. తమను విమర్శించే మహిళల గొంతు నొక్కడమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీలో ఒక తంతుగా మారిన అత్యంత హేయమైన సంస్కృతికి ఇది ఒక నిదర్శనం. గత ఏడాది కాలంగా అనేక మంది మహిళా నాయకులను వారు దారుణంగా వేధించారు, అవమానించారు. తనపై ఒక ఎమ్మెల్యే చేసిన అత్యంత హేయమైన వ్యాఖ్యలపై ఫిర్యాదు చేయడానికి రోజా వెళ్లగా, వాస్తవాలు స్పష్టంగా కళ్లెదుటే కనిపిస్తున్నా పోలీసులు తిరిగి ఆమెపైనే సందేహాలు వ్యక్తంచేశారు. ఇది రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఎంతదారుణంగా మారింది? టీడీపీ గుండాలను రక్షించేందుకు వారు >>2

# నేర చరితుల్ని ఊడ్చేయాలి

### నా జీవితంలో హత్యారాజకీయాలు లేవు

### తిరుపతి సభలో సిఎం చంద్రబాబు ఉద్వేగం

**తిరుపతి,జూలై 19ప్రభాతవార్తప్రతినిధి:** నా రాజకీయ జీవితంలో ఎప్పుడూ హత్యారాజకీయాలు లేవని, నక్సలిజం,ఫ్యాక్షన్ మతకలహాలపై పోరాడానని సిఎం చంద్రబాబు నాయుడు ఉద్వేగభరితంగా వెల్లడించారు. నక్సలైట్లు నన్ను చంపాలని చూస్తూ ఆ వేంకటేశ్వరస్వామి కాపాడారని దేవునిపై విశ్వాసం మరోసారి గుర్తుచేసుకున్నారు. గత ఐదేళ్ళు ప్రజలకు స్వేచ్ఛలేదని, గత పాలకులు ప్రజల ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయలేదన్నారు. ప్రజల భూములను కబ్జాచేసేందుకు యత్నించారని అన్నారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం మధ్యాహ్నం తిరుపతిలోని పోలీసు మైదానంలో జరిగిన సమావేశంలో సిఎం చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఫ్యాక్షనిజం, మతకలహాలను నివారించామన్నారు. హత్యారాజకీయాలు చేయాలని చూస్తే ఎవరినీ వదలిపెట్టేదిలేదని, నేరస్థుల గుండెల్లో నిద్రపోతానని మరోసారి ఉద్ఘాటించారు. గతంలో వైసిపి నేతలు వివేకా హత్యను గుండెపోటుగా చిత్రీకరించారని, నారాసురరక్తచరిత్ర అని తనపై వివేకా హత్యనిందవేశారన్నారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో రోడ్డుపై మామిడి కాయలు పోసి పులివెందుల రాజకీయం చేశారని, అయితే మామిడి రైతులకు టన్నుకు 12వేల రూపాయలు ఇచ్చి ఆదుకున్నామని చంద్రబాబు తెలిపారు. రాజకీయాలు కలుషితమైపోయాయని, నేరచరిత్ర ఉన్న వాళ్ళు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. నేరరాజకీయాలు చేసేవాళ్ళు మనకు అవసరమా అని ప్రజలకు ప్రశ్నవేసి సమాధానం రాబట్టారు. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ నెలకొల్పి ఐటికి ప్రాధాన్యతనిచ్చానని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు క్వాంటమ్ వ్యాలీకి ప్రాధాన్యత నిస్తున్నానన్నారు. ఎఐ అమలుచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వాట్సాన్‌గవర్నెన్స్ తీసుకువచ్చి ప్రభుత్వ సేవలు సులభతరం చేశామని సిఎం స్పష్టం చేశారు. ఈ గవర్నెన్స్ ద్వారా 700 సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో తిరుపతి నగరపాలకసంస్థకు స్వచ్ఛసర్వేక్షన్ అవార్డులు వచ్చాయని, వారిని మనస్ఫూర్తిగా అభినందించారు. రాష్ట్రం ప్రగతిపథంలో తీసుకెళ్ళే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నానన్నారు. ప్రపంచంలో ఏ వస్తువు నిరుపయోగం కాదని, నిరుపయోగంగా ఉన్న వస్తువు నుండి సంపద సృష్టించవచ్చని సిఎం తెలిపారు. స్వర్ణాంధ్ర కార్పొరేషన్, మెప్మా శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను చంద్రబాబు పరిశీలించి నిపుణులు, నిర్వాహకులతో మాట్లాడారు. అక్కడ ప్రదర్శించిన ఉత్పత్తుల వివరాలను తెలుసుకున్నారు. కొబ్బరివ్యర్థాలతో ఓ యువకుడు ఔత్సాహిక పారిశ్రామిక వేత్త తయారుచేసిన వస్తువులను సిఎం పరిశీలించారు. శ్రీవారిచిత్రమున్న మెమొంటోను ఆసక్తిగా తిలకించారు. తిరుమల,తిరుపతిలోనూ కొబ్బరిచిప్పలను కూడా కళారూపాలుగా వివిధ ఉపయోగకర వస్తువులూ రూపొందించే అంశాన్ని పరిశీలించాలని సిఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభికి, తిరపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు, సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్, తిరుపతి ఎంఎల్ఎ శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, రాష్ట్రస్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి,పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.సుగుణమ్మ, సిఎం ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, నగరపాలక కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.

**గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి:** చిన్నపుడు కరెంట్ లేక లాంథర్ వెలుతురులోనే చదువుకున్నానని సిఎం చంద్రబాబు బాల్యాన్ని >>2

20-7pg2exHMNWJQE.qxd:20-7pg2exHMNWJQE.qxd 01/01/01 9:11 AM Page 1





స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు కృషి చేసిన తిరుపతి మున్సిపల్ పారిశుధ్యసిబ్బందితో సిఎం చంద్రబాబు

# ప్లాస్టిక్‌పై పూర్తి నిషేధం

>> ట్టీల్లో ఒకేసారి వాడే ప్లాస్టిక్ వస్తువులను నిషేధిద్దామన్నారు. రాష్ట్రంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని దశలవారీగా అమలుచేయడానికి ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని చంద్రబాబు కోరారు. సర్క్యులర్ ఆర్థికవ్యవస్థ దిశగా మనం ప్రయత్నాలు చేయాలని అన్నారు. తిరుపతివంటి అంతర్జాతీయ ఆధ్యాత్మికకేంద్రం, పుణ్యక్షేత్రం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎవరూ కూడా ఇళ్ళల్లో ఊడ్చే చెత్త రోడ్లపై పడేయొద్దని, మన ఇల్లు, మన పరిసరాలు మనమే పరిశుభ్రంగా ఉంచుకొందామన్నారు. తడి, పొడి చెత్తగా ఇంటింటినుండి నగరపాలకసంస్థలు, మున్సిపాల్టీలో చెత్తసేకరణ చేస్తున్నాయని, ఇందుకోసం ప్రత్యేకంగా వాహనాలను సమకూర్చామన్నారు. తడిచెత్త నుండి కంపోస్టు తయారుచేసుకుని ఇంటిలోనూ వాడుకునేందుకు అవకాశం ఉందన్నారు. చెత్తనుండి సంపద సృష్టించుకోవాలన్నారు. తిరుపతికి సమీపంలోని రేణిగుంట తూకివాకంలో 300 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ కోసం ఓ పారిశ్రామిక పార్కును తయారుచేశామన్నారు. అక్కడ వినియోగించిన నీటిని సాగునీటి కోసం పంపిణీ చేస్తున్నామన్నారు. వివిధ తడి వ్యర్థపదార్థాల ద్వారా బయోగ్యాస్, కంపోస్టు, పొడిచెత్తతో ప్లాస్టిక్ గ్రాన్యుల్‌స తయారుచేసేందుకు అవకాశం ఉందని సిఎం తెలిపారు. తిరుపతిని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్ది దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుదామని బాబు పిలుపునిచ్చారు. బాధ్యత కలిగిన పౌరులుగా రోడ్లపై చెత్తవేయవద్దని ఆయన సూచించారు. జపాన్ వంటి దేశాల్లో ఎక్కడా రోడ్లపై చెత్తవేయరని, మనం కూడా ఈ విషయంలో వారిని ఆదర్శంగా తీసుకుందామని అన్నారు. స్వచ్ఛసర్వేక్షన్‌లో ఐదు అవార్డులు సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచామని సంతోషం వ్యక్తం చేశారు. తిరుపతి, గుంటూరు, రాజమండ్రి, విశాఖకు, విజయవాడ నగరాలకు అవార్డులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా మన నగరాల స్వచ్ఛతకోసం పనిచేసిన పారిశుధ్యకార్మికులు, అధికారులను సహకరించిన ప్రజలను అభినందిస్తున్నానని సిఎం వెల్లడించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీల నుండి 9వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం 86లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రోడ్లపై వదిలేసి వెళ్ళిందని, దాన్ని తొలగించి రోడ్లపై చెత్తలేకుండా చూస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు. అనంతరం స్వచ్ఛసర్వేక్షన్ అవార్డుఅందుకున్న తిరుపతి నగరపాలకసంస్థ పారిశుధ్యకార్మికులను, నగర కమిషనర్ మౌర్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, తిరుపతి ఎంఎల్‌ఎ శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, రాష్ట్రస్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.సుగుణమ్మ, సిఎం ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, నగరపాలక కమిషనర్ మౌర్య, జిల్లా సంయుక్తకలెక్టర్ శుభంబన్సల్ ,స్వచ్ఛాంధ్రలో భాగస్వామ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవాడలో లులు మాల్ ఏర్పాటు!

>> కోసం ఇస్తే, ప్రత్యామ్నాయంగా గొల్లపూడి సమీపంలో ఆర్టీసీకి 5 ఎకరాల భూమిని కేటాయించేలా ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే ఆ భూమికి సంబంధించిన వివరాలను సైతం ఆర్టీసీ యాజమాన్యానికి తెలియజేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం గురువారం జరగగా, అందులో లులు గ్రూప్‌సంస్థ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దీంతో త్వరలోనే గవర్నర్‌పేట2 ఆర్టీసీ డిపో స్థలాన్ని ఆ సంస్థకు కేటాయించనున్నట్లు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ఈ స్థలంలోని కొంత భాగంలో గతంలో మున్సిపల్ కార్పొరేషన్ ఐరన్ స్క్రాప్ మెటీరియల్‌తో రూపొందించిన బొమ్మలతో పార్క్ ఏర్పాటు చేసింది. దీనిని కూడా లులు మాల్‌కు కేటాయించే అవకాశం ఉన్నట్లు సమాచారం.ప్రస్తుత గవర్నర్‌పేట2 ఆర్టీసీ డిపో ఉన్న ప్రదేశం ఒకప్పుడు విజయవాడ బస్టాండ్‌గా ఉండేది. అక్కడే విజయవాడ1 ఆర్టీసీ డిపో సైతం ఉండేది. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు పండిట్ నెహ్రూ బస్టాండ్ (శివితీళీ) నిర్మాణం చేపట్టారు. ఈ బస్టాండ్ నిర్మాణం 1990లో ప్రారంభమైంది. అప్పట్లో విజయవాడ1 ఆర్టీసీ డిపోని కూడా కొత్త బస్టాండ్ ఆవరణలోనే ఏర్పాటు చేశారు. దీంతో పాత బస్టాండ్ ఉన్న ప్రాంతాన్ని సిటీ బస్సుల కోసం గవర్నర్‌పేట2 ఆర్టీసీ డిపోగా పేరు మార్చారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలోనే లులు మాల్ రానుంది. విశాఖలో లులు గ్రూప్‌నకు భూమి కేటాయింపు: ఇప్పటికే విశాఖపట్నంలో లులు గ్రూప్ నిర్మించనున్న షాపింగ్ మాల్, హైపర్ మార్కెట్ల నిర్మాణానికి భూమిని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. తిశి।।ది ద్వారా లులు గ్రూప్‌కు విశాఖలో భూకేటాయింపులు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ బీచ్ రోడ్డులోని హార్బర్ పార్కులో ఉన్న 13.43 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి బదలాయించాలంటూ వీఎంఆర్డీఏకు ఈ ఏడాది మార్చి నెలలోనే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# 23 దాకా భారీ వర్ష సూచన

>> ఏపీలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. పిడుగులతో కూడిన వర్షాలతోపాటు ఈదురు గాలులు వీచే అవకాశముందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలంటూ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. శనివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, గుంటూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలకు కురిసాయి. ఇక ఆదివారం ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నామని తెలిపారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఇక నిన్న అనకాపల్లి, ఏలూరు, కృష్ణా, అల్లూరి సీతారామరాజు, పల్నాడు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ప్రకాశం తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో రెండు వారాలకు పైగా వేసవిని తలపిస్తున్న ఎండలతో తిరుగుతున్న జనాలకు వర్షంతో ఉపశమనం లభించింది. **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:** ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ, విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి అవగాహన కల్పించాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో 24 గంటల పాటు పని చేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ వెల్లడించారు. ప్రాణ, పశు నష్టం జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

# ఇక మరణ శిక్షకాదు, యావజ్జీవఖైదు

## రాజ్యాంగసవరణలు చేస్తున్న పాకిస్థాన్

**కరాచి,జూలూ 19:** పాకిస్థాన్ పార్లమెంటులో క్రిమినల్ లాస్ (అమెండ్‌మెంట్) బిల్లు2025 ఆమోదం పొందింది. ఈ బిల్లు టెర్రరిస్టులకు, హైజాకర్లకు ఆశ్రయం ఇవ్వడం, మహిళలకు బహిరంగంగా బట్టలు ఊడదీయడం వంటి నేరాలకు మరణశిక్షను రద్దు చేసి, బదులుగా జీవిత ఖైదును విధించేలా చేస్తుంది. ఈ బిల్లును పాక్ హోం శాఖ సహాయ మంత్రి తలాల్ చౌదరి చట్టసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పాకిస్థాన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 354ఎ, 402సి లలో సవరణలు చేస్తున్నది. సెక్షన్ 354ఎ ప్రకారం, ఎవరైనా మహిళపై దాడి చేసి, ఆమె బట్టలు ఊడదీసి, బహిరంగంగా అవమానిస్తే, మరణశిక్ష లేదా జీవిత ఖైదు, జరిమానాతో శిక్షించబడతారు. కానీ, కొత్త బిల్లు ఈ నేరాలకు మరణశిక్షను తొలగించి, జీవిత ఖైదును తప్పనిసరి శిక్షగా విధిస్తుంది.

ఈ బిల్లు యూరోపియన్ యూనియన్‌తో జీఎస్‌పీ ప్లస్ వాణిజ్య ఒప్పందంలో భాగంగా అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చేందుకు తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఈ సవరణలకు పాకిస్థాన్ తెహ్రీక్‌ఎఇన్సాఫ్ (పీటీఐ) పార్లమెంటరీ నాయకుడు సయ్యద్ అలీ జఫర్, బలూచిస్థాన్ అవామీ పార్టీ సెనెటర్ సమీనా ముంతాజ్ జెహ్రీ తదితరులు వ్యతిరేకత వ్యక్తం చేశారు. మహిళలపై ఇటువంటి దాడులు హత్యకు సమానమైన నేరాలని, వీటికి మరణశిక్షను కొనసాగించాలని వారు వాదించారు. 1982లో జనరల్ జియా ఉల్ హక్ హయాంలో మహిళను బట్టలు ఊడదీయడం వంటి నేరానికి ఏడేళ్ల జైలు శిక్ష నుంచి మరణశిక్షగా మార్చినట్లు సెనెటర్ జఫర్ గుర్తు చేశారు. అయితే, ఈ చట్టాన్ని కొందరు కుటుంబ, ఆస్తి వివాదాల్లో దుర్వినియో గం చేస్తున్నారని, పోలీసులకు లంచాలు ఇచ్చి తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని మంత్రి తలాల్ వెల్లడించారు. మరోవైపు ఈపరిణామాలపై చైనా సానుకూలంగా స్పందించడం గమనార్హం.

# పవన్ నటించిన హరిహర వీరమల్లు సినిమా టికెట్ రేట్లు పెంపు

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా టికెట్ రేట్లు పెంచుతూ ఏపీ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. 14 రోజుల పాటు టికెట్ రేటు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని నిర్మాత ఏ ఎం రత్నం నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, 14రోజుల పెంపు విజ్ఞప్తిని తిరస్కరించిన ఏపీ సర్కారు పది రోజులకు మాత్రమే టికెట్ ధరను పెంచుకునేలా అనుమతి ఇస్తూ నిర్ణయం చేసింది. తద్వారా అన్ని సినిమాలను సమానంగానే చూస్తామంటూ సంకేతాలు ఇచ్చారు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. ఈసారి టిక్కెట్ ధర పెంపు పై స్వయంగా నిర్ణయం వెలువరించిన ముఖ్యమంత్రి కార్యాలయం.. మరి కాసేపట్లో దీనిపై అధికారి ఉతర్వులు జారీ చేసే అవకాశం ఉంది. ఈ ఏడాది విడుదల కానున్న భారీ చిత్రాల్లో హరిహర వీరమల్లు ఒకటి. పవన్ కళ్యాణ్ కథానాయకుడు. జ్యోతి కృష్ణ దర్శకుడు. ఏ.ఎం.రత్నం సమర్పణలో ఏ.దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంపై అభిమానుల అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ నటిస్తున్నారు. మొఘల్ రాజుల నుంచి కోహినూర్ వజ్రాన్ని చేజిక్కించుకోవడంతోపాటు, ప్రేక్షకుల మనసు దోచుకునేందుకు వీరమల్లు సిద్ధమవుతున్నారు. అభిమానులంతాఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రాన్ని మొదట మార్చి 28న విడుదల చేయాలని అనుకున్నారు. అయితే, కొన్ని సాంకేతిక కారణాల రీత్యా ఈ సినిమా జులై 24వ తేదీన రిలీజ్ కానుంది.

# పరాకాష్టకు చేరుతున్న టిడిపి దుష్ట సంస్కృతి

>> ఏ స్థాయిలో తమ బాధ్యత, కర్తవ్యాన్ని మర్చి వ్యవహరిస్తున్నారన్నది చూపుతున్నాయి. నిజానికి ఒక్క రోజా విషయంలోనే కాదు. మాజీ మంత్రి విడదల రజని, కృష్ణా జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికతో పాటు, మా పార్టీకి చెందిన పలువురు నాయకుల కుటుంబ సభ్యుల విషయంలో కూడా చాలా అవమానకర ఘటనలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఏ మాత్రం రక్షణలేకుండాపోయింది. వారికి కనీసగౌరవ, మర్యాదలు దక్కడం లేదు. వారికి ఏ విధంగానూ న్యాయం జరగడంలేదు.ఇకనైనా మాజీమంత్రి రోజాను దారుణంగా అవమానించిన ఎమ్మెల్యే భానుప్రకాశ్‌ను తక్షణమే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అంటూ జగన్ డిమాండ్ చేశారు.

# ఐసిఎఐ దేశానికి వెన్నెముక

>> వెళ్తున్నాం. భారతదేశం గర్వించదగిన ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కుటుంబసభ్యులు అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నేను చార్టర్డ్ అకౌంటెంట్ కాకపోయినా స్టాన్ఫోర్డ్ ఎంబీఏ గ్రాడ్యుయేట్‌గా సిఏ ప్రాధాన్యత నాకు తెలుసు. ఇది కేవలం ఒక కోర్సు కాదు, నిబద్ధత కూడుకున్న విద్య. మా కుటుంబ వ్యాపారాల్లో సిఎల కష్టాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. మా ప్రభుత్వం సీఏల ఇన్‌పుట్‌లకు విలువ ఇస్తుంది, పాలనా నిర్ణయాలలో మేము సీఏలను సంప్రదిస్తాము. మీరు బ్యాలెన్స్ షీట్‌లను మాత్రమే ధృవీకరించరు, రాష్ట్ర ఆర్థిక వెన్నెముకను తయారు చేస్తారు. న్యూ ఏజ్ సీఏ అనేది కాలిక్యులేటర్ కంటే ఎక్కువ. భారతదేశ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఫ్యాక్టరీ గుంటూరు నగరం. ఆశ్చర్యకరంగా గుంటూరు సిటీ వైద్యులు, ఇంజనీర్లకంటే ఎక్కువగా సిఎలను తయారుచేస్తోంది. డాక్టర్లు, ఇంజనీర్లకంటే సిఏ చదువుతున్న 10వేలమంది విద్యార్థుల సంఖ్య ఎక్కువ. ఈ కార్యక్రమంలో నారా లోకేష్‌కు అరుదైన జ్ఞాపికనను ఐసిఎఐ ప్రతినిధులు, విద్యార్థిని, విద్యార్థులు అందించారు,.ఈ సమావేశంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఐసిఎఐ వైస్ ప్రెసిడెంట్ డి.ప్రసన్నకుమార్, సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు, గుంటూరు బ్రాంచి ఛైర్మన్ ఎన్.రాజశేఖర్, సదరన్ ఇండియా చార్టర్డ్ అకౌంటెంట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచ్ ఛైర్మన్ చింతా రఘునందన్, వైస్ ఛైర్మన్ బి.ఝాన్సీ లక్ష్మి, కార్యదర్శి వనిమిరెడ్డి వి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.



శనివారం విశాఖలో తలసేమియా రన్‌ను ప్రారంభిస్తున్న భువనేశ్వరి తదితరులు

# ‘తలసేమియా రన్’ కు విశేష స్పందన

## పాల్గొన్న సిఎం సతీమణి భువనేశ్వరి, కరణం మల్లీశ్వరి, తమన్

## విశేషంగా ఆకట్టుకొన్న స్త్రీశక్తి కార్యక్రమం

**విశాఖపట్నం, జులై 19 ప్రభాతవార్త:** తలసేమియా వ్యాధి పై అవగాహనా కల్పించే కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో నిర్వహించిన 10కె, 5కె, 3కె రన్‌కు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్మన్, నారా భువనేశ్వరి, ఒలింపిక్ పతక విజేత కరణం మల్లీశ్వరి, ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ లు హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమం లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్మన్, నారా భువనేశ్వరి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఆహ్వానించిగానే హాజరైనా కరణం మల్లీశ్వరి, తమన్ లకు కృతజ్ఞతలు తెలిపారు. 1997 ఫిబ్రవరిలో ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించిన నాటి నుండి ఇప్పటివరకు 8 లక్షల మందికి రక్తం అందించామని, 15వేల ఆర్యోగ శిబిరాలు నిర్వహించామని తెలిపారు. అదేవిధంగా స్త్రీ ల అభ్యున్నతికి స్త్రీ శక్తి కార్యక్రమం ద్వారా చేయూత అందిస్తున్నామని, తెలిపారు. అంతేకాకుండా రానున్న రోజుల్లో ప్రజల విద్య, ఆరోగ్యం అభ్యున్నతికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆమె అన్నారు. అనంతరం రాన్ విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. రన్ తర్వాత ఆర్ కె బీచ్ లో తమన్, సమీరా భరద్వాజ్ నేతృత్వంలో మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ఇప్పటికే తలసేమియా బాధితులకు అండగా నిలిచే లక్ష్యంతో ఎన్టీఆర్ ట్రస్ట్ అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఈ ఏడాది జనవరిలో విజయవాడవేదికగా యుఫోరియా మ్యూజికల్‌నైట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు తమన్, ట్రస్ట్ సీఈఓ రాజేంద్ర పాల్గొన్నారు. అలాగే ఫిబ్రవరి 15న ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఈ కన్సర్ట్‌ని నిర్వహించారు. ప్రస్తుతం తలసేమియాపై అవగాహన కోసం విశాఖ ఆర్కే బీచ్‌లో 10కె, 5కె, 3కె రన్ చేపట్టారు.

# ప్రభుత్వ పాఠశాలల ముందు ‘ప్రవేశాలు లేవు’ బోర్డులు రావాలి: మంత్రి లోకేష్

## నాణ్యమైన విద్య అందిస్తున్నామని తల్లిదండ్రుల్లో నమ్మకం కల్గించాలి

## పెనమలూరు జడ్పీ హెచ్‌ఎం దుర్గాభవానీని సన్మానించిన మంత్రి

విజయవాడ, జులై 19,ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం ద్వారా ప్రవేశాలు పెంచడమే తమ లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. కృష్ణాజిల్లా పెనమలూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అద్భుత ఫలితాలు సాధించిన ప్రధానోపాధ్యాయురాలు యలమంచిలి దుర్గాభవానిని ‘షైనింగ్ టీచర్’ పేరుతో ఉండవల్లి లోని తన నివాసంలో మంత్రి శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘మా లక్ష్యం ఒక్కటే, వచ్చే నాలుగేళ్ళల్లో ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గాలి.ప్రభుత్వ బడుల్లో పెరగాలి.ప్రభుత్వ పాఠశాలల ముందు ‘ప్రవేశాలు లేవు’ అనే బోర్డులు ఉండాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య అందిస్తారని తల్లిదండ్రులు నమ్ముతారు. మనం నిజంగా విజయం సాధించిన వారమవుతాం. ఇందుకోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఉపాధ్యాయులను నేరుగా కలవాలని నిర్ణయం తీసుకున్నాం. వచ్చే నాలుగేళ్ళు విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృష్టి సారిస్తాం’ అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాన ఉపాధ్యాయురాలు దుర్గాభవాని నుంచి మంత్రి ఈ సందర్భంగా సలహాలు సూచనలు తీసుకున్నారు. అద్భుత పనితీరుతో ఉపాధ్యాయులందరికీ ఆదర్శంగా నిలిచారని ఆమెను ప్రశంసించారు. పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పదేళ్ళు పనిచేసిన దుర్గాభవాని వృత్తి పట్ల నిబద్ధత చూపి విద్యార్థులను సమున్నతంగా తీర్చిదిద్దారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 54 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందారు.రాష్ట్రంలో మొదటిసారి ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఈవెంట్ నిర్వహించారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ ద్వారా వాల్ ఆర్ట్స్, డాన్స్, మ్యూజిక్ తరగతులు కంప్యూటర్ శిక్షణ అందించారు. ఈ పాఠశాల విన్నూత్న ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచింది. అటల్ టింగరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు వారే విన్నూత్న పరిష్కారాలు కనుగొంటున్నారు. తడిచిన ధాన్యం ఆరబోసే యంత్రంతో పాటు పాఠశాలలో చెత్తను శుభ్రం చేసేందుకు పాత వస్తువుల నుంచి బ్లోయర్ తయారీ, ఆల్కాహాల్ సెన్సింగ్ హెల్మెట్ వంటివి ఇక్కడి విద్యార్థులు రూపొందించారు.



శనివారం కపిలేశ్వర ఆలయాన్ని శుభ్రం చేస్తున్న సిఎం చంద్రబాబు

# కపిలేశ్వరుని ఆశీస్సులందుకున్న సిఎం చంద్రబాబు

## ఆలయం శుభ్రం చేసిన ముఖ్యమంత్రి

**తిరుపతి,జూలై 19ప్రభాతవార్తప్రతినిధి:** మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుపతికి విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు మధ్యాహ్నం శైవాలయం కపిలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఇక్కడ ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కపిలేశ్వరుని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో చెత్త ఊడ్చుతున్న పారిశుధ్యసిబ్బందితో కలసి చేతిలో చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. కార్మికులతో సరదాగా సిఎం చంద్రబాబు కలసి పనిచేయడంతో కార్మికులు కూడా స్ఫూర్తి పొందారు. **కంచిమఠం పండితులు ఆశీర్వచనం:** తిరుపతి పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం అలిపిరి వద్ద కంచిమఠంకెళ్ళి మహామండపాన్ని సిఎం చంద్రబాబు సందర్శించారు. ఇక్కడ వేదపండితులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఎంపి మిథున్ రెడ్డి అరెస్టు

>> భాగంగా తనను అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో మిథున్ రెడ్డి పేర్కొన్నారు. అయితే, ఈ పిటిషన్ పై వాదనలువిన్న సుప్రీంకోర్టు ధర్మాసనం.. ముందస్తు బెయిల్ కోసం మిథున్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. దీంతో శనివారం విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు మిథున్ రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు ఢిల్లీ నుంచి గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకున్న మిథున్ రెడ్డికి వైసీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆయన సిట్ కార్యాలయంకు చేరుకున్నారు. గన్నవరం ఎయిర్ పోర్టులో మీడియాతో మాట్లాడిన ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

**రాజకీయ కక్షతో నా పై తప్పుడు కేసు:** సిట్ విచారణకు హాజరయ్యే ముందు మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాజకీయ కక్షతో తప్పుడు కేసులు పెట్టి.. తాత్కాలికంగా రాక్షస ఆనందం పొందుతున్నారని కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటి మాటలతో కేసు పెట్టారు, ఎలాంటి ఆధారాలు లేవు. కేసులను చట్టపరంగా ఎదుర్కొంటామని మిథున్ రెడ్డి చెప్పారు. విచారణ అనంతరం తనను అరెస్ట్ చేస్తారని ఇందు తాను భయపడనన్నారు. అరెస్ట్ చేస్తే చట్టపరంగా పోరాడి బయటకు వస్తాను. న్యాయం స్థానం బెయిల్ ఇస్తుందని నమ్ముతున్నట్లు తెలిపాను. మిథున్ రెడ్డి సిట్ కార్యాలయం వద్దకు చేరుకోవటంతో పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. సిట్ కార్యాలయం వద్ద బారికేట్లు పెట్టిన పోలీసులు, ట్రాఫిక్ పక్క రోడ్లకు మళ్లించారు. సిట్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మద్యం కుంభకోణంపై ప్రాథమిక నివేదిక సమర్పించిన సిట్

>> ల్యాబ్ నివేదికలు, ఎలక్ట్రానిక్ పరికరాలను జత చేసారు. మొత్తం రూ.62 కోట్లును సీజ్ చేసినట్లుగా ఈ ప్రైమరీ చార్జ్ షీట్‌లో సిట్ వివరించినట్లు సమాచారం 268 మంది సాక్షులను విచారించినట్లు చార్జిషీట్‌లో వెల్లడించారు. 11 మంది వాంగ్మూలాలు, రిమాండ్ రిపోర్టులు, ఇతర పత్రాలను దీనికి జత చేసారు. బ్యాంకులు, ఆస్పత్రుల్లో పెట్టుబడులపై వాంగ్మూలాలు పొందుపరిచిన సిట్, బంగారు దుకాణాలు, స్థిరాస్తి సంస్థల్లో పెట్టుబడులపై వాంగ్మూలాలు పొందుపరిచిన సిట్ మిథున్‌రెడ్డి పాత్రపై ఈ ఛార్జ్‌షీట్‌లో పేర్కొనని సిట్ అధికారులు 20 రోజుల్లో మరో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పేర్కొన్న సిట్. త్వరలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని సిట్ అధికారులు తెలిపారు. 2024 సెప్టెంబర్ 25 న కేసు నమోదు చేసిన సీఐడీ 2024 అక్టోబర్ 22, 23 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా మద్యం డిస్టిలరీ కంపెనీల్లో తనిఖీలు 2025 ఫిబ్రవరి 5న మద్యం కుంభకోణంపై సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో 2019 అక్టోబర్ నుంచి 2024 మార్చి వరకు రాష్ట్రంలో మద్యం అక్రమాలపై సిట్ విజయవాడ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో మొత్తం ఏడుగురు సభ్యులతో సిట్. సిట్‌కు కావాల్సిన సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ శాఖను ఆదేశించింది. తర్వాత ప్రతి 15 రోజులకోసారి దర్యాప్తు అంశాలను ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. మద్యం కేసులో మిథున్‌రెడ్డి అరెస్టుకు ఈనెల 18న ఏసీబీ కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు చేసారు.

# నేర చరితుల్ని ఊడ్చేయాలి

>> గుర్తుచేసుకున్నారు. నేటు ఇంటిపైనే సోలార్‌కరెంట్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. 20లక్షల ఇళ్ళపై సోలార్ విద్యుత్‌కు అనుమతించామన్నారు. ఇల్లూ, కార్యాలయాలు, పొలాలు కరెంట్ ఉత్పత్తి చేసే కేంద్రాలుగా తయారవుతున్నాయని అనుభూతి వ్యక్తం చేశారు. ఒకప్పుడు కరెంట్ బొగ్గుతో తయారయ్యేదని, నేడు గాలితో కరెంట్ ఉత్పత్తి వచ్చిందని, గ్రీన్‌ఎనర్జీపై శ్రద్ధపెట్టానని సిఎం అన్నారు. గ్లోబల్‌వార్మింగ్ వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని, దీనికి పరిష్కారం గ్రీన్ ఎనర్జీనేనని అన్నారు. అనంతరం బంగారుకుటుంబాలు ఎంపికైన కుటుంబసభ్యులతో చంద్రబాబు ప్రత్యేకంగా ముచ్చటించారు. వారి కుటుంబం ఆర్థికంగా ముందుకు రావడానికి కృషిని వివరించారు.

# ట్రక్కుల పరిశ్రమను ఏపిలో నెలకొల్పండి

## ఆనంద్ మహీంద్రాకు లోకేష్ వినతి

**విజయవాడ,జూలై 19,ప్రభాతవార్తప్రతినిధి:** మహీంద్రా ట్రక్కుల తయారీ పరిశ్రమను ఏపీలో నెలకొల్పాలని మహీంద్రా గ్రూపు అధినేత ఆనంద్ మహీంద్రాను మంత్రి నారా లోకేష్ కోరారు. మహీంద్రా బృందానికి ఆతిథ్యం ఇచ్చి...రాష్ట్రంలో ఉన్న విస్తృత అవకాశాల గురించి వివరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మహీంద్రా కంపెనీ మార్కెట్‌లోకి విడుదల చేసిన కొత్త ట్రక్కుపై తెలుగులో రూపొందించిన వాణిజ్య ప్రకటనను ఆనంద్ మహీంద్రా తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేయగా దాన్ని లోకేష్ రీపోస్టు చేశారు. ‘మీ తెలుగు ప్రకటన చాలా బాగుంది.ట్రక్కులకు ఏపీలో అతి పెద్ద మార్కెట్ ఉది. రాష్ట్రంలో మీరు పరిశ్రమను ఏర్పాటు చేస్తే మా ఆటోమోటివ్ ఎకోసిస్టమ్‌కు ఉపయుక్తంగా ఉంటుంది’అని పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

20-07-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
అషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
దశమి మ.12.12
కృత్తిక రా.10.53
వర్జ్యం : మ.1.43-3.11
దు.సా.4.56-5.48, 2)సా.5.07-6.44
శుభసమయం: ఉ.6.30-7.15, సా.7.00-8.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** వివాహ యత్నాలు అనుకూలిస్తాయి. వీసా, పాస్‌పోర్ట్ వంటి అంశాలు అనుకూలిస్తాయి.

**వృషభం :** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. జీవిత భాగస్వామి నుండి సహాయ సహకారాలు అందుతాయి.

**మిథునం:** సంతానం నూతన ప్రయత్నాలలో విజయం సాధిస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**కర్కాటకం :** ఉద్యోగాల్లో పదోన్నతులు పొందుతారు. రాజకీయ, కళారంగాల వారికి అనుకూల పరిస్థితులు.

**సింహం:** కోర్టుకేసుల నుండి బయటపడతారు. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది.

**కన్య :** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకు పరుస్తాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు.

**తుల :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన సన్నిహితుల సాయంతో పూర్తిచేస్తారు.

**వృశ్చికం:** దైవకార్యక్రమాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించండి.

**ధనుస్సు:** ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. నూతన మిత్రులు పరిచయమై కొత్త కారక్రమాలకు శ్రీకారం చుడతారు.

**మకరం:** ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు అవకాశాలున్నాయి. నూతన భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**కుంభం:** శ్రమాధికంతో కార్యక్రమాలు పూర్తికాగలవు. భాగస్వామ్య వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**మీనం :** ఆదాయ మార్గాలు పెరుగుతాయి. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

20-07Pg3exHMNWJQETL.qxd:20-07Pg3exHMNWJQETL.qxd 01/01/01 8:05 AM Page 1



# రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం: మంత్రి సవిత

**వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం**

**మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



మొక్కలు నాటుతున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే, మాజీమంత్రి

**నల్లమాడ జూలై 19 ప్రభాతవార్త,** కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తామని రాష్ట్ర బీసీ చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. శనివారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర మంత్రి సవితమ్మ కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు పుష్పగుచ్చం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్లమాడ సమీపంలోని రాగానిపల్లి రహదారి సమీపంలో నిర్మించిన వ్యవసాయ గోడౌన్ వద్ద రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ ,ట్రీ సేస్ ప్రతినిధులు అనురాగ్ మనోహర్ సహకారంతో రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి మంత్రి సవిత ఎమ్మెల్యే పల్లె సిందూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలు తయారుచేసిన హ్యాండ్స్ క్రాఫ్ట్స్ వస్తువులను మంత్రి సవితమ్మతో పాటు ఎమ్మెల్యే ,మాజీ మంత్రి పరిశీలించారు. రెడ్స్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగానికి సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా నడిపిస్తున్న రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. రాష్ట్రంలో వెనుక బడిన రాయలసీమ ప్రాంతానికి రూ.3857 కోట్ల తో హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ గా తయారు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని పిలుపునిచ్చారు. ఇన్ఫోసిస్ సంస్థ సహకారంతో చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజ గారిని అలాగే సేస్ ట్రీ ప్రతినిధులు మనోహర్ అనురాగ్ లను ఎమ్మెల్యే అభినందించారు. నియోజక వర్గంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. రైతులు పండ్లతోటల పెంపకం ద్వార ఆదాయ మార్గంలో పయనించవచ్చునని పేర్కొన్నారు. రైతులు చిరుధాన్యాలను పండించి మంచి పౌష్టికాహారాన్ని ప్రజలకు అందించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి హరితాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ సాగుచేసిన పంటలకు ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు .పుట్టపర్తి నియోజకవర్గానికి కృష్ణా జిల్లాలో తీసుకొచ్చి మరో కోస్తా ఆంధ్రగా మారుస్తామన్నారు.2014 నుంచి 2019 వరకు మరియు 2019 నుంచి 2024 వరకు చేసిన అభివృద్ధి పనులకు త్వరలో బిల్లులు చెల్లిస్తామన్నారు.

## వక్ఫ్ ఆస్తులను స్థిరమైన ఆదాయం పెంచే విధంగా అభివృద్ధికి చర్యలు

**విజయవాడ,జూలై 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ నగరంలోని పలు వక్ఫ్ ఆస్థులను పరిశీలించారు. ముందుగా విజయవాడ లోని కాళేశ్వరరావు మార్కెట్ వద్ద గల ముసాఫిర్ ఖానాను పరిశీలించారు. అక్కడి పరిస్థితుల గురించి అధికారులనడిగి తెలుసుకున్నారు. అక్కడ ఆదాయం పెరిగే విధంగా తీసుకోవాల్సిన చర్యలు సూచించి తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇబ్రహీంపటనం మండలం కొండపల్లి గ్రామం లోని 3.21 ఎకరాల వక్ఫ్ భూమిని పరిశీలించారు. ప్రస్తుతం అందులో 1.4 ఎకరాల భూమి ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ స్థానిక ప్రాధ్యానం,భవిష్యత్ అవకాశాలు దృష్టిలో పెట్టుకొని సదరు భూమి నందు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించారు. వక్ఫ్ బోర్డుకు స్థిరమైన ఆదాయం పెరిగే విధంగా చర్యలు తీసు కుంటామని తెలిపారు. వారితో పాటు వక్ఫ్ బోర్డు సభ్యులు అక్రమ్,సీఈఓ మొహమ్మద్ ఆలీ,వక్ఫ్‌బోర్డు అధికారులు,మాజీ కార్పొరేటర్ ఫతావుల్లా ఉన్నారు.

# తిరుమల సమాచారం

## టిటిడి ఈ యేడాది వినూత్న నిర్ణయం శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఇస్రో సేవలు



**తిరుమల,జూలై 19ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలకు సాధారణరోజుల్లోనే 90వేలమంది వరకు భక్తులు వస్తుండగా ఏడాదిలో తొమ్మిదిరోజులు జరిగే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులు అశేష సంఖ్యలో చేరుకుంటారు. ఈ నేపధ్యంలో ఈ ఏడాది టిటిడి వినూత్నంగా ఇస్రో సేవలు అందుకుని భక్తుల భద్రతపై మరింత దృష్టి సారించనుంది. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల ప్రణాళికల రూపకల్పనలో ఇస్రో సేవలు వినియోగించుకునేందుకు ఆలోచన చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన వాహనసేవల్లో పాల్గొంటున్న భక్తుల సంఖ్యను ఏర్పాట్లుబట్టి టిటిడి లెక్కిస్తోంది. సెప్టెంబర్ 24న తిరుమలలో మొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు 28వతేదీ రాత్రి గరుడసేవ రోజు భక్తులు మాఢవీధులు, గ్యాలరీలు, కొండంతా వేచివుంటారు.ఇలా భక్తులను లెక్కించడానికి అత్యాధునిక శాటిలైట్ వినియోగం కోరుతోంది. సమాచారాన్ని తెలుసుకునేందుకు తగిన ఏర్పాట్లు కూడా చేసుకునే ఆలోచనలో టిటిడి ఉంది.

## నేటి నుండి శ్రీవారి పుష్కరిణి మూసివేత



**తిరుమల,జూలై 19ప్రభాతవార్తప్రతినిధి:** సెప్టెంబర్‌లో జరగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు నెలరోజుల ముందు తిరుమల స్వామివారి పుష్కరిణి మూసివేసి మరమ్మతులు చేయడం పరిపాటి. ఇందులో బాగంగా నేటి నుండి ఆగస్టు 19వరకు స్వామివారి పుష్కరిణి మూసివేస్తున్నారు. పుష్క రిణిలో పైపులు,ఇంకా ఏదేని మరమ్మతులు చేసి మళ్లీ కొత్తనీటిని విడుదల చేస్తారు. ఈ నెలరోజులు భక్తులు స్నానాలకు వరాహస్వామి ఆలయం సమీపంలో కొళాయిలు ఉంటాయి. నెలరోజులు పుష్కరిణి హారతి కూడా రద్దుచేశారు. భక్తులు సహకరించాలని టిటిడి కోరింది.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నాం: ప్రముఖులు



**తిరుమల,జూలై 19ప్రభాత వార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం సంతోషమని ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ కె.శ్రీనివాసరెడ్డి,రాష్ట్రమంత్రి నారాయణ, సినీ సంగీత దర్శకుడుమణిశర్మ కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వీరంతా వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. శ్రీవారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## టిటిడిలో మరో నలుగురు అన్యమత ఉద్యోగులపై వేటు



**తిరుమల,జూలై 19ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడిలో విధులు నిర్వహిస్తూ హిందూ మతాన్ని గాకుండా అన్యమతాన్ని ఆచరిస్తున్న మరో నలుగురు ఉద్యోగులపై టిటిడి ఇఒ శ్యామలరావు చర్యలు తీసుకున్నారు. అన్యమతం ఆచరిస్తున్నట్లు ఆధారాలతో నివేదికలు అందడంతో వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. శనివారం అన్యమతాన్ని ఆచరిస్తున్నట్లు టిటిడిలో క్వాలిటీ కంట్రోల్ విభాగం డిప్యూటీ ఇఇ బి.ఎలిజర్,బర్డ్ ఆస్పత్రి స్టాఫ్ నర్స్ ఎస్.రోషి,గ్రేడ్ 1 ఫార్మాసిస్ట్ ఎం.ప్రేమావతి, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీకి చెందిన డాక్టర్ జి.,అసుంతలను టిటిడి సస్పెండ్ చేసింది. అన్యమత ఆచరిస్తున్నారనే ఆధారాలతో టిటిడి ప్రవర్తనా నియమావళిని పాటించలేదని ,ధార్మికసంస్థకు భంగం కలిగించేలా ప్రవర్తించారనిశాఖాపరమైన చర్యలతో బాటు సస్పెండ్ చేయడం జరిగింది. గతంలో ఇద్దరిరిని సస్పెండ్ చేసిన విషయం విదితమే.

## గంజాయి మూలాలపై ఉక్కు పాదం

### యేడాదిలో 2 వేల మంది అరెస్ట్

### విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

**గజపతినగరం (విజయనగరం జిల్లా), జూలై 19 ప్రభాతవార్త :** తమ రేంజ్ పరిధిలో గంజాయి మూలాలపై ఉక్కు పాదం మోపుతున్నామని, మరో ఏడాదిలో గంజాయి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని విశాఖ రేంజ్ పోలీస్ డిఐజి గోపీనాథ్ జట్టి అన్నారు. శనివారం సాయంత్రం వార్షిక తనిఖీల్లో భాగంగా గజపతినగరం సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లు క్షుణ్ణంగా పరిశీలించారు. సర్కిల్ పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరాల అదుపుకు ఎప్పటికప్పుడు ఆధునిక టెక్నాలజీతో ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రజలు కూడా సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విశాఖ రేంజ్‌లో గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నా మన్నారు. గడిచిన ఏడాదిలో 2 వేల మంది గంజాయి ముద్దాలను అరెస్టు చేశామన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు 29 చెక్‌పోస్టుల వద్ద 24/7 నిఘా విభాగం పని చేస్తుందన్నారు. ఆర్టీసీ బస్సులు, రైల్వే మార్గాల్లో కూడా గంజాయి అక్రమ రవాణాపై నిఘా ఉందన్నారు. ఈ ఏడాదిలో గంజాయి సాగును జీరో పర్సంటేజ్‌కి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టుల్లోకి మారేందుకు దరఖాస్తుల స్వీకరణ

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** డిగ్రీలో అమలుచేయనున్న సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం లోకి కళాశాలలు మారేందుకు అవకాశం కల్పిస్తూ ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేసింది.2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి స్వల్ప మార్పులతో సింగిల్ మేజర్ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. అందులో భాగంగా ఎయిడెడ్,ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలలు సబ్జెక్టులను మార్చుకునేందుకు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించింది. ఇప్పటికే డబుల్ మేజర్ విధానం లోకి మారేందుకు కళాశాలలు రూ.5వేల చొప్పున చెల్లించినందున మరోసారి చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం నుంచి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పింది. ధరఖాస్తులు సమర్పించేందుకు ఈ నెల 24 చివరి గడువని,అపరాధ రుసుం రూ.2వేలతో 27 వరకు,రూ.5వేలతో 30 వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొంది. ధరఖాస్తుల పరిశీలన 25 నుంచి 31 వరకు ఉంటుందని షరతులతో కూడిన ప్రొవిజనల్ ప్రొసీడింగ్‌ను ఆగస్టు 1న జారీ చేస్తామని వెల్లడించింది.

## ఎన్టీఆర్ జిల్లాలో ఇరిగేషన్ ఎఇఇ అదృశ్యం

రిలీవ్ చేయకుండా అధికారులు, ఎమ్మెల్యే వేధిస్తున్నారని సూసైడ్ నోట్

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** తాను బదలీ అయినా రిలీవ్ చేయకుండా అధికారులు ఎంఎల్ఏ వేధిస్తున్నారని, దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని జల వనరుల శాఖ ఎఇఇ రక్తంతో లేఖ రాసి అదృశ్యమయ్యారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో గురువారం జరిగిన ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. 'ప్రభుత్వం బదిలీ చేసి నెల రోజులవుతున్నా రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఇఇ,స్పెషల్ డివిజన్,విజయవాడ) పి.గంగయ్య డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డిఇ,స్పెషల్ సబ్ డివిజన్,కంచికచర్ల) ఎస్.ఉమాశంకర్,తిరువూరు ఎంఎల్ఏ కొలికపూడి శ్రీనివాసరావు కలిసి ఆడుతున్న రాజకీయ నాటకంలో నేను అలిసిపోయాను.ఒక దళిత ఉద్యోగిగా నాకు జరిగిన అన్యాయం ఇంకెవరికీ జరుగకుండా చర్యలు తీసుకోవాలి' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు,మంత్రి నారా లోకేష్‌కు,ఎస్‌సి కమీషన్ చైర్మన్ కెఎస్ జవహర్‌క ఉ విజ్ఞప్తి చేస్తూ తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖ రాసి ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఎఇఇ) వేసుపోగు కిషోర్ అదృశ్యమయ్యారు. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాటు గ్రామానికి చెందిన కిషోర్ జల వనరుల శాఖలో తిరువూరు ఎఇఇగా పని చేస్తున్నారు గత నెల 16న నాగార్జున సాగర్ కెనాల్ (ఎన్ఎస్‌సి) ఓ అండ్ ఎం సెక్షన్ గౌరవరం (జగ్గయ్యపేట నియోజకవర్గం)నకు ప్రభుత్వం బదిలీ చేసింది. రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా జలవనరుల శాఖ ఇఇ గంగయ్య డిఇఇ ఉమాశంకర్,తిరువూరు ఎంఎల్ఏ కొలికపూడి శ్రీనివాసరావు వేధిస్తు న్నారు. దీంతో ఇఇ,డిఇ,ఎంఎల్ఏపై, పరోక్షంగా వారికి సహకరించిన సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, మంత్రి పిఎ బి.శ్రీనివాసరావులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖ రాసి అన్ని శాఖల ఉద్యోగుల వాట్సప్ గ్రూప్‌ల్లో పోస్టులు చేసి అదృశ్యమయ్యారు. కిషోర్ మామ జె.ఆనందరావు ఫిర్యాదు మేరకు తిరువూరు ఎస్ఐ సత్యన్నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కిషోర్ చివరి ఫోన్‌కాల్ సరిహద్దు ఖమ్మం జిల్లా విఎం బంజరులో గుర్తించినట్లు పోలీసులు చెప్పారని జల వనరుల శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి సిఎస్ఎస్ఆర్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ మూడో స్థానం

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:**సదరన్ లెవెల్ జాతీయస్థాయి సీఎస్ఎస్ఆర్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఏపీఎస్‌డీఆర్ఎఫ్) మూడో స్థానంలో నిలిచి సత్తా చాటింది. న్యూఢిల్లీలో జరిగిన పోటీల్లో హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ సహా వివిధ రాష్ట్రాలతో పోటీపడి తృతీయస్థానాన్ని కైవసం చేసుకుంది. ఏప్రిల్‌లో ఘజియాబాద్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో అర్హత సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈ బృందం సభ్యులు డీజీపీని ఆయన కార్యాలయంలో కలిశారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా క్రీడాకారులను అభినందించారు.

## తొలి త్రై మాసికంలో కేంద్ర సాయంలో భారీ కోత - కాగ్ నివేదికల్లో వెల్లడి

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్రం నుంచి రావాల్సిన సాయంలో భారీగా కోతలు పడినట్లు కాగ్ నివేదికలు చెబుతున్నాయి, 2025-25 ఆర్థిక సంవత్సరంలో తొలి త్రైమాసికంలో కేవలం నాలుగు శాతం నిధులు మాత్రమే రావడంతో ఆ ప్రభావం రాష్ట్ర ఖజానాపై పడుతోంది. ఇది భారీగా అప్పులు చేయాల్సిన పరిస్థితికి దారితీస్తోంది. కాగ్ ప్రకటించిన త్రైమాసిక నివేదిక ప్రకారం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. అటు సొంత ఆదాయం తగ్గడం,కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడం,అప్పులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొనడంతో ఖజానా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్రం నుంచి గ్రాంట్లు రూపంలో ఏడాది మొత్తానికి రూ.32,284 కోట్లు రావాల్సిఉండగా తొలి మూడు నెలల్లో కేవలం రూ.1,465 కోట్లు మాత్రమే వచ్చాయి. నెలకు సగటున రూ. 2,690 కోట్లతో మూడు నెలలకు ఎనిమిది వేల కోట్ల వరకు రావాల్సి ఉంటుంది. అయితే కేవలం 4.54 శాతం నిధులు మాత్రమే రావడం గమనార్హం.గత ఏడాది తొలి త్రైమాసికంలో 6.64 శాతం వచ్చింది. ఈ ఏడాది రెండు శాతం వరకు తగ్గిపోవడం గమనార్హం.ఇది రాష్ట్రంలో అమలు చేసే పథకాలకు ఇబ్బందికరంగా మారుతుందని అధికారులు చెబుతున్నారు.

రాష్ట్ర సొంత ఆదాయాన్ని పరిశీలిస్తే ఇప్పటి వరకు 20 శాతం నిధులు సమకూరాయి. బడ్జెట్ అంచనాల మేరకు రూ.1.66 లక్షల కోట్లుగా అంచనా వేయగా మూడు నెలల్లో రూ.33 వేల కోట్లు మాత్రమే చేతికందింది.

## గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ భేటీ

- విదేశాల్లో భారత విద్యార్థుల సమస్యల ప్రస్తావన



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు విదేశాల్లో భారతీయ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తున్న ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

**విజయవాడ, జూలై 19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ విద్యావేత్త, సాహితీవేత్త ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ శనివారం విజయవాడ రాజ్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్, జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ పలు కీలక అంశాలను గవర్నర్‌కి వివరించారు. ముఖ్యంగా విదేశాల్లో ఉన్న భారతీయ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య లపై ప్రత్యేకంగా చర్చించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన నూతన విధాన మార్పులు భారత విద్యార్థులకు సమస్యగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల హక్కులను కాపాడటానికి విద్యా, దౌత్యా రంగాల సమన్వ యంతో చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని గవర్నర్‌కు వివరించారు.అమెరికాలో తన పర్యటనలో భాగంగా యునైటెడ్ నేషన్స్‌లో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్‌ను కలసిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా భారత భాషల అంతర్జాతీయ ప్రాధాన్యత, భారత విద్యార్థుల సంక్షేమం తదితర అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు. అమెరికన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తొలిసారి తెలుగు వ్యక్తిగా ఎన్నికైన డాక్టర్ ముక్కామల శ్రీనివాస్ (బాబీ) ఘన విజయాన్ని గవర్నర్‌కి వివరించారు.

ఇది ప్రపంచ తెలుగు సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. అమెరికాలోని తెలుగు భాషా అభివృద్ధికి కృషిచేస్తున్న యూనివర్శిటీ ఆఫ్ సిలికాన్ ఆంధ్ర అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్‌తో తన సమావేశ వివరాలను కూడా గవర్నర్ తో పంచుకున్నారు. అలాగే, హిందీని ఐక్యరాజ్యసమితిలో అధికారిక భాషగా గుర్తించే దిశగా తాను చేస్తున్న ప్రయత్నాలను గవర్నర్‌కి వివరించారు.

ఆచార్య లక్ష్మీ ప్రసాద్ హిందీ, తెలుగు భాషల అభివృద్ధికి దేశంలోనే కాదు విదేశాల్లోనూ చేస్తున్న సేవలను గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. భాషా, విద్యా రంగాలలో వారి యత్నాలకు తన సంపూర్ణ మద్దతు అందిస్తానని హామీ ఇచ్చారు.

## మాజీ ముఖ్యమంత్రి జగన్‌ది వికృత మనస్తత్వం: హోంమంత్రి అనిత



**విజయవాడ,జులై 19,ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి జగన్‌ది వికృత మనస్తత్వం.అధికారంలో ఉన్న ఐదేళ్ళు ఒకలా ఓడిపోయిన తర్వాత మరోలా క్రూరత్వం చూపుతున్నారని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు,హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. మహిళలే లక్ష్యంగా దాడులు,మురికి వ్యాఖ్యలు చేయిస్తున్నారన్నారు. రాష్ట్ర తెలుగు మహిళ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటి అమలు చేస్తుంటే,వాటికి అడ్డు తగలడానికి వైకాపా కుట్ర పన్నుతోంది.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి అడ్డాగా మారిస్తే కూటమి ప్రభుత్వం ఈగల్ టీంను నియమించి ఉక్కుపాదం మోపింది.' అని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి వాస్తవాలను వివరించాలని కార్యకర్తలను కోరారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ 'మహిళలను కించపర్చిన వారు పుట్టగతులు లేకుండా పోతారు.వాళ్ళు రాజకీయంగా ఎంతటి శక్తిమంతులైనా ప్రజల తీర్పునకు తలొగ్గక తప్పదు అని అన్నారు.ఇదే సమావేశంలో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై ప్రశ్నించే హక్కు ఎంఎల్ఏగా నాకు ఉంది. నా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నన్ను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. చెల్లిలి వరస అవుతానని కూడ చూడకుండా ప్రసన్నకుమార్‌రెడ్డి నాపై సభ్యసమాజం సిగ్గుపడేలా మురికి వ్యాఖ్యలు చేశారు. అని కోవూరు ఎంఎల్ఏ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై త్వరలో రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

## ఎక్సైజ్ శాఖలో ముగ్గురు డిప్యూటీ కమీషనర్లుకు పోస్టింగులు

**విజయవాడ.జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** ఎక్సైజ్ శాఖలో ముగ్గురు డిప్యూటీ కమీషనర్లుకు పోస్టింగులు ఇచ్చారు.ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసారు.విజయనగరం జిల్లాకు వై.శ్రీనివాస చౌదరిని, ప్రధాన కార్యాలయానికి వి.వివేక్‌ను డిప్యూటీ కమీషనర్లుగా పంపించారు.ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఎన్.సుర్జిత్ సింగ్‌ను నియమించారు.

## బాధితుని న్యాయహక్కులకు కవచంలా నిలిచే బలమైన వ్యవస్థగా ప్రాసిక్యూషన్ ఉండాలి

### డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు



మాట్లాడుతున్న ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ బైరా రామకోటేశ్వరరావు

**విజయవాడ క్రైం,జులై 19,ప్రభాతవార్త** బాధితుని న్యాయ హక్కులకు కవచంలా నిలిచే బలమైన వ్యవస్థగా ప్రాసిక్యూషన్ ఏర్పడాలని,మన న్యాయ పోరాటం బాధితుల మద్దతుతో నడవాలని ప్రాసిక్యూషన్ విభాగం డైరెక్టర్ బైరా రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రాసిక్యూషన్ విభాగం,ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్‌లు సంయుక్తంగా మనుషుల అక్రమ రవాణా,బంధిత కార్మిక నిర్మూలన వ్యవస్థ చట్టం-1976పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన బైరా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ బాధితుల పట్ల సానుభూతిపరమైన దృక్పథంతో వ్యవహరించడంతో పాటు,బానిసత్వం,మానవ అక్రమ రవాణా కేసుల్లో సాక్ష్యాల లోపాలను తొలగించి, న్యాయ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. దోషులకు తగిన శిక్షలు పడేలా చేయడమే కాకుండా,భాధితులకు న్యాయపూర్వక పునరావాసం కల్పించడంలో ప్రాసిక్యూటర్ల పాత్ర కీలకమన్నారు. న్యాయ ప్రక్రియ భాధితుడిని కేంద్రంగా ఉంచుకొని సాగాలన్నారు. కేసుల విజయం కంటే భాధితునికి గౌరవంతో న్యాయం అందించడమే నిజమైన విజయమన్నారు. హ్యూమన్ ట్రాఫికింగ్,బౌండెడ్ లేబర్ చట్టాల అమలులో,ప్రతి ప్రాసిక్యూటర్ భాధితుడి పక్షాన నిలవాలని ఉద్ఘాటించారు. ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ స్టేట్ ప్రోగ్రాం డైరెక్టర్ క్లైమెంట్ డేవిడ్ మాట్లాడుతూ భాధితుని పక్షాన గళమెత్తే ప్రాసిక్యూటర్లే సమాజ మార్పుకు మార్గదర్శకులన్నారు. ఈ శిక్షణలతో మానవతా దృక్పథం బలపడాలని పేర్కొన్నారు. జీవన్జ్వాలా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.తేన్‌మొళి మాట్లాడుతూ బంధిత కార్మికురాలిఆ తాను ఎదుర్కొన్న భాధలను వివరించి న్యాయం ఆలస్యం కాకుండా భాధితునికి గౌరవంతో న్యాయం చేయాల్సిన భాధ్యత ప్రాసిక్యూటర్లదేనని స్పష్టం చేశారు.

## రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలలో ఎవరికెన్ని ఓట్లు?

### డివిజనల్ హెడ్ క్వార్టర్స్‌లో ఒక్క కమిటీ మెంబర్‌ని కూడా గెలిపించుకోని సంఘ్

**గుంతకల్లు రైల్వే, జూలై 19,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ ప్రధాన కేంద్రంలోని రైల్వే ఇన్స్‌స్టిట్యూట్ పాలక మండలికి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్యానెల్ అఖండ విజయం సాధించగా, ప్రత్యర్థి ఎంప్లాయిస్ సంఘ్ ప్యానల్ నుంచి పోటీ చేసిన 9మందిలో ఒక్కరంటే ఒక్కరు కూడా గెలవకపోవడం సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది. శుక్రవారం గుంతకల్లులో జరిగిన రైల్వే ఇన్స్‌స్టిట్యూట్ సార్వత్రిక ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌ల మధ్య హోరాహోరీగా జరిగిన ఎన్నికలలో రైల్వే కార్మికులు మజ్దూర్ యూనియన్‌కు విజయం చేకూర్చారు. మజ్దూర్ యూనియన్ ప్యానెల్ నుండి కార్యదర్శిగా పోటీ చేసిన కె యల్లప్ప తన సమీప ప్రత్యర్థి మల్లికార్జునపై 56ఓట్ల మెజార్టీతోను, సంయుక్త కార్యదర్శిగా పోటీ చేసిన ఎం ప్రవీణ్ కుమార్ తన సమీప ప్రత్యర్థి డి షేక్షావలిపై 252ఓట్ల అత్యధిక ఓట్ల మెజార్టీతో అఖండ విజయం సాధించగా, కోశాధికారిగా పోటీ చేసిన యస్ నథాని యేల్, తన సమీప ప్రత్యర్థి నాగరాజుపై 177ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాగా కమిటీ సభ్యులుగా ధన్‌రాజ్ 175ఓట్లు, రామాంజనేయులు 133ఓట్లు, షఫీఉల్లా 105ఓట్లు, జి చంద్రమౌళి తన సమీప ప్రత్యర్థి షేక్ సుభానుల్లాపై 207ఓట్లు, శ్రీనివాసులు 191ఓట్లు,కె నెట్టికల్లు 233ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. రైల్వే ఇన్స్‌స్టిట్యూట్‌లో మొత్తం 944మంది అర్హులైన ఓటర్లు ఉండగా 865ఓట్లు పోలయ్యాయి. రైల్వే ౨ రేణిగుంట, నందలూరు,కడపఇన్స్‌స్టిట్యూట్‌లను మజ్దూర్ యూనియన్ ఏకగ్రీవంగా ఎన్నిక అయారు.

ప్రభుత్వ తోడ్పాటు, ప్రజల సహకారంతో ఏ దేశమైన అద్భుతాలు చేయవచ్చని ఇజ్రాయిల్ నిరూపించింది. ఇజ్రాయిల్ దేశ భూభాగంలో సగానికి పైగా ఎడారి వాతావరణం వ్యవసాయానికి అనుకూలంగా ఉండదు. దీనికి తోడు సాగు నీటి కొరత. 20 శాతం భూభాగం మాత్రమే సాగుకు అనుకూలం. కానీ వ్యవసాయంలో సాగు విధానంలో ప్రపంచానికే ఇజ్రాయిల్ దేశం ఆదర్శంగా నిలుస్తుంది. ఇజ్రాయిల్లో ఆధునిక వ్యవసాయం అభివృద్ధి 19వ శతాబ్దం చివరిలోమొదలైంది. 1948లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సాగులో ఉన్న మొత్తం విస్తీర్ణం 4.8 లక్షల ఎకరాల నుండి 10.70లక్షల ఎకరాలకుపెరిగి వ్యవసాయ ఉత్పత్తి పదహారు రెట్లుపెరిగింది. వ్యవసాయం ముఖ్యంగా రెండు పద్ధతుల్లో సాగుతుంది. మొదటిది సామూహిక వ్యవసాయ పద్ధతి. ఊరు లేదాప్రాంతం అంతా కలిసితలా ఒక పనిచేస్తూ సామూహికంగా పంట ఉత్పత్తి చేస్తారు. రెండవది మోన్ పద్ధతి. కుటుంబం తన సొంత భూమిలో పంట సాగు చేయడం. ఇజ్రాయిల్ మొత్తం వ్యవసాయ ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు 50శాతం. 2014లో పండ్లు, కూరగాయలు, ఉత్పత్తులు విలువ 3బిలియన్ డాలర్లు. మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల విలువ 8 బిలియన్ డాలర్లు. ఇజ్రాయిల్లో డ్రిప్ మైక్రోఇరిగేషన్ పరిష్కారాలు ప్రపంచ వ్యాప్తంగా వాడుతున్నారు. డ్రిప్ ఇరిగేషన్లో సొంతంగా శుభ్రపరచుకొని ఏకరీతినీటి ప్రవాహం ఉండేటట్లు అభివృద్ధి చేశారు. నీటిని 50 శాతం వరకు తగ్గించడం, జీవ సంబంధమైన తెగులు నియంత్రణకోసం ప్రయోజనకరమైన కీటకాలు, పురుగుల పెంపకం వంటి చర్యలద్వారా ఉత్పత్తి పెరిగింది. డీసాలినేషన్ ప్లాంట్ విస్తృతంగా ఉపయోగించుకుంటోంది. వ్యవసాయం కోసం శుద్ధి చేసిన మురికినీటిని పునర్వినియోగం చేస్తుంది. లీకేజ్లను కనిపెట్టి, నీటి వేస్టేజ్ తగ్గించడానికి ముందస్తుహెచ్చరిక వ్యవస్థలు, కంప్యూటరీకరించిన బిందుసేద్యం, మైక్రో స్పింక్లర్లు మొదలైనవి వాడుతుంది.

# సాగులో వెనుకబడిన సాంకేతికత

**సిహెచ్ వి వి రఘుబాబు**

దేశంలోని వ్యవసాయ రంగంలో అధునిక సాంకేతిక పరిజ్ఞానం అంతంత మాత్రంగానే అమలవుతోంది. అవగాహన లేకపోవడం, ప్రభుత్వాలు విస్తృతంగా రైతులకు తెలియ చేసేలా ప్రచారం చేయకపోవడం వంటి కారణాలతో రైతులు ఇంకా సాంకేతిక వైపు మళ్లడం లేదు. ఇండియాలో ఎక్కువ మంది వ్యవసాయ రంగాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. భారత ఆర్థికవ్యవస్థకు వ్యవసాయం కేంద్ర బిందువుగా ఉంది. రైతు సేద్యంచేస్తారు. ప్రభుత్వం అతనికివిద్యుత్, ధరల విషయంలో చట్టపరమైన సహకారం అందిస్తుంది. ప్రైవేటు వ్యాపారులు పంటకు విలువను జోడిస్తారు. దాన్ని వినియోగదారుడి దగ్గరకు చేర్చే పాత్రను మార్కెట్ పోషిస్తుంది. అయితే, ఈ వ్యవస్థలోని కొందరి అసమర్థత కారణంగా దేశంలో అదనపు ఉత్పత్తి ముఖ్యంగా వరి, గోధుమల విషయంలో ఎక్కువగా జరిగింది. 1950లో సుమారు 5 కోట్ల టన్నులుగా ఉన్న ఈ అదనపు ఉత్పత్తి, నేడు 50కోట్ల టన్నులకు చేరుకుంది. కానీ, ఇప్పటికీ దేశంలోని పంటల దిగుబడి రేటు మాత్రం తక్కువగానే ఉంది. ప్రపంచ సరాసరి దిగుబడితో పోల్చినప్పుడు ఈ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. అమెరికా తర్వాత అత్యధిక శాతం వ్యవసాయ భూమి ఉన్న దేశం భారత్. దిగుబడిలో మాత్రం ఆ దేశం కన్నా నాలుగురెట్లు వెనకబడి ఉంది. భారత్‌తో పోల్చినప్పుడు చైనాలో సేద్యపు భూమి తక్కువ, కానీ దిగుబడి ఎక్కువ. భారతదేశపు సగటు వ్యవసాయ భూకమతం వినియోగం 1.08 హెక్టార్లు కాగా చైనాలో అది 0.67 హెక్టార్లుగా ఉంది. కానీ ఆ దేశ వ్యవసాయోత్పత్తి భారత్ కన్నా మూడింతలు ఎక్కువ. వ్యవసాయంలో వైవిధ్యంతోపాటు పరిశోధన, అభివృద్ధి మీద వారు ఎక్కువ దృష్టిపెడతారు. భారతీయ జనాభాలో ఎక్కువ మందికి వ్యవసాయం అనేది జీవనోపాధికి ప్రధాన వనరు అయినప్పటికీ ఇప్పటికీ సాంకేతిక పరంగా ఇంకా వెనుకబడి ఉంది. మరో పక్క ప్రధాన మంత్రి ధన్‌ధాన్య కృషి యోజన పథకం అందుబాటులోకి తెస్తోంది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, భారతదేశం అంతటా స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే లక్ష్యంతో దీనిన్ని అమలు చేయాలని కేంద్ర మంత్రివర్గం తీర్మానించింది. ఈ పథకం 11 వేర్వేరుమంత్రిత్వ శాఖల నుండి ఇప్పటికే ఉన్న 36 పథకాలను విలీనం చేస్తుంది. ఇది 2025-26 నుండి ప్రారంభమయ్యే ఆరు సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ.24,000 కోట్ల ఆర్థిక వ్యయాన్ని కలిగి ఉంటుంది. దేశవ్యాప్తంగా 1.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చడం దీని లక్ష్యం. 112 వెనుకబడిన జిల్లాలను వ్యవసాయ ఉత్పత్తులను పెంచడం వంటి



వాటిలో అభివృద్ధి చెందేలా చేయనుంది. ఇదే సమయంలో వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆర్థిక వ్యవస్థకు ప్రాముఖ్యత ఉన్నప్పటికీ ఈ రంగాన్ని పునరుద్ధరించడానికి భారత ప్రభుత్వం చాలా తక్కువ మొత్తంలో నిధులను కేటాయిస్తున్నది. పనిముట్ల నుండి ఫైనాన్సింగ్ వరకు కూడా భారతీయ వ్యవసాయ రంగం అనేక సమస్యలతో బాధపడుతోంది. నాణ్యత, పరిమాణం, పంపిణీ నిల్వకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించడం ద్వారా టెక్నాలజీ భారతీయ వ్యవసాయాన్ని మార్చగలదు. వ్యవసాయ ఉత్పత్తుల సమాచారం ఎల్లపుడు రైతులు గత సీజన్ పోకడల ఆధారంగా పంటలను ఎంచుకుంటు ఉంటారు. వాతావరణ పరిస్థితులు, ఎక్కువ డిమాండ్ గల విషయాలు, ధరల యొక్క హెచ్చుతగ్గుల వివరాలను జాగ్రత్తగా విశ్లేషించడానికి ప్రస్తుతం పెరిగిన సాంకేతికత పరిజ్ఞానం వారికి సహాయపడుతుంది. అలాగే ఈ టెక్నాలజీ సరఫరా డిమాండ్ మధ్య మంచి సమతుల్యతను సృష్టిస్తుంది. టెక్నాలజీ ఎనేబుల్డ్ ఫార్మింగ్ టూల్స్ అనేది చిన్న చిన్న పొలాలకు ఒక వరంగా మారింది. అభివృద్ధి చెందిన దేశాలలో ఉపయోగించే పెద్ద యంత్రాలు మన చిన్న పొలాలలో ఉపయోగించడానికి సరిపోవు. చిన్న పొలాలకు అనువైన యాంత్రికరణలను ఉపయోగించడం ముఖ్యమైన భాగం. అలాగే తక్కువ సమయంలో ఎక్కువ పనిని చేయడానికి కూడా ప్రేరిపి స్తాయి. దేశంలో కొత్త టెక్నాలజీలు వ్యవసాయ రంగం అభివృద్ధి చెంద డానికి, మంచి దిగుబడిని సాధిం చడానికి ఆ పంటకు తగ్గ స్థలాన్ని గుర్తించడం చాలా అవసరం. వ్యవసాయ రంగంలో మొబైల్ అప్లికేషన్స్ స్మార్ట్‌ఫోన్‌లు తక్కువ ధరలో దొరు కుతున్న కారణంగా రైతులు డిజిట లైజేషన్ పరంగా అడుగులు వేయాల్సి న అవసరం ఉంది. ఈ కొత్త మొబైల్ అప్లికేషన్స్ సాంకేతికత వ్యవసాయ రంగంలో కూడా ప్రయోజనాల సామర్థ్యాన్ని పెంచే వీలుకలుతుంది. అలాగే వ్యవసాయ ఉత్పత్తుల వస్తువుల కోసం ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ పోర్టల్ అయిన ఇనామ్ (నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్)తో వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. రైతులకు ప్రయోజనం చేకూర్చే కొన్ని రాష్ట్రాలు వ్యక్తి గత కార్యక్రమాలు చేపట్టాయి. పంజాబ్ ప్రభుత్వం పంజాబ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌ను ప్రవేశ పెట్టింది. వీటితో పాటుగా ఐఖెట్ మెన్, ఇపెహాల్ ఇప్రివెంట్ వంటి మరో అప్లికేషన్లు కూడా ఉన్నాయి. ఇక వ్యవసాయ రంగంలో డ్రోన్స్ పనితీరు విషయానికి వస్తే ఇది పంటల అన్ని రకాల డేటాను సేకరిస్తుంది. ఇవి ఖచ్చితమైన లేదా స్మార్ట్ వ్యవసాయం కోసం అవసరమైన ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తుంది. సరైన సెన్సార్లను ఉపయోగించడం ద్వారా డ్రోన్లు రైతులకు వారు ఎంచుకోవలసిన పంటలు, నేలక్షీణత, పొడి ప్రాంతాలు, ఫంగల్ ఇన్ఫెక్షన్ మొదలైన వాటికి సంబంధించిన నిజమైన సమాచారాన్ని అందించగలవు. అలాగే ఈ డ్రోన్లను ఉపయోగించి పంట పొలాలపై మందులను పిచికారీ చేయడానికి కూడా ఉపయో గిస్తారు. కానీ వీటని రైతాంగానికి అందుబాటలో తేవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత శ్రద్ధ చూపించడం లేదు. కలుపు తీయడం విత్తనాలను నాటడం వంటి వాటికి చిన్నచిన్న పనిముట్ల ను అందుబాటు ధరలో లభిస్తున్నాయి. ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేయడానికి రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు ముందుకు రావడం లేదు. వ్యవసాయంమీద ఆధారపడే పడే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆఫర్లను అందిస్తున్నా ఆ సమాచారం వారికి చేరడంలేదు. వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేయడానికి లోన్‌లను సబ్సిడీ ధరలకు అందిస్తున్నాయి. కాని బ్యాంకులు రైతులకు రుణాలపై యంత్రాలను అందించేందుకు ముందుకు రావడం లేదు. కొత్తగా రైతులకోసం కేంద్రప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డులను కూడా అందించడం మొదలు పెట్టింది. కిసాన్ క్రెడిట్ కార్డ్‌ల ద్వారారైతులు రాయితీ రేటుకురుణాలుతీసుకోవడానికి వీలు కల్పిస్తుంది. మనీలెండర్లు వసూలు చేసే అధికరేట్ల నుండి రైతులను కాపాడడానికి రూపొందించిన ఈ పథకం కింద రైతులు రెండు శాతంకంటే తక్కువ వడ్డీరేటుతో రుణాలను పొందవచ్చు. అంతేకాకుండా లబ్ధిదారులు వారు తీసుకున్న మొత్తాన్ని పంట కోత లేదా మార్కెటింగ్ వ్యవధిపై ఆధారపడి తిరిగి చెల్లించే అవకాశాన్ని కూడా అనుమతిస్తుంది. ఈకార్డుల ద్వారా ప్రతి రైతు సుమారు మూడు లక్షల వరకు రుణమొత్తాన్ని పొందవచ్చు. కానీ ఇక్కడ కూడా రైతులకు బ్యాంకులు అన్యాయమే చేస్తున్నాయి. నిరక్షరాస్యులైన ఎక్కువ మంది రైతులకు కిసాన్ క్రికెడిట్ కార్డులు గూర్చి తెలియని పరిస్థితి ఉంది. రుణాల నిమిత్తం సహకార సంఘాలు, బ్యాంకుల్లో రైతులకు ఖాతాల ఉన్నప్పటికీ, వారందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వడం లేదు. తెలిసిన రైతులు దరఖాస్తు చేసుకున్నా వారికి కార్డులు మంజూరు చేయకుండా బ్యాంకులు మోకాలడ్డుతున్నాయి. వీటన్నింటిని అధిగమించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలంటే అందుకు కేంద్ర, రాష్ట్రాలు గట్టి కృషి చేయడం ద్వారానే లక్ష్యాలను అధిగమించే వీలుంటుంది. ●

బీహార్

# 'సర్' కొరడా!

**ఎ.వి.వి ప్రసాద్**

అసలే కోతి.. ఆపై కల్లు తాగింది.. ఇక చెప్పేదేముంది! దాని రచ్చకు హద్దేం ఉంటుంది! బీహార్‌లో ఉన్న పరిస్థితి ఇప్పుడు అదే. అసలే బీహార్, ఆపై ఎన్నికలు అనుకోవలసిందే. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నుంచి, ఆ సీటులో కూర్చోవాలనుకుంటున్న తేజస్వి యాదవ్, చిరాగ్ పాశ్వాన్ వరకు అంతా ఒక రేంజిలో రెచ్చిపోతున్నట్లే కనిపిస్తుంది. ఒకరిపై ఒకరు ఆరోపణలు దాటి పార్టీ వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు జరుపుకోవడం వరకు వెళ్తోంది. కాలు కదపలేక పోయినా మెదడు చురుగ్గానే ఉన్న మాజీ సిఎం, అవినీతి కేసుల ఊబిలో కూరుకుపోయిన లాలూ యాదవ్ కూడా తాను తక్కువ తిన్నదేమీలేదని మరోసారి ప్రతాపం చూపుదామనుకుంటున్నారు. ఎన్నికల పండుగ ఇక మూడు నెలల్లోకి రావడంతో అంతా బాగానే ముస్తాబవుతున్నారు. అయితే అక్కడే ఎన్నికల కమిషన్ కూడా బరిలోకి దిగి తన కొరడా ఝళిపించడంతో అంతా ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. ఇసి చేతిలో ఉన్న ఆ కొరడా 'సర్' ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ). ఇప్పుడు అన్ని పార్టీల నేతలు గగ్గోలు పెడుతూ సర్ చుట్టూ తిరుగుతున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నుంచి ఆర్జేడీ ఛోటా నాయకుడి దాకా అందరూ 'సర్'ని దుమ్మెత్తి పోస్తుంటే బిజెపి, ఎన్డీయేలోని మిత్ర పక్షాలు మాత్రం ఇసి చర్యకు హారతి పడుతున్నాయి. బీహార్ ఓటర్లలో స్థానికులను డామినేట్ చేస్తూ నేపాలీలు, రోహింగ్యాలు, మయన్మార్, బంగ్లా జాతీయులు ఉన్నారనీ, వారి ఓట్ల కారణంగా ఫలితాలు తారుమారయ్యే ప్రమాదం ఉన్నదనీ కొన్ని పార్టీలు శంక లేవనెత్తడంతో ఇసి రంగంలోకి దిగింది. వెంటనే 'సర్'ను ప్రకటించి అటువంటి అనర్హఓట్లు రాష్ట్రంలో 35.65లక్షల దాకా ఉన్నట్లుతేల్చింది. రాష్ట్రంలో నమోదైన మొత్తం ఓటర్లు 7.90 కోట్లు ఉండగా, వారిలో 5.76లక్షల మంది పేర్లు పలు చోట్ల ఉన్నాయటట. ఓటర్ల జాబితాల్లో ఇది సాధారణంగా కనిపించే అసాధారణ అంశమే అయినా, మరీ అన్ని లక్షల్లో ఉండడం ఆశ్చర్యకరమే. ఇంకా ఓటర్లుగా చెలామణి అవుతున్న'మృతులు'12.55 లక్షల దాకా ఉన్నారట. ఇది మరింతఆశ్చర్యకరం. అంటే అన్ని ఓట్లను కొన్ని పార్టీలు యధేచ్ఛగా తమ గెలుపు కోసం ఉపయోగించుకొంటున్నాయన్న మాట. జాబితాల్లో ఉన్న చిరునామాలు వేరు, ఆ ఓటర్లు ఉంటున్న ప్రదేశాలు వేరు. అటువంటి వారు కూడా అధికసంఖ్యలోనే ఉన్నారు. జాబితాల్లోనే ఉన్నా, వ్యక్తులు ఎదురుగా కనిపిస్తున్నా వారువారేనని నిరూపించుకోగల'ఆధార' పత్రాలు లేని వారు కూడా లక్షల్లోనే ఉన్నారు. పార్టీలు ప్రత్యేకంగా తయారు చేసిన ఓటర్లు మరికొన్ని లక్షలు ఉన్నారు. ఇలా కొన్ని పార్టీల గెలుపునకు సందర్భాను సారంగా ఉపయోగపడే ఓటర్లు దాదాపు 36 లక్షలు ఉండడంతో ఇసి కూడా ఆశ్చర్యపోతోంది. అందుకే 'సర్'ను రంగంలోకి దింపింది. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అసలు ఓటర్లు ఎవరో, నకిలీ ఎవరో గత రెండు వారాలుగా నిగ్గుతేల్చడం ఆరంభించారు. ఇసి ఈ సర్ కొరడా ఝళిపించేసరికి పార్టీల వెన్నులో వణుకు మొదలైంది. దాదాపు 36 లక్షల ఓటర్లను జాబితాల నుంచి తొలగిస్తే దాదాపు నాలుగున్నర శాతం ఓట్లు మాయమైపోతాయి ఒక్క శాతం ఓట్లు తగ్గితేనే దాదాపు 20 సీట్లు పడిపోతాయి. దానితో పార్టీలు, నేతలు డీలా పడిపోతున్నారు. నాలుగున్నర శాతంఓట్లు తొలగిస్తే దాదాపు 100 సీట్లు తారుమారవుతాయి. అంటే ఏదో ఒక రకంగా అధికారంలోకి రావాలనుకొనే నేతల వ్యూహాలు తలకిందులవుతాయి. అందుకే ఈ గగ్గోలు. 7.89కోట్ల ఓటర్లలో 6.60 కోట్ల మంది పేర్లు సరైనవని తేలినట్లు ఇసి గత సోమవారం ( 14,జూలై) అధికారికంగా ప్రకటించింది. అంటే 83.66 శాతం మంది ఓటర్లు వివాదరహితంగా ఉన్నారన్నమాట. ఇంకా దాదాపు కోటి మంది పేర్లు ఖరారు కావలసి ఉంది. వాటిలో ఎన్ని మళ్లీవివాదంలో చిక్కుకొంటాయో తెలియదు. ఆ పేర్లన్నీ యధాతథంగా ఉంచాలనీ, కేంద్రం కుట్రవల్లే ఈపరిస్థితి తలెత్తిందనీ విపక్షాలు విమర్శిస్తున్నాయి. కేంద్రంలోని అధికార బిజెపికి ఎన్నికల కమిషన్‌తొత్తుగా మారిందనీ, మోడీ, అమిత్ షా కనుసన్నల్లో ఇసి పనిచేస్తోందనీ రాహుల్, తేజస్వి యాదవ్ ఘాటుగానేలో ఆరోపిస్తున్నారు కానీ ఇసి తనపనితాను చేసుకుపోతోంది. ఓటర్లందరు తమ ధ్రువపత్రాలు సమర్పించవలసిన గడువుముగుస్తుండడంతో పత్రికాప్రకటనల ద్వారా ఇసి వారినిజాగృత పరుస్తోంది. అయినా నిర్లిప్తంగానే ఉన్నవారు ఇంకా 15లక్షలమంది వరకు ఉన్నారట. ఓటరుజాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' సబబేఅయినా ఎన్నికలు సమీపిస్తున్నవేళ మొదలు పెట్టడమేమి టని కూడా చాలామంది ప్రశ్నిస్తున్నారు. కొన్ని విపక్షాలు, ప్రజాసంఘాలు ఇసిచేపట్టిన 'సర్'నుసుప్రీం కోర్టులో సవాల్‌చేశాయి కూడా. దానిపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. అటువంటి ప్రక్రియ అవసరమేనని అభిప్రాయపడుతూనే, ఎన్నికలముందు హడావుడిగా చేపట్టడమేమిటని సుప్రీంకోర్టుకూడా ప్రశ్నించింది. ఓటర్ల గుర్తింపు నకు పరిశీలించే పత్రాలలో ఆధార్, రేషన్, ఓటర్ ఐడి కార్డునూ చేర్చాలని ఇసికి సుప్రీంకోర్టు సూచించింది. అయితే ఆధార్‌ను ధ్రువపత్రంగా పరిగణించడానికి ఇసి కొన్నిఅభ్యంతరాలను వ్యక్తంచేస్తోంది. ఆధార్ కార్డుల్లో కూడా నకిలీలు పెరిగిపోవడమేఅందుకు కారణం. ఒకే వ్యక్తికి నాలుగైదు రకాల అడ్రస్‌లతో వేర్వేరు ఆధార్ కార్డులు ఉండడాన్ని కూడా ఇసి కనుగొనడంతో చాలాచోట్ల నిజమైన కార్డులున్నవారు సైతంవేరే ధ్రువపత్రాలు తేలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆకారణంగా కూడా చాలా మందిఓటర్లు కాలేకపోతున్నారు ఇవన్నీ కేంద్రం కుట్రలే అంటున్నాయి విపక్షాలు. బీహార్ అయ్యాక అసోం, బెంగాల్, కేరళ, తమిళనాడు ఎన్నికలు రాబోతున్నాయి. ఈ 'సర్' కొరడాను ఆ రాష్ట్రాల్లో కూడా ఇసి ప్రయోగిస్తుంది కనుక ఇప్పటి నుంచే గణన మొదలు పెడితే ఎన్నికల ముందు సమస్యలేర్పడకుండా ఉంటాయి. ముందు బీహార్ ఎలా గట్టెక్కుతుందో చూడాలి. ●



ఓటర్లు

జపాన్

# సంక్షోభాలు, సవాళ్లకు ఎదురీత!

**గన్ని మోహన్**

అమెరికాతో ఎదురవుతున్న సుంకాల ఆంక్షలు, దేశంలో పెరుగుతున్న జీవన వ్యయం, ధరల పెరుగుదల, నగదు కొరత వంటి వాటితో ఆసియాలోనే మూడో అతిపెద్ద దేశం అయిన జపాన్ ఇప్పుడు రాజకీయ సంక్షోభం ఎదుర్కొంటోంది. ఇప్పటికే గత ఏడాది అక్టోబరులో దిగువసభకు జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ప్రధాని షిగేరు ఇషిబాకు ఇప్పుడు ఎగువ సభ ఎన్నికలు సవాల్‌గా మారాయి. ఒక్క మాటలో చెప్పాలంటే సంక్షోభాలు, సవాళ్లకు ఇషిబా ఎదురీదుతున్నట్లుగా ఉంది. 248 సీట్లు ఉన్న జపాన్ ఎగువ సభలో ఇషిబా లిబరల్ డెమొక్రటిక్‌పార్టీ పైచేయి సాధించాలంటే తన సుదీర్ఘకాల మిత్రపక్షం కోమీటోతో కలిపి 50 స్థానాలు అదనంగా గెలవాలి. మొత్తం66 స్థానాలు ఇప్పుడు ఎన్నికలకు వచ్చాయి. వీటిలో 50 స్థానాలు విధిగా గెలిస్తేనే ఇషిబాకు అటు ప్రజల్లో విశ్వాసం పెరగడం, ప్రభుత్వంపైనా పాలకపక్షం పైనా పట్టు సాధించుకోగలుగుతారు. నిజానికి గత ఏడాది అక్టోబరులో జరిగిన దిగువ సభ ఎన్నికల్లో ఎల్డీపీతో పాటు సంకీర్ణ పక్షం కోమీటో రెండూ కూడా ఘోరంగా విఫలం అయ్యాయి. జపాన్‌కు అత్యంత శక్తివంతమైన దిగువ సభలో వీరు తమ పట్టును నిరూపించుకోలేకపోయారు. 2009లో అధికారం కోల్పోయిన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో కూడా షిగేరు పట్టుసాధించడంలో పూర్తిస్థాయి విజయం సాధించలేకపోయారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సుదీర్ఘ కాలం జపాన్‌లో ఎల్డీపీయే పాలించింది. అలాంటి పార్టీకి ఇప్పుడు గడ్డుకాలం ఎదురయింది. ఇక ఎగువ సభ ఎన్నికల్లో ముఖ్యంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం కూడా ప్రధాన సమస్య. బియ్యం ధరలు దాదాపుగా రెట్టింపు అయ్యాయి. దిగుబడులు లేకపోవడం, ప్రభుత్వ విధానాలు వంటివి ధరల పెరుగుదలకు కారణం కాగా ప్రజల్లో ఎల్డీపీ పట్ల అసంతృప్తిని పెంచేందుకు దోహదం చేసింది. ఇందుకు ధీటుగా ప్రతిపక్షాలు పన్నుల్లో కోతలు ఉంటాయని, సంక్షేమ పథ కాలు కొనసాగిస్తామని, జపాన్‌ను దీర్ఘకాలంగా పీడిస్తున్న ఆర్థిక ప్రతిష్టంభనకు తెరదించుతామని వాగ్దానాలు చేస్తూ ఎన్నికలకు వస్తున్నాయి. నిజానికి ప్రజలకు దేశంలో కరెన్సీ యెన్ మరింత క్షీణించడంతో జీవన వ్యయం మరింత పెరిగింది. దీనివల్ల విదేశీ టూరిస్టులు ఎక్కువ మంది వస్తున్నారు. స్థానిక సాంప్రదాయాలకు విలువలు పోతున్నాయన్న అసంతృప్తి అసమ్మతి కూడా ప్రజల్లో పెరగడంతో ప్రతిపక్షంలో ఉన్న శాన్‌సీటో ఇదే అస్త్రంగా వాడుతోంది. గడచిన కొవిడ్-19తో ఈపార్టీకి ప్రజల్లో మరింత ఆదరణ పెరుగుతూ వస్తోంది. ఇప్పుడు అమెరికా తరహాలోనే జపనీస్ ఫస్ట్, జపాన్ ఫస్ట్ నినాదంతో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేసింది. అలాగే అక్రమ వలసలను సమూలంగా నిర్మూలిస్తామని హామీలు ఇస్తోంది. వలసదారులపై చాపకిందనీరులా దండయాత్ర తప్పదన్న హెచ్చరికలతో ప్రజల్లో చొచ్చుకుపోతున్నది. మొత్తం జనాభాలో 3శాతం వరకూ వలస దారులే ఉన్నందున జపాన్‌కు వస్తున్న అక్రమ వలసదారులను కట్టడిచేస్తే దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు దేశంలో జీవన వ్యయం కూడా నియంత్రించుకోగలుగతామని ఈ పార్టీ వాదిస్తోంది. గడచిన మూడు దశాబ్దాల్లో పది లక్షల మంది వలస ఉద్యోగుల వల్ల జపనీయులకు ఉద్యోగ భద్రత కొరవడిందన్న వాదనను తెరపైకి తీసు కురావడంతో అధికారంలో ఉన్న షిగేరుకు కొత్త సమస్యలు ఎదురయినట్లయింది. శాన్‌సీటో వ్యవ స్థాపక అధ్యక్షుడు 47 ఏళ్ల కామియా ఎన్నికల్లో గెలవాలంటే ప్రస్తుత ప్రభుత్వం పెరుగుతున్న వసలకు జవాబు చెప్పాల్సి ఉంటుందని చెప్పారు. గతంలో ఎవ్వరైనా వలసలపై మాట్లాడితే వామపక్షాలు తీవ్రస్థాయిలో దాడికి దిగేవి. ఇపుడు మాకు వలసలపై ప్రజలనుంచి మద్దతు లభిస్తోందని ఎల్డీపీ, కోమీటో ఇపుడు మౌనంగా ఉంటే చాలదని ప్రధాన సమస్య సవాలుగా మారిన వలసలపై జవాబు చెప్పాల్సిందేనని ఆయన పట్టుబడుతున్నారు. అయితే ఎన్నికల్లో శాన్‌సీటో పార్టీ కేవలం పదినుంచి 15కి మించి సీట్లు సాధించలేదన్న సర్వేలున్నా ప్రధాని ఇషిబాకు ఈ స్థానాలు కూడా కొంత విఘాతం కలిగించేవే. ఎల్డీపీ సంకీర్ణంలో సీట్ల సంఖ్య తగ్గితే ఇషిబా తన పట్టునిరూపించుకునేందుకు మరిన్ని అస్త్రాలు ప్రయోగించాల్సి ఉంటుంది. ప్రతిపక్ష పార్టీలతో కొన్ని రాజీసూత్రాలకు దిగాల్సి ఉంటుంది. అలా కాని పక్షంలో ఇషిబా పదవినుంచి దిగిపోయే ముప్పు తప్పదని మేధావులుఅంచనా వేస్తున్నారు. అదే జరిగితే జపాన్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం ఉధృత రూపం దాలుస్తుంది. వీటన్నింటిని పక్కన పెడితే అమెరికా వచ్చే ఆగస్టు ఒకటినుంచి 25 శాతం సుంకాలు వేస్తామని ప్రకటించింది. సుంకాలను అధిగమించేందుకు అత్యవసరంగా అమెరికా, జపాన్ ఆర్థిక మంత్రులు చర్చలకు దిగారు. చర్చల అనంతరం ఒక మంచి డీల్ కుదిరిందని అమెరికా ఆర్థిక మంత్రి బెస్సెంట్ వెల్లడించడంతో అధికార కూటమికి కొంత ఊరట లభించింది. పరస్పరం ప్రయోజనకారి అయిన ఆర్థిక ఒప్పందం జపాన్ అమెరికాల మధ్య సానుకూలం అవుతున్నదని అమెరికా ఆర్థికమంత్రి స్వయంగా ప్రకటించడంతో ఎగువసభ ఎన్నికల పరంగా ప్రధాని షిగేరు ఇషిబాకు కొండంత బలం చేకూరినట్లయింది. ఆసియా ఖండం మొత్తం జిడిపిలో 10.89 శాతం వాటాతో ఉన్న జపాన్ జనాభా 12.31 కోట్లమంది మాత్రమే. అయితే కూడా మేధావులకు కొదవలేదు. శాస్త్రసాంకేతిక రంగాల్లో నిపుణులకు కొదవలేదు. ప్రపంచ వ్యాప్తంగా 11వ ప్రభావవంతమైన దేశం అయిన జపాన్‌లో మొత్తం జనాభాలో 93.1శాతం పట్టణ ప్రాంతాల్లోనే జీవిస్తారు. ఆర్థికవృద్ధిలో ఒకప్పుడు చైనాతో పోటీపడిన ఈ దేశం ఇప్పుడు విభిన్న సంక్షోభాలతో సతమతం అవుతోంది. ఈ సవాళ్ల నుంచి ప్రస్తుత ప్రధాని ఇషిబా బయటపడిఆర్థిక వ్యవస్థను ఎలా గాడిన పెడతారన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా నిలిచింది. ●



షిగేరు ఇషిబా

# బనకచర్ల ప్రాజెక్టుపై వివాదం ఎందుకు!

**బొల్లిముంత సాంబశివరావు**

తెలుగు రాష్ట్రాల మధ్య పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టు వివాదం రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సృష్టి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన ప్రాజెక్టు డిజైన్ దృష్ట్యా అది ఉపయోగం లేనిది. ఉపయోగంలేని ప్రాజెక్టు గురించి వివాదం ఎందుకు. ఏపీ ప్రభుత్వం పంపిన బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ వెనక్కి పంపింది. కేంద్ర జల సంఘం అనుమతి తీసుకోకపోవటమే అందుకు కారణం. పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ (ప్రాజెక్టు సమగ్ర రూపం) ప్రతిపాదన) రూపకల్పనకు అనుమతి కోరుతూ ఏపీ ప్రభుత్వం తరపునకృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీర్ మే 22న కేంద్ర జల సంఘంకు ప్రాథమిక నివేదికను సమర్పించారు. దీనిపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అభిప్రాయాన్ని కేంద్ర జలసంఘం కోరింది. దీనిపై పీపీఏ ఈ ప్రాజెక్టుకు నీరు ఇవ్వటం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. పోలవరం జలాశయంలో 41.15 మీటర్ల ఎత్తువరకే నీటి నిల్వతో ప్రాజెక్టు పూర్తి చేయటానికి కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందని, ప్రాజెక్టు నీరుదాని ఆయకట్టు భూములకే సరిపోదని, అలాంటప్పుడు బనకచర్లకు నీరు ఇవ్వటం ఎలా సాధ్యమని పీపీఏ డైరెక్టర్ మన్నూ జీ ఉపాధ్యాయ కేంద్ర జల శక్తికి లేఖ వ్రాశారు. 45.72 మీటర్ల ఎత్తున నీటిని నిల్వ చేసేలా పోలవరాన్ని పూర్తి చేశాకే పోలవరం బనకచర్లపై ఆలోచన చేయవచ్చని స్పష్టం చేశారు. అసలు ఈ ప్రాజెక్టు పోలవరంలో భాగం కాదని పేర్కొన్నారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్టుపై తన అభిప్రాయాన్ని పోలవరం అథారిటీ చెప్పిన తర్వాత కూడా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఈ ప్రాజెక్టు గురించి చర్చించటానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఎందుకు పిలవాలి. ఇరువురు ముఖ్యమంత్రులు సమావేశానికి వెళ్లే విషయమై చేసిన విరుద్ధమైన ప్రకటనలపై చర్చలు సాగి చివరికి ముఖ్యమంత్రులు ఇద్దరూ కేంద్ర మంత్రి వద్దకు పోవటం, పైకి మాత్రమే ఇద్దరి మధ్య వివాదమని తేలింది. సమావేశం తర్వాత విలేకరులు బనకచర్ల ప్రాజెక్టు విషయం అడగగా, దానిపై చర్చే జరగలేదని, ఎజెండాలో లేని దాని గురించి మాట్లాడానికి ఏముందని, ప్రాజెక్టు కడతామని ఎపి ప్రస్తావిస్తే గదా, మేము ఆపమని అభ్యంతరం చెప్పేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అదే రాత్రి 7.27 గంటలకు కేంద్ర జల శక్తి శాఖ విడుదల చేసినప్రెస్ సమాచార ప్రకటనలో బనకచర్ల ప్రస్తావనే లేదు. ఎపి జల వనరుల మంత్రి నిమ్మల రామ నాయుడు బనకచర్లపై చర్చ జరిగిందని బనకచర్లపై నిపుణులతో కూడిన సాంకేతిక కమిటీ వేస్తామని ప్రకటించాడు. ముఖ్యమంత్రి రేవంతరెడ్డి, ఎపి జల వనరుల మంత్రి ప్రకటనలు పరస్పర విరుద్ధంగా ఉండటంతో గందరగోళానికి, అనుమానాలకు అవకాశం ఏర్పడింది. దీనిపై రెండు రాష్ట్రాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి. పోలవరం బనకచర్ల పై జరుగుతున్న రాద్ధాంతమంతా ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు అమలు జరపడంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం కావడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఈ వ్యతిరేకతను పక్కదారి పట్టించటానికే పోలవరం బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తెచ్చి రెండు రాష్ట్రాల ప్రజల మధ్య వివాదం సృష్టిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాగు నీటి రంగ విధానాలు రైతాంగ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎపిలో జల వనరులు పుష్కలంగా ఉన్నావాటిని వ్యవసాయానికి మళ్లించడంలో రాష్ట్ర పాలకులు విఫలమయ్యారు. చిన్న, మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణంకాకుండా కొద్ది భారీ ప్రాజెక్టుల వైపు మొగ్గు చూపారు. ఫలితంగా సాగు నీటి సమస్య కొనసాగుతుంది. రైతుల ఆందోళన ఫలితంగా సాగు, తాగు నీరు కోసమంటూ కొన్ని నీటి పథకాలు చేపట్టి దశాబ్దాలు గడిచినా అవి ఇంకా పూర్తి కాలేదు. ఫలితంగా రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, విజయనగరం జిల్లాలో కొన్ని ప్రాంతాలు కరువు పీడిత ప్రాంతాలుగా నేటికీ కొనసాగుతున్నాయి. పాలకుల విధానాల వెడల రైతాంగంలో వ్యతిరేకత వ్యక్తమైన ప్రతి సందర్భంలో కొత్త సాగునీటి పథకాలు ముందుకు తెస్తున్నారు. అందులో భాగమే కొత్తగా తెరమీదకు వచ్చిన పోలవరం బనకచర్ల ఎత్తిపోతల లింక్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, పల్నాడు ప్రాతాలకు సాగు నీరు, తాగు నీరు అందించటం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇందు కోసం తాజాగా 'జల హారతి కార్పొరేషన్ లిమిటెడ్' అనే సంస్థను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది అమరావతి కేంద్రంగా పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు అనుసంధానానికి 81,900 కోట్ల భారీ ఖర్చుగా అంచనా వేశారు. ఈ అనుసంధానం ద్వారా 12.4 లక్షల హెక్టార్ల భూమికి సాగు నీరు, 400 వందల కిలోమీటర్ల పొడవునా ఉన్న గ్రామాలకు తాగు నీరు, 340 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా కూటమి ప్రభుత్వ ప్రకటించింది. ఈ ప్రాజెక్టుకోసం 54 వేల ఎకరాల భూ సేకరణ అవసరమని పేర్కొంది. వరద నీటిని ఉపయోగించుకోవటానికే ఈ ప్రాజెక్టు నిర్మాణం చేస్తున్నట్లు చంద్రబాబు ప్రభుత్వం అంటే, ప్రాజెక్టు వల్ల తీవ్ర నష్టం జరుగుతుంది, ప్రాజెక్టు ప్రతిపాదన విరమించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం అంటున్నది. ఈ ప్రాజెక్టును నీటిపారుదల అధికారులు మూడు దశలుగా విభజించారు. మొదటి దశలో పోలవరం నుండి తాడిపూడి వరద కాలువ ద్వారా 175 కిలోమీటర్ల వరకు 18 వేల క్యూసెక్కుల డిశ్చార్జ్‌తో ప్రకాశం బ్యారేజ్‌కు నీటిని విడుదల చేస్తారు. దీనికి 1,401 ఎకరాల భూమి కావాలి. ఈ మొదటి దశకోసం 13,800 కోట్లు ఖర్చు చేయాలి. రెండవ దశలో ప్రకాశం బ్యారేజ్ నుండి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకు 23వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తారు. ఇందుకు 83.40 కిలోమీటర్ల మేర ఓపెన్ కెనాల్ నిర్మించి, 12.05 కిలోమీటర్ల పైప్‌లైన్, ఆరు లిఫ్ట్‌లు నిర్మించాలి. మూడవ దశలో బొల్లాపల్లి రిజర్వాయర్ నుండి బనకచర్ల రెగ్యులేటర్ 23 వేల క్యూసెక్కుల నీటి విడుదలతో నీటిని తరలిస్తారు. ఇందుకోసం 109.80 కిలోమీటర్ల మేర ఓపెన్ కెనాల్ నిర్మించాలి. మూడో దశ చాలా క్లిష్టమైనదిగా సాగు నీటి రంగ నిపుణులు చెబుతున్నారు. నల్లమడ పులుల అభయార్యంలో 34 కిలోమీటర్ల మేర సొరంగంతవ్వాలి. 2005లో ప్రారంభించిన వెలుగొండ ప్రాజెక్టు రెండు సొరంగాల తవ్వకం పనులు నత్తనడకన నడుస్తూ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ అనుభవరీత్యా నల్లమడలో తవ్వాల్సినఔ అత్యంత క్లిష్టమైన సొరంగం ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పలేము. ప్రస్తుతం రాష్ట్రంలో 59ప్రాజెక్టులు నిర్మాణంలోఉన్నాయి. దశాబ్దాలు గడుస్తున్నా వీటి నిర్మాణం పూర్తి కాలేదు. నిధులు కేటాయిస్తే తక్కువ వ్యయంతో అనేక ప్రాజెక్టులు పూర్తి చేయవచ్చు. ముఖ్యంగా వెలుగొండ ప్రాజెక్టు, వంశధార రెండవ దశ, వంశధార నాగావళి, మహేంద్ర తనయ, గజపతి నగరం బ్రాంచికాల్వ, చింతలపూడి ఎత్తిపోతల పథకం, అమరావతి తీర్థసాగరం, సోమశిల స్వర్ణ ముఖి లింక్, గాలేరు నగరి ప్రాజెక్టు తొలిదశ, రెండవ దశ, హంద్రీనీవా తొలిదశ, పల్నాడు ప్రాంతంలో వరికలపూడి సెల పథకం, ఈ పథకాలన్నీ రూ.20వేల కోట్లలోపే పూర్తి చేయవచ్చు. 50 నుండి రూ.100కోట్ల ఖర్చుతో ఇంకాఅనేక ప్రాజెక్టులు పూర్తి అవుతాయి. ఇవన్నీ పూర్తిచేస్తే సాగునీటి సమస్య దాదాపు పరిష్కారం అయినట్లే. రూ.20 వేలకోట్లలోపు ఖర్చు చేసి పైన పేర్కొన్న ప్రాజెక్టులు పూర్తి చేయకుండా, 81 వేల కోట్లతో ప్రయోజనం లేని పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును ముందుకు తేవటం ఎందుకు. ఇలాంటి విధానాల వల్లసాగు నీటి సమస్య ఇంకా సుదీర్ఘ కాలం కొనసాగుతుంది. సాగు నీరు ప్రశ్నార్థకమైన ఈ ప్రాజెక్టు కోసం దాదాపు 82 వేల కోట్లు ఖర్చు చేయటం సరైన విధానంకాదు. ఒక వేల పోలవరం బనకచర్ల ప్రాజెక్టుమొదలు పెట్టినా, రూపొందించిన దాని డిజైన్లదృష్ట్యా అదిపూర్తి కావటానికి ఎన్ని సంవత్సరాలకు పూర్తి అయ్యేది చెప్పలేము. పూర్తిఅయ్యే నాటికి అనుకున్న వ్యయంకన్నా దానివ్యయం ఎన్నోరెట్లు పెరుగుతుంది. వేల కోట్లు జేబులు మారతాయి. ప్రాజెక్టు పేరుతో 54 వేల ఎకరాలు తమ భూములు రైతులు కోల్పోతారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఈ లింక్ ప్రాజెక్టువల్ల రెండుతెలుగు రాష్ట్రాలమధ్య గోదావరి జలాల వివాదం ముందుకు వచ్చింది. రెండూ రాష్ట్రాల ప్రజల మధ్య వైషమ్యాలు పెరిగే పరిస్థితులు ఏర్పడతాయి. ప్రయోజనకరం కాని బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ ప్రతిపాదన విరమించాలని, తక్కువ ఖర్చుతో పూర్తి అయ్యే ప్రాజెక్టులను ముందుగా పూర్తి చేసి, నిర్మాణంలో ఉన్న మిగిలిన ప్రాజెక్టులను కూడా పూర్తి చేసి, సాగు, తాగు నీరు అందించాలని యావన్మంది ప్రజలు ఉద్యమించాలి. ●



## పి4 విధానం ద్వారా నిరుపేద కుటుంబాలను

# ఆర్థికంగా బలోపేతం చేయవచ్చు

బాపట్ల,జులై19,ప్రభాతవార్త: పి4 విధానం ద్వారా నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయవచ్చని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. శనివారం నందిరాజు తోట గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ముఖ్య అతిథిగా



హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4 పద్ధతిలో నిరుపేద కుటుంబాలకు సహాయం చేయవచ్చు అనే విధానాన్ని ఆయన రూపొందించారన్నారు. నందిరాజు తోట మరియు హైదరపేట గ్రామాలలో గతంలో 83 మందిని బంగారు కుటుంబాలుగా చేర్చడం జరిగిందని వారిలో సర్వే అనంతరము 16 కుటుంబాలను బంగారు కుటుంబాలను తొలగించడం జరిగిందన్నారు.. ఇప్పుడు కొత్తగా 39 మందిని బంగారు కుటుంబాలుగా ఎంపిక చేశామన్నారు. ఇప్పటివరకు రెండు గ్రామాలలో 106 మందిని బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయడమైనదని వారిలో 12 కుటుంబాలు షెడ్యూలు తెగలకు(ఎస్.టి) చెందిన వారిని, 57 కుటుంబాలు షెడ్యూల్ కులాలకు( ఎస్ సి ) చెందిన వారని, 36 కుటుంబాలు వెనుకబడిన తరగతులు( బిసి ) చెందిన వారిని, ఒక కుటుంబం ఇతరులకు( ఓసి ) చెందిన వారని ఆయన తెలిపారు.నందిరాజుతోట గ్రామంలో సుమారు 1050 కుటుంబాలు ఉన్నాయని, ఇక్కడ 3 వేలు పైచిలుకు జనాభా నివసిస్తున్నారని ఆయన అన్నారు. ఆదాయ విషయంలో తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలు లెక్కల ప్రకారం 150 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఇదే గ్రామంలో కొంత ఉన్నత స్థితిలో ఉన్న వారిలో 16 మంది మార్గదర్శకులుగా ముందుకు వచ్చారని తెలిపారు. ఈ మార్గదర్శకులు ఒక్కొక్కరికి సుమారు 10 కుటుంబాల చొప్పున దత్తత తీసుకొని వారికి సహాయం చేయడానికి ఆలోచన చేయాలన్నారు. బంగారు కుటుంబాలకు ఎన్నికైన కుటుంబాల యొక్క స్థితిగతులను, వారి అవసరాలను, ఆదాయాలను గురించి ప్రతి ఒక్కరిని ఆయన అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మార్గదర్శకులుగా ముందుకు వచ్చిన 16 మంది యొక్క స్థితిగతులు, వారు బంగారు కుటుంబాలకు చేసే సహాయం గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థాయి కమిటీ,మండల స్థాయి కమిటీ లో ఎక్కడా కూడా తప్పులు జరగకుండా బంగారు కుటుంబాలను నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. బంగారు కుటుంబాలకు సహాయం చేసే విధానంలో మార్గదర్శకులను బలవంతం చేసే పద్ధతి ఈ కార్యక్రమంలో లేదని ఆయన తెలిపారు. మార్గదర్శకులు డబ్బే కాకుండా మంచి సలహాలు, సూచనలు ఇచ్చి కూడా ఆ బంగారు కుటుంబాలను ప్రోత్సహించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారి జీవితంలో మాట సహాయం ఎంతవరకు ఉపయోగపడిందో వాటిని ఉదాహరణ కింద మార్గదర్శకులకు, బంగారు కుటుంబాలకు వివరించారు. మానవ జీవితంలో ఇతర వ్యక్తుల సహాయం అవసరం ఉంటుందని అన్నారు. మార్గదర్శకులకు బంగారు కుటుంబాలను ఏ విధంగా సహాయం చేయాలో ఆయన తెలిపారు. చేయూత అందించడమే మార్గదర్శకుల యొక్క పని అని, డబ్బు అందించడం అనేది చిట్ట చివరి విషయమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి గారు తలపెట్టిన ఈ కార్యక్రమం విజయవంతమవు తుందని పూర్తిగా నమ్ముతున్నానని ఆయన అన్నారు. మార్గదర్శకులు వారికి కేటాయించిన బంగారు కుటుంబాలతో ఒక గ్రూపు ఏర్పాటు చేసుకొని వారి యొక్క అవసరాలను తెలుసుకొని వాటిని తీర్చాలని ఆయన అన్నారు. నీడ్ బేస్డ్ సర్వే సోమవారం నుండి మొదలు పెట్టడం జరుగుతుందని సచివాలయ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది బంగారు కుటుంబాలకు ఎన్నికైన కుటుంబాలకు వెళ్లి వారి యొక్క అవసరాలను తెలుసుకొని వారి అవసరాలను యాప్ లో నిక్షిప్తం చేయాలని ఆయన తెలిపారు. బంగారు కుటుంబాలలో సర్వే మేరకు మార్పులు, చేర్పులు చేయవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు, సిపిఓ షోలేమ్ రాజు, బీసీ సంక్షేమ అధికారి శివలీల, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి.గ్లోరియా, ఎంపీడీవో బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# మాజీమంత్రి విడదల రజినికి సత్తెనపల్లి పోలీసులు నోటీసులు

చిలకలూరిపేట,జులై19,ప్రభాతవార్త: మాజీమంత్రి విడదల రజినిని శనివారం నరసరావుపేట రోడ్డులో గల ఆమె నివాసంలో సత్తెనపల్లి పోలీసులు కలిసి ఆదివారం విచారణకు రావాలని నోటీసులు జారీచేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రెంటపాళ్ల పర్యటనలో బాగంగా జనసమీకరణ చేశారు అనే కారణంతో అక్రమ కేసు బనాయించారని వైసిపి నాయకులు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం విచారణకు హాజరుకావాలంటూ పోలీసులు నోటీసులు జారీచేసినట్లు వైసిపి నాయకులు తెలిపారు.



# గుంటూరు వార్త

## కోలాహలంగా నందివెలుగు వంతెన పనులు

# పునఃప్రారంభం



గుంటూరు తూర్పు, జులై 19 (ప్రభాతవార్త) : గుంటూరు డెల్టా ప్రజల కల నెరవేరుస్తున్నందుకు సంతోషంగా ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నగరంలోని నందివెలుగు ఫ్లైఓవర్ బ్రిడ్జి పున:నిర్మాణ పనులను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమీషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ షేక్ సజిల, కుందుర్తి డెవలప్మెంట్ కార్పోరేషన్ డేగల ప్రభాకర్, తొలుత ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో కూటమి నేతలు, కార్యకర్తలు స్థానిక తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా వెళ్ళారు. జై చంద్రబాబు, జై పెమ్మసాని, జై నసీర్ అంటూ నినాదాలు చేసుకుంటూ బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ

**-ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**
**-అబ్దుల్ కలాం నందివెలుగు బ్రిడ్జిగా నామకరణం**
**-కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానితో కలిసి బ్రిడ్జి పనులు పున:ప్రారంభం**
**-చంద్రబాబు, పెమ్మసానికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పిన ఎమ్మెల్యే నసీర్**
**-6-8నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడి**

అబ్దుల్ కలాం నందివెలుగు బ్రిడ్జిగా నామకరణం చేస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్ళుగా నిలిచిన బ్రిడ్జి పనులకు తిరిగి ప్రారంభించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పాత ప్రభుత్వ హయాంలో ఒక్క ఇటుక కూడా వేయని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. 6-8నెలల్లో బ్రిడ్జి పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు వేగంగా చేపడుతున్నామని వెల్లడించారు. ప్రతిరోజు వేలాది మంది ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపించనున్నామని తెలిపారు. అర్ధంతరంగా నిలిచిపోయిన నందివెలుగు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గత ఐదేళ్ళలో తాము పోరాటాలు చేశామని, అయితే కనీసం పట్టించుకోలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషి, ఆర్ఓబీ ప్రాజెక్ట్‌కు ముందడుగు పడిందని చెప్పారు. వెంటనే రీ-ఎస్టిమేషన్, నిధుల మంజూరుకు చేయించారని అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం సహకరించిన సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నాడు జగన్ రాక్షస పాలన..నేడు చంద్రబాబు సుపరిపాలన

## ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

నూజెండ్ల,జులై19,ప్రభాతవార్త: రాష్ట్రంలో నాడు జగన్ రాక్షస చూసి విసిగిపోయిన ప్రజలు నేడు చంద్రబాబునాయుడు చేస్తున్న సుపరిపాలనకు బ్రహ్మరథం పడుతున్నారని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు అన్నారు. శనివారం మండలకేంద్రమైన నూజెండ్లలో నిర్వహించిన



సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో జీ.వీ పాల్గొని ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జీ.వీ మాట్లాడుతూ జగన్ వ్యవస్థలన్నింటిని నాశనం చేశారని,మద్యం మాఫియాతో వేల కోట్లు దోపిడి చేసి తడిగుడ్డతో ప్రజల గొంతులు కోశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిట్ విచారణలో భాగంగా జరుగుతున్న అరెస్టులన్నీ చాలా చిన్న చిన్న చేపలవే అని, అసలు తిమింగలాన్ని త్వరలోనే ఆధారాలతో సహా ప్రజల ముందు నిలబెడతామన్నారు. నాడు నాసిరకం మద్యం సేవించి వేల మంది ప్రాణాలు కోల్పోయారని ఈ పాపం జగన్‌ను వదలదన్నారు. ప్రజలు నమ్మి అవకాశం ఇస్తే ఐదేళ్ళు పాలించిన జగన్ రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ మాఫియాను ఉక్కుపాదంతో అణిచివేసిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని,ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దండి : కలెక్టర్, ఎమ్మెల్యే

నరసరావుపేట, జూలై 19 ప్రభాతవార్త : ప్లాస్టిక్ రహిత జిల్లాగా పల్నాడును తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



అరవింద్‌బాబులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవాళి మనుగడకు ప్లాస్టిక్ నిర్మూలన ఎంతో ముఖ్యమన్నారు. ప్రధానంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడటం ఆపి వేయాలన్నారు. జూట్ బ్యాగులను వినియోగించాలన్నారు. షాపింగ్‌కు వెళ్ళిన సమయంలో జూట్ బ్యాగులను వాడాలన్నారు. అదే విధంగా ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ ను వాడటం ఆపి వేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో ప్రతిజ్ఞ చేయించారు.

# ప్రతి ఎకరాకు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## కలెక్టర్, ఎమ్మెల్యేలు

నరసరావుపేట, జూలై 19 ప్రభాతవార్త : నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా సాగునీటి సలహామండలి సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి పంటలకు అవసరమైన సాగునీరు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. సలహామండలి సమావేశంలో ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, యరపతినేని శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ ఛైర్‌పర్సన్ పి.కాంతారావు, డిఆర్ఓ మురళీ పాల్గొని మాట్లాడారు. ఎస్.ఈ. పి.కృష్ణమోహన్



అధ్యక్షత వహించారు. నీరు వృధా చేయకుండా పంటల సాగుకు అందించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. రైతులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో తగిన ప్రణాళికలతో నీటి సరఫరాను కొనసాగించాలన్నారు. సమావేశంలో తీర్మానించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలియజేశారు.

**ఆగస్టు మొదటి వారంలో సాగునీటికి ప్రతిపాదనలు : ప్రభుత్వ చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు**

ఆగస్టు మొదటి వారంలో సాగునీటిని కాలువలకు విడుదల చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు అన్నారు. జిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఆయకట్టు ఛైర్‌పర్సన్ పి.కాంతారావుతో కలిసి వారు విలేకర్లతో మాట్లాడారు. రూ.334 కోట్లు ఖర్చు చేసి మేజర్, మైనర్ కాలువల మరమ్మత్తులు చేపట్టామని తెలియజేశారు. రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని, వారి సంక్షేమమే తమకు ముఖ్యమన్నారు.

# ఎస్ఆర్ఎంలో ఘనంగా ముగిసిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్

మంగళగిరి, జులై 19, ప్రభాతవార్త : ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించిన జాతీయ స్థాయి గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ శనివారం



సాయంత్రం ఘనంగా ముగిసింది. ఈ సదస్సులో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, వినిమయం. పెట్టుబడులు వంటి అంశాలపై ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంది. త్వరలో అమరావతిని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా అభివృద్ధి చేయనున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ అసోసియేషన్ ను ఏర్పాటు చేయాలని డిక్లరేషన్లో పొందు పరచనున్నామని ఏపీ రెన్యూవబుల్ ఎనర్జీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్ బాబు మీడియాకు వెల్లడించారు. అసోసియేషన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వానికి అందజేయనున్నామనీ, ఇందులో భాగంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, పరిశ్రమల స్థాపన వంటి అభివృద్ధి అంశాలపై ఏడాదికోసారి సమీక్ష నిర్వహించు కోనున్నామన్నారు. ఈ అసోసియేషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలువురు పారిశ్రామికవేత్తలు, వర్సిటీ నిపుణులు, మేధావులు సభ్యులుగా ఉంటారని వివరించారు.ఆకట్టుకున్న ప్లీనరీ సెషన్స్...గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ సందర్భంగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ప్లీనరీ సెషన్స్ వర్ధమాన పరిశోధకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన నిపుణులను యూనివర్సిటీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలను ప్రధానం చేసింది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య నారాయణరావు, యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, రెన్యువబుల్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ మేనేజింగ్ డైరెక్టర్ కమలాకరా బాబు, సుజిత్ పిల్లై, సమ్మిట్ కన్వీనర్ డాక్టర్ మారం పార్థసారది, సుజిత్ కల్లూరి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వినియోగం,విక్రయం నిషేధానికి చర్యలు తీసుకుంటాం : నగర మేయర్



గుంటూరు తూర్పు, జులై 19 (ప్రభాతవార్త) : స్వచ్ఛ గుంటూరులో భాగంగా నగరంలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధానికి కఠిన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం నుండి లాడ్జి సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం, స్వచ్ఛ ప్రతిజ్ఞ స్టేడియంలో క్లాత్ వెండింగ్ మెషిన్ ప్రారంభ కార్యక్రమాల్లో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమీషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం)సుధేష్ణసేన్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి , డిప్యూటీ మేయర్ షేక్ సజిలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల విచ్చలవిడిగా వినియోగం వలన డ్రైన్లలో అడ్డుపడి మురుగుపారుదలకు ఆటంకం ఏర్పడి ప్రజారోగ్యానికి భంగం కల్గుతుందన్నారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులను అందించే వెండింగ్ మెషిన్లను గాంధీ పార్క్, ఎన్టీఆర్ స్టేడియంల దగ్గర ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు కూడా స్వచ్ఛత, ప్లాస్టిక్ కవర్ల వినియోగం వలన కలిగే ప్రమాదాలపై అవగాహన చర్యలు చేపడతామన్నారు. రానున్న రోజుల్లో సుందర గుంటూరుని ప్రజలు చూడబోతున్నారన్నారు. కమీషనర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో 23సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్‌ల్లో గుంటూరు నగరం స్థానం దక్కించుకోవడం ద్వారా నగరంలో స్వచ్ఛతపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఈ వారం ఇచ్చిన నినాదం ప్లాస్టిక్ వినియోగం నిషేదం అని, అందుకు తగిన విధంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు చేస్తున్న కృషిని స్పూర్తిగా తీసుకుని నగరంలో కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగర సుందరీకరణ స్వచ్ఛత సాధన ద్వారా నగర ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తామని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయి గుర్తింపు రావడంలో కృషి చేసిన వారికి ఈనెల 21న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసే సభలో స్వచ్ఛ అచీవర్స్ పేరుతో పురస్కారాలు అందిస్తామని తెలిపారు. డిఆర్ఎం మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వచ్ఛాంధ్ర సాధనలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేదం కీలకమన్నారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగం ప్రజారోగ్యానికి ప్రమాదమని, ప్లాస్టిక్ నిషేదానికి ముందు వాటికి ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులను అందించే వెండింగ్ మెషిన్లను జిఎంసి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని, ఆ స్పూర్తితో గుంటూరు డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లలో కూడా స్వచ్ఛతకు రైల్వేశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా పర్యావరణ హిత వస్తువుల వినియోగానికి ప్రజలు ముందుకు రావాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్న జిఎంసి అందుబాటులోకి తెచ్చిన క్లాస్ వెండింగ్ మెషిన్లను నగర ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తొలుత ఎన్టీఆర్ స్టేడియంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, జిఎంసి ఏర్పాటు చేసిన రూ.20కే క్లాత్ బ్యాగ్ ఇచ్చే వెండింగ్ మెషిన్‌ని అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిఎంసి అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు, ఏడిఆర్ఎం రమేష్‌కుమార్, సీనియర్ డిపిఓ షహబాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మీ, డిప్యూటీ కమీషనర్లు, విభాగాధిపతులు, వివిధ డివిజన్ల కార్పోరేటర్లు పాల్గొన్నారు.

# వైకాపా దొంగలముఠా రాష్ట్రాన్ని,నియోజకవర్గాన్ని దోచేసింది

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,జులై19,ప్రభాతవార్త: ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని, నియోజకవర్గాన్ని అడ్డగోలుగా దోచుకున్న దొంగలు తమపై, కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ ప్రజలను ఇంకా నమ్మించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని, దేశానికి తామే స్వాతంత్ర్యం తెచ్చామని చెప్పుకునే



స్థితికి వైసిపి దొంగలు దిగజారారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి సుపరిపాలనలో తొలిఅడుగు, ఇంటింటికి తెలుగుదేశంలో బాగంగా మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి మంత్రి వాసంశెట్టి సుభాష్, పంచాయితీరాజ్‌శాఖ కమీషనర్ కృష్ణతేజలతో కలిసి చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో రూ30లక్షల ఆర్‌డబ్ల్యుఎస్ నిధులతో పునరుద్ధరించిన తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి సుభాష్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి కావూరు,కోమటినేనివారిపాలెం,గంగన్నపాలెం గ్రామాలలో రూ30లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్లు, రూ 10లక్షల వ్యయంతో వేయనున్న గ్రావెల్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం కోమటినేనివారిపాలెం ప్రభుత్వ పాఠశాలలో రూ3లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన తాగునీటి ప్లాంట్‌ను వారు ప్రారంభిం చారు. అనంతరం మంత్రి సుభాష్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఇరువురూ ఉత్సాహంగా గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పనితీరు, పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్ని కష్టాలున్నా, ఆర్థిక సమస్యలు ఉన్నా, అన్నింటిని పట్టుదలతో అధిగమిస్తూ, ప్రజలకోసం పనిచేస్తుండటాన్ని వైసిపి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న దొంగలముఠా అంతా చిలకలూరిపేటకు వచ్చి పచ్చిపచ్చి అబద్దాలు ఆడారని, చివరకు ప్రజలను నమ్మించటానికి నోటికొచ్చినట్లు మాట్లాడారని ప్రత్తిపాటి మండిపడ్డారు.

**ప్రజల సంతోషాన్ని ఓర్వలేకే వైసిపి దొంగలు విషప్రచారం చేస్తున్నారు**

ఐదేళ్లపాటు నియోజకవర్గాన్ని, రాష్ట్రాన్ని చీపురుతో ఊడ్చినట్లు వైసిపి నేతలు దోచేసారని, వారి దోపిడి దెబ్బకు ప్రజలు 11 సీట్లకు వైసిపిని పరిమితం చేసినా, ఎప్పుడూ లేనంత మెజారిటీతో టిడిపిని గెలిపించినా వారికి బుద్ధిరాలేదని ప్రత్తిపాటి మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు తరిమికొడితే గుంటూరుకు వెళ్లిన దొంగలు అక్కడ ఛీ కొట్టించుకొని మరలా సిగ్గులేకుండా చిలకలూరిపేటకు వచ్చి నీతిమంతుల్లా మాట్లాడుతున్నారని అన్నారు.దుర్మార్గపుపాలన నుంచి ప్రజలు ఇప్పటికిప్పుడే సంతోషంగా ఉండటాన్ని చూసి ఓర్వలేకనే వైసిపి దొంగలు విషప్రచారం చేస్తున్నారని అన్నారు. తననో, ప్రభుత్వాన్నో, ముఖ్యమంత్రినో విమర్శించకపోతే ఆ దొంగలకు నిద్ర పట్టదని ప్రత్తిపాటి తెలిపారు. ప్రజలు ఉమ్మేస్తున్నా వారి వైఖరి మారడంలేదని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సొంతపార్టీ వారే ఈ దొంగలు మాకొద్దని మొత్తుకుంటున్నారు**

సొంతపార్టీవారే ఈ దొంగలు మాకొద్దని మొత్తుకుంటున్నారని, తప్పులు, మోసాలు చేసిన ఆ దొంగలపై ఆ పార్టీ కార్యకర్తలే కేసులు పెట్టినా,కోర్టులను ఆశ్రయించినా వారి బుద్ధిమారలేదన్నారు. ఒకసారి మాయమాటలు చెప్పిన దొంగలను చిలకలూరిపేట ప్రజలు నమ్మారని, మరోసారి వారిని ఆదరించడానికి ఎవరూ సిద్దంగా లేరన్నారు. ఐదేళ్లపాటు చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, నియోజకవర్గాలను అప్పనంగా దోచుకున్నవారంతా ఇక్కడి ప్రజల్లో విషబీజం నాటే ప్రయత్నం చేశారని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు.

**గ్రామస్తుల ఐక్యతను అభినందించిన పంచాయితీరాజ్ కమీషనర్ కృష్ణతేజ**

మూడు గ్రామాల ప్రజలు ఒకేతాటిపై నిలిచి తాగునీటి ప్లాంట్ పునరుద్ధరణలో భాగస్వాములయ్యారని, వారి ఐక్యతను అభినందిస్తున్నానని పంచాయితీరాజ్ కమీషనర్ కృష్ణతేజ అన్నారు. తాగునీటి సమస్యగురించి గతంలో శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తనకు చెప్పిన వెంటనే ప్రభుత్వంతో సంప్రదించి పరిష్కారం దిశగా చొరవ చూపడం జరిగిందని అన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్య పరిష్కారానికి ఎల్లప్పుడూ నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని కృష్ణతేజ తెలిపారు. ఈ కార్యక్రమాలలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరిముల్లా, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, కందుల రమణ, గట్టినేని విజయసాయి, గంగా శ్రీనివాసరావు, ఆరెకట్ల కోటేశ్వరరావు, కోడె హనుమంతురావు, రెడ్డయ్య, తుబాటి కిషోర్, తూబాటి ప్రసాద్, మస్తాన్, నరేష్, బొప్పూడి చంద్ర, వెంకటప్రసాద్, కోడె మణి, నాయుడు రమేష్, మద్దాలి వెంకటస్వామి, హరిప్రసాద్, కేతినేని శ్రీను, నాయుడు చిన్న, మన్నవ శివయ్య, దేవదానం, మాలంపాటి ఉమా, సామినేని వెంకటేశ్వర్లు, మామిళ్లపల్లి చందు, గట్టినేని రమేష్, జి సుమంత్ మరియు గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 5సంవత్సరాలలో వైకాపా చేయలేనిది ఒక్క ఏడాదిలోనే చేసి చూపిస్తున్నాం : ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

**నూజెండ్ల,జులై19,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు.మండలకేంద్రమైన నూజెండ్ల గ్రామంలో



సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో జీ.వీ శనివారం పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు,చేస్తున్న అభివృద్ధిని వివరించారు. కరపత్రాలు పంపిణీ చేసి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందకపోయినా, గ్రామాల్లో సమస్యలు ఏమైనా ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ ఐదేళ్ళు వైసీపీ చేయలేనిది ఒక్క ఏడాదిలోనే చేసి చూపిస్తున్నామన్నారు. నాడు జగన్ హయాంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే మధ్యవర్తుల సిఫార్సులు ఉండాలని నేడు సీఎం చంద్రబాబు పాలనలో ఆ దుస్థితి లేదన్నారు. అర్హులైన వారికి నేరుగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు గంగినేని బాబు,సొసైటీ ఛైర్‌పర్సన్ బచ్చు ఆంజనేయరెడ్డి,సీనియర్ నాయకులు ముండ్రు సుబ్బారావు,డిఎల్‌డిఏ మాజీ ఛైర్మన్ లగడపాటి వెంకట్రావు,సొసైటీ జిల్లా మాజీ డైరెక్టర్ గంగినేని ఆంజనేయులు,గంగినేని బ్రహ్మయ్య,రావుల బుజ్జి,లగడపాటి సూరి,మరిడి సురేష్,చిరంజీవి,శశి,వెంకటస్వామి, రెడ్డి వెకటరత్నం,బత్తుల గోవిందరాజులు, రొడ్డా వీరాంజనేయరెడ్డి, అంజిరెడ్డి, బుల్లేశ్వర్‌రెడ్డి,కుంటా కోటిరెడ్డి తదితరులు పాల్గొనా న్నరు.

## అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడండి

### -రక్షిత మంచినీటిని అందించండి -శానిటేషన్ కార్యక్రమాలు విరివిగా చేపట్టండి -ఎంపిపి భవనం పద్మలీల

**పొన్నూరు, జూలై 19,ప్రభాతవార్త:** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు వారి పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి భవనం పద్మలీల ఆదేశించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన భవనం పద్మలీల మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం



ప్రారంభమైన నేపథ్యంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా సంబంధిత అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు. శుద్ధి చేసిన జలాన్ని ప్రజలకు అందించాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలన్నారు. మురుగునీరు నిల్వలేకుండా చూడాలన్నారు. మురుగు ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్, సున్నం తదితర రసాయనాలను పిచికారి చేయాలన్నారు. దోమల నివారణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా చేపడుతున్న, చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ మాట్లాడుతూ పాఠశాలలు తెరిచేనాటికే విద్యార్థులందరికీ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌లను అందజేయడం జరిగిందన్నారు. 99శాతం మంది విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథకాన్ని పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం ఆహారపదార్థాలను రుచిగా, శుచిగా తయారు చేసి అందిస్తున్నట్లు చెప్పారు. పదోతరగతిలో అత్యధికశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటి నుంచే రెండు పూటల అదనపు తరగతులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈఓపిఆర్డీ మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్యం, రక్షిత మంచినీటి సరఫరా తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. అన్ని గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గ్రామాల్లోని ఇళ్ళ యజమానులు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రాలను సద్వినియోగం చేసుకొనేవిధంగా కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, వైస్ ఎంపిపి అంబటి రాఘవయ్య, కార్యాలయ సూపరింటెండెంట్ నారాయణరావు తదితరులు ప్రసంగించారు.

## ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తాం : తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, జూలై 19,ప్రభాతవార్త:** వివిధ పార్టీల రాజకీయ నాయకులు సూచించిన సమస్యలను, అంశాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేవిధంగా చూస్తామని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమీక్షా సమావేశంలో పలు అంశాలను చర్చించారు. అందుకు సంబంధించిన తీర్మానాలను చేశారు. వీటిని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేవిధంగా చూస్తామన్నారు. రేషనలైజేషన్‌లో భాగంగా పొన్నూరు మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలో పోలింగ్ స్టేషన్ నెంబర్లు 156,157లు గతంలో మండల పరిషత్ అప్పర్‌ప్రైమరీ పాఠశాలలో ఉండేవన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా పేరు మార్పును గురించి చర్చించారు. పెదకాకాని మండలంలోని 38,41,4పోలింగ్ స్టేషన్లు, చేబ్రోలు మండలంలోని 91,106 పోలింగ్ స్టేషన్లు, పొన్నూరు అర్బన్ పరిధిలోని 177,178,10,183,185 ,186,213, 221, మొత్తం 13పోలింగ్ స్టేషన్‌లలో 12వందలకు పైబడి ఓటర్లు ఉన్నందున వాటికి అదనంగా కొత్త పోలింగ్ కేంద్రాల



ఏర్పాటుకు కూడా ప్రతిపాదనల గురించి రాజకీయ పార్టీల నాయకులతో చర్చించారు. సమావేశంలో మాదల వెంకటేశ్వరరావు, గణిపిశెట్టి రామకృష్ణ, చింతలపూడి మురళీకృష్ణ, గోపిశెట్టి వాసు తదితరులున్నారు.

## తాత్కాలిక వీసిగా ఏడాది పూర్తిచేసుకున్న గంగాధరరావు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ,జూలై19, ప్రభాతవార్త:** వర్సిటీకి తాత్కాలిక వీసిగా ఆచార్య కె. గంగాధరరావు ఏడాది కాలం పూర్తిచేసుకున్నారు. సరిగా ఏడాది క్రితం ఆయనను తాత్కాలిక వీసిగా నియమించారు. ఏడాది పూర్తయిన సందర్భంగా వికాస అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి నీలపు ప్రసాద్, జవ్వాజి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో వీసి గంగాధరరావును సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కేక్‌ను కట్‌చేశారు. అనంతరం వీసి మాట్లాడుతూ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి యూనివర్సిటీని ఉన్నతస్థాయికి తీసుకెళ్ళాలని కోరారు. వర్సిటీకి నలు దిక్కులా ప్రయివేట్ వర్సిటీలు ఉన్నాయని వాటిని తట్టుకుని ముందుకు సాగాలన్నారు. ఈసందర్భంలో తాత్కాలిక రెక్టార్ ఆచార్య




కె.రత్నషీలామణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్‌కుమార్, తాత్కాలిక సిడిఇ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు, సిడిఇ పరీక్షల కోఆర్డినేటర్ డి.రామచంద్రన్, ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్.లింగరాజు, డిగ్రీ పరీక్షల తాత్కాలిక కోఆర్డినేటర్ కృష్ణారావు, బాలుర వసతిగృహాల ఛీఫ్ వార్డెన్ మల్లికార్జున, సిఇ శివప్రసాదరావు, డిఇఇ వెంకటేశ్వర్లు, నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాశరావు, ఏసిఇ వెంకటేశ్వర్లు, వికాస నాయకులు వై.రాధాకృష్ణ, నేలపాటి నాగేశ్వరరావు, లావు రాంబాబు, పి.నాగరాజు, శశిధర్, శ్రీను, దినసరి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు రత్తయ్య, రమేష్‌బాబు, ఒప్పంద ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుధీర్, గౌరవ అధ్యక్షుడు కోడూరు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

**22,23 తేదీల్లో సెర్చ్ కమిటీ.!**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి రెగ్యులర్ వీసి నియామకానికి సంబందించి సెర్చ్ కమిటీ సమావేశం ఈనెల 22, 23 తేదీల్లో జరుగనుంది.ఆ తేదీలను ఖరారు చేసుకుని తగు ఏర్పాట్లు చేయాలని వర్సిటీకి సమాచారం అందింది. సెర్చ్ కమిటీ సమావేశంలో వీసి పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారిలో ముగ్గురు పేర్లను ఎంపికచేసి ప్రభుత్వానికి పంపనున్నారు.

## తెదేపా కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

**విజయపురిసౌత్, జులై 19 ప్రభాతవార్త:** విజయపురిసౌత్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో



మరణించిన తెలుగుదేశం కార్యకర్త జక్కి ప్రభుదాసు భార్య జక్కి నరసమ్మ కుటుంబ సభ్యులను యువనాయకులు జూలకంటి గౌతమ్‌రెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. స్థానిక నాయకులు రామాంజినేయులు, పోలరౌతు సత్యనారాయణ (సత్తిబాబు), పాలికి బాలస్వామి, వంగిపురపు పవన్‌కుమార్, పెంటిబోయిన నూకరాజు, మిత్రుల సహకారంతో రూ.31 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను గౌతమ్‌రెడ్డి గారి చేతుల మీదుగా ప్రభుదాసు భార్య నరసమ్మకు అందించారు. హౌసింగ్ లోన్ మంజూరుకు హామీ ఇచ్చి కుటుంబానికి అండగా ఉంటామని యువనాయకులు గౌతమ్‌రెడ్డి తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు గుండాల శ్రీను, వీరాస్వామి, సుధాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఎం.బసివిరెడ్డి, గోపిరెడ్డి, బొబ్బిలి చంద్రశేఖర్, ఏరిపల్లి నర్సింహులు, పురాణం శ్రీను, గ్రంధి రామకృష్ణ, చిట్టీ, దేవుడు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అందరికీ ఆదర్శప్రాయుడు కెనడీ: జడ్జి శ్రీనివాస్‌కల్యాణ్

మాచర్ల, జులై 19 ప్రభాతవార్త: కొంతమంది న్యాయవాదులు కమిట్‌మెంట్‌తో ఒక పద్ధతిగా ప్రాక్టీస్ చేసి అందరికీ ఆదర్శనీయంగా ఉంటారని అలాంటి వ్యక్తుల్లో సీనియర్ అడ్వకేట్ కె.కెనడీ ఒకరని మాచర్ల కోర్టు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ కల్యాణ్ అన్నారు. సీనియర్ అడ్వకేట్ కెనడీ సంస్మరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కెనడీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జి.సత్యనారాయణరెడ్డి, కేళం శ్రీనివాసరావు, జల్లా నాగేశ్వరరావు, బార్ అసోసియేషనన అధ్యక్షులు



రమేష్‌బాబు, జూపల్లి శ్రీనివాసరావు, గౌస్‌బాషా, ఏపీపీ జీవీ, గాలిబ్‌సాహెబ్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు చరణ్, చైతన్య, అడ్వకేట్ గంగుల శ్రీనివాసరావు, గుంజ ప్రసాద్, రామారావు, చక్రధర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ కె.సాయిమార్కొండారెడ్డి, కోర్టు స్టాఫ్ జగ్గారావు, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## ప్లాస్టిక్‌రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి : చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ

**నూజెండ్ల,జులై19,ప్రభాతవార్త:** ప్లాస్టిక్‌రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. శనివారం మండలకేంద్రమైన నూజెండ్ల గ్రామంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జీ.వీ



ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ గుడ్డ సంచులు వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక దుష్ ప్రభావాలు ఉన్నాయని ప్రతి అవగాహన ఏర్పరుచుకొని విడనాడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడివో ఉమాదేవి, డిప్యూటి ఎంపిడివో సత్యనారాయణ, ఎంఈవో రవిచంద్ర, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ సుబ్బరామయ్య, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణలో పొన్నూరుకు 11వ స్థానం

**పొన్నూరు, జూలై 19,ప్రభాతవార్త:** స్వచ్ఛ సర్వేక్షణ-2024 ర్యాంకింగ్స్‌లో పొన్నూరుకు 11వ స్థానం లభించడం పట్ల మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, కార్మికులతో సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ 50వేల జనాభా నుండి



మూడు లక్షల జనాభా కేటగిరీలో ఏపీకి 11వ స్థానం రావడంలో శానిటరీ సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది, ఇన్‌స్పెక్టర్ చేసిన కృషి ఫలితమేనన్నారు. శనివారం ఉదయం మస్టర్ కార్యాలయంలో సిబ్బందిని కమిషనర్ అభినందించారు. ఇంకా మరింత మెరుగ్గా పనిచేసి మొదటిస్థానంలోకి వచ్చేవిధంగా కృషి చేయాలని సిబ్బదికి సూచించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, శానిటరీ సెక్రటరీలు తదితరులున్నారు.

## శ్రీరామమూర్తి మృతి పార్టీకి తీరనిలోటు

**పొన్నూరు, జూలై 19,ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త కంచర్ల శ్రీరామమూర్తి మృతి పార్టీకి తీరని లోటని వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని కొండముది గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్త కంచర్ల శ్రీరామమూర్తి గుండెపోటుతో మృతి



చెందడం చాలా బాధించిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కంచర్ల సుధాకర్‌ను పరామర్శించారు. శ్రీరామమూర్తి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. శ్రీరామమూర్తి మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం మండలాధ్యక్షురాలు కూచిపూడి మరియరాణి, మండల మైనార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొనుగుపాటి పాల్‌రాజ్, నియోజకవర్గ ఇంటలెక్టువల్ విభాగం అధ్యక్షుడు నల్లమోతు రవీంద్రబాబు, వైఎస్సార్‌సీపి ఆర్టియుసి మండలాధ్యక్షుడు రుద్రపాటి నాగేశ్వరరావు, మండల పార్టీ ప్రధానకార్యదర్శి తుపాకుల గోవర్ధన్ తదితరులున్నారు.

## ఐకమత్యంతో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం

### -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, జూలై 19,ప్రభాతవార్త:** ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసేందుకు ఐకమత్యంతోతో ముందుకు సాగుదామని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం




పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ పట్టణంలో అక్కడక్కడా ఇంకా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వినియోగిస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్న విషయాన్ని వ్యాపారస్తులు, ప్రజలు కూడా గుర్తించాలన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసేందుకు పురప్రజలు, వ్యాపారస్తులు ముందుకు రావాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షన్-2024లో పొన్నూరుకు 11వ ర్యాంకు వచ్చిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంకా శ్రద్ధగా పనిచేసి మంచి ఫలితాలు వచ్చేవిధంగా చూడాల్సిన బాధ్యత పట్టణ పౌరులపై ఉందన్నారు. పట్టణ ప్రజలతో ప్లాస్టిక్ నిషేధిత ప్రమాణాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో ఆకుల సాంబశివరావు, గోవాడ వెంకటకృష్ణారావు, షేక్ బాజిసాహెబ్, పఠాన్ పిరోజ్‌ఖాన్, పఠాన్ అహమ్మద్‌ఖాన్, తాడికొండ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్‌యు పీజీ కోర్సుల ఫలితాలు విడుదల

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై19, ప్రభాతవార్త:** వర్సిటీ పరిధిలో పలు పీజీ కోర్సుల 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు శనివారం విడుదల చేశారు. యంయస్సీ మైక్రోబయాలజీలో 63కి 63మంది, స్టాటిస్టిక్స్ 49కి 48 మంది, డాన్స్ కూచిపూడి 18కి 18మంది, డాన్స్ భరతనాట్యం37కి 35మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే వారు ఈనెల 30వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2190లు చెల్లించి దరకాస్తులు చేసుకోవచ్చుని సిఇ తెలిపారు.

### నివేశనా స్థలాల అర్జీల అందజేతకు

## బారులు తీరిన గ్రామస్తులు

**యడ్లపాడు, జులై 19, ప్రభాతార్త :** ప్రభుత్వం నివేశనా స్థలాలకు సంబంధించి గ్రామాలలో ఉన్న లబ్దిదారులు తమ అర్జీలను స్దానిక సచివాలయాలలో నమోదు చేసుకోవాలని తెలపటం జరిగింది. ఇందులో భాగంగానే మండల పరిధిలోని వంకాయలపాడు పంచాయితీ పరిధిలోని వంకాయలపాడు,



బోయపాలెం, ఉప్పరపాలెం గ్రామాలకు చెందిన నివేశనా స్దలాల అర్జీలు అందజేయటానికి శనివారం సచివాలయంలో బారులుతీరారు. గతంలో నమోదు అయి ఐడి వచ్చిన వారికి మాత్రం మరలా నమోదు కావటం లేదు. అయితే అప్పుడు అన్‌లైన్‌లో నమోదు అయితే అయ్యిందిగాని నివేశనా స్దలాలు ఈ ఒక్క పంచాయితీలో లబ్దిదారులకు చేరలేదు. ఇందువల్ల కొత్త వారికి అవకాశం ఉంది. పాతవారికి నివేశనా స్దలాలు ఇవ్వక పోయినా అన్‌లైన్ అవ్వటంతో వారు నిరాశతో వెనుదిరిగిపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి పరిశీలించవల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్దులు కోరుతున్నారు.

## ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

**కొల్లూరు, జులై 19 (ప్రభాతవార్త) :** ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకునే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని కొల్లూరు సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రజిన



తెలిపారు. శనివారం కొల్లూరు 2అంగన్‌వాడీ కేంద్రంలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేదంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో రజనీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం విస్తృతంగా ప్రణాళికలను రూపొందించింది అన్నారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వస్తువులైన ప్లాస్టిక్ కప్పులు క్యారీ బ్యాగులు, ప్లేట్లు వంటి వాటిపై ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది అన్నారు. ప్రజలందరూ దీర్ఘకాలం ఉపయోగపడే వస్తువులను వాడాలన్నారు. అందుకు అరటి నారు, జనపనారు బాదం ఆకులు, వస్త్రపు సంచులను ప్రజలు వాడాలన్నారు. ప్లాస్టిక్ నిషేధం ద్వారా కాలుష్యం తగ్గి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన వాతావరణ ఏర్పడుతుందన్నారు. ముందుగా ప్రజలందరూ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మాధవి ప్రజలు పాల్గొన్నారు.

## కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం

**కొల్లూరు, జులై 19 (ప్రభాతవార్త) :** మండల కేంద్రమైన కొల్లూరులోని మండల పరిషత్ కార్యాలయం హాల్లో శనివారం ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నరసింహారావు,



వైఎస్ ఎంపీపీ మురాల రాంబాబు, జడ్‌పిటిసి సభ్యులు చొప్పర సుబ్బారావు, మండల పరిధిలోని వివిథశాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేదించాలి.. ప్రజలు సహకరించాలి..

**పెదనందిపాడు జూలై 19 (ప్రభాతవార్త)** ఆరోగ్యకరమైన సమాజా స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్లాస్టిక్ నిషేధానికి తమ వంతు పూర్తి సహకారం అందించాలని ప్రజలకు పెదనందిపాడు ఎంపీడీవో లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. శనివారం పెదనందిపాడు లో స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు దానికి జడ్పీ పాఠశాల విద్యార్థులతో మండల అధికారులు అందరూ గ్రామంలో




ర్యాలీ నిర్వహించారు ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నినాదాలు చేశారు. అనంతరం పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేనా ప్రియ. పిఒపిఆర్డి వరూధిని. సర్పంచ్ దాసరి పద్మారావు. పంచాయతీ సెక్రెటరీ శ్వేత. సచివాలయాల సిబ్బంది. జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు. వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్ రావు. పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 3న మాసం మాసం మానసోల్లాసం

పొన్నూరు, జూలై 19,ప్రభాతవార్త: మాసం మాసం మానసోల్లాసం సాహితీ సాంస్కృతిక సంస్థ, రేపల్లె వారి ఆధ్వర్యంలో ఆగస్టు 3వ తేదీన శాస్త్రీయ సంగీత విభావరి కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. రేపల్లె శ్రీ శృంగేరి శంకర మఠంలో జరిగే ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున సంగీత, సాహిత్యాభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మృదంగం విద్వాన్ కానూరి వెంకటరామకృష్ణ, గానం మధుర గాయక-కళాసేవక-సకల వల్లభ రంగావఝుల పానకాల లక్ష్మీనరసింహారావు, వయోలిన్ విద్వాన్ గౌరీవఝుల ఆంజనేయశాస్త్రిలతో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆహుతులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం

**పొన్నూరు, జూలై 19,ప్రభాతవార్త:** అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం నిర్మాణం చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. 58రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేసిన సందర్భంగా 58అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం, స్మృతి వనం నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇతర మంత్రులకు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం నారా చంద్రబాబు




నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్మృతివనం ఏర్పాటు 6.8ఎకరాలు భూమి కేటాయించడం పొట్టి శ్రీరాములుకు మనం ఇస్తున్న ఘనమైన నివాళి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావు, అవ్వారు వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని ఆపుదాం

### -డిపో మేనేజర్ లంకా వెంకటేశ్వరరావు

పొన్నూరు, జూలై 19,ప్రభాతవార్త: ప్లాస్టిక్ వాడకాన్ని ఆపుదామని ఆర్టీసి డిపో మేనేజర్ లంకా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక డిపో ఆవరణలో సిబ్బంది, ఉద్యోగులతో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం గురించి



చర్చించారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు వాడడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రయాణీకుల్లో కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

## తెదేపా పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు

**మాచర్ల, జులై 19 ప్రభాతవార్త:** అర్హులదరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారి సలహాలు తీసుకుంటున్నట్లు దుర్గారావు స్పష్టం చేశారు. టౌన్ పరిధిలోని 9వ వార్డులో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏడాదికి ఉచితంగా అందిస్తున్న మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.4 వేల పెన్షన్, అన్న క్యాంటీన్, తల్లికి వందనం, యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకు మెగా డీఎస్సీ తదితర పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో డేవిడ్‌రాజు, తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.



# వైద్యశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి ప్రత్యేకాధికారి డాక్టర్ మార్త ఫ్లోరెన్స్

**పొన్నూరు, జులై 19,ప్రభాతవార్త:** ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని స్వచ్ఛభారత్-స్వచ్ఛ ఆంధ్ర ప్రత్యేకాధికారి డాక్టర్ మార్త ఫ్లోరెన్స్ అన్నారు. నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిలో శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్పోరేట్ తరహాలో ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స చేయిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్‌ఖాన్ వివరించారు. సిబ్బంది, వైద్యులు ప్లకార్డులు ధరించి ర్యాలీ నిర్వహించారు.



# యోగా ద్వారానే సంపూర్ణమైన ఆరోగ్యం

## -యోగాచార్య మలిశెట్టి సుబ్రహ్మణ్యం

**పొన్నూరు, జులై 19,ప్రభాతవార్త:** యోగాసనాలు వేయడం ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందవచ్చని శ్రీ వీరాంజనేయ యోగ సాధన సేవా సంఘం ఛైర్మన్ యోగాచార్య మలిశెట్టి సుబ్రహ్మణ్యం సూచించారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో సేవా సంఘం ఆధ్వర్యంలో పిచ్చిమొక్కలు తొలగింపు, ముళ్ళపొదలు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ యాసిన్‌బాబా, నాదెండ్ల సురేష్‌బాబు, సత్య శ్రీనివాస్, దమ్మాల వెంకటేశ్వర్లు, వెంకయ్య, మేరీ, తదితరులు పాల్గొన్నారు.



# స్వర్ణాంధ్రే ధ్యేయంగా పనిచేయాలి : ఎంపిడిఓ విజయలక్ష్మి

**కొల్లిపర, జులై 19,ప్రభాతవార్త:** స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపిడిఓ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వల్లభాపురం, కొల్లిపర, మున్నంగి, తూములూరు, తదితర గ్రామాల్లో స్వచ్ఛఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతాన్ని పారద్రోలాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక రోగాలకు కారణం ప్లాస్టిక్ వస్తువులేనన్నారు. ప్లాస్టిక్ క్యాలరీబాగులు, సంచులను పూర్తిగా నిషేధించాలన్నారు. ప్రభుత్వం కూడా వీటి విషయంలో సీరియస్‌గా పనిచేస్తుందన్నారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా పంచాయితీ అధికారులు తగు శ్రద్ధచూపాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞచేయించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి, ఈవోపీఆర్డీ భార్గవ్, డీఆర్‌డిఎ ఎపిఎం రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు : ఎంపిడిఓ విజయలక్ష్మి

**కొల్లిపర, జులై 19,ప్రభాతవార్త:** గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించడం ద్వారా, ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించే వెసులుబాటు కలుగుతుందని ఎంపిడిఓ విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన కొల్లిపర పంచాయితీ కార్యాలయంలో సర్పంచి పిల్లి రాధిక అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎంపిడిఓ మాట్లాడారు. వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించడం ద్వారా ప్రజలకు విషయం తెలుస్తుందన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలుంటే గ్రామ సభకు దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాభివృద్ధికి గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ సభలో ఏవో శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ భార్గవ్, ఏపీఎం రమాదేవి, ఎంఈఓ సాల్మన్‌రాజు, కార్యదర్శి అలకనంద, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# జిల్లా పోలీసులు ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

**బాపట్ల,జులై19,ప్రభాతవార్త:** స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లా పోలీసులు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లు, పోలీస్ కార్యాలయాల్లో "స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ అధికారులు సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్టేషన్లు, కార్యాలయాలను శుభ్రం చేయడంతో పాటుగా పరిసరాలలో వుండే చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ



సందర్భంగా జిల్లా ఏఆర్ డీఎస్పీ విజయసారధి మాట్లాడుతూ పబ్లిక్ ప్రదేశాలు, ప్రకృతిలో ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గింపు, సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిరోధించడం, పర్యావరణ అభివృద్ధి, పరిశుభ్రమైన వాతావరణం గురించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా "స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం ప్రారంభించి ప్రతి నెల మూడవ శనివారం ఈ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పశువులు, పక్షులు, సముద్ర జీవులు ప్లాస్టిక్ వస్తువుల వలన మృత్యువాత పడుతున్నాయని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల ప్రకృతికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని స్వతహాగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, భావితరాలకు మెరుగైన ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మోలుద్దీన్, ఎమ్.టి ఆర్ఐ శ్రీకాంత్, ఇతర పోలీసు అధికారులు ఏఆర్ సిబ్బంది అందరు కలిసి పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో ఉన్న పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ను, ఎస్పీ క్యాంప్ కార్యాలయాన్ని వాటి పరిసరాలను శుభ్రం చేశారు.

# విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణి

**బాపట్ల, జులై19, ప్రభాతవార్త:** మండలం లోని చెరువు జమ్ములపాలెం ఎన్ చర్చి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జేసిఎన్ఎంఎం సర్వీసు సొసైటీ అధ్యక్షులు కన్నెగంటి జాన్ వెస్లీ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి



ప్రధానోపాధ్యాయులు బి.సుజాత అధ్యక్షత వహించగా ఎంఈవో నిరంజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు .50మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు ,పలకలు, పెన్నులు, పెన్సిళ్ళు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లీ.ప్రకాశవర్ధిని,రి. శ్యామసుందరి,జు. భారతి,పాస్టర్ బుర్రా మోజెస్,సభ్యులు జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించిన లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

**పెదనందిపాడు జులై 19 (ప్రభాతవార్త) :** సమాజ శ్రేయస్సు కోసం లక్ష్యంతో పనిచేసే పాత్రికేయులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండాలని ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎస్ ఎన్ మీరా అన్నారు.



గురువారం ప్రత్తిపాడు నియోజకవర్గ ఏపీయూడబ్ల్యూజే సర్వసభ్య సమావేశం ప్రత్తిపాడు ఏ హెచ్ ఎఫ్ కళ్యాణ మండపం ప్రాంగణంలో జరిగింది. నియోజకవర్గ అధ్యక్షులు జోగి ఆనందబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గుంటూరు లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఇచ్చిన 52 మంది పాత్రికేయులకు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు అందించిన ఈ హెల్త్ కార్డులు జర్నలిస్టులకుఎంతగానోఉపయోగపడతాయ అన్నారు. అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సభ్యులు ఈ హెల్త్ కార్డుల ద్వారా రాయితీతో కూడిన వైద్యం చేయించుకునే అవకాశం ఉందని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలను గుర్తించి వారికి హెల్త్ కార్డులు మంజూరు చేసిన లలితా సూపర్



స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యానికి, డాక్టర్ లలిత డాక్టర్ రాఘవ శర్మ దంపతులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. స్థానిక సి. ఐ. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగం నాలుగో స్తంభంగా మీడియా ఉందన్నారు. విలేకరులు సమాజాభివృద్ధికి దోహదపడుతూ విలువలతో కూడిన వృత్తిని కొనసాగించాలన్నారు .అనంతరం విలేకరులకు సి. ఐ. చేతుల మీదుగా హెల్త్ కార్డులు పంపిణీ చేశారు.ఈ సమావేశంలలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు పి భక్త వత్సలరావు,జిల్లా కార్యదర్శి రాంబాబు, జిల్లా కోశాధికారి ఫణింద్ర, ప్రత్తిపాడు నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు నరిసెట్టి వీరభద్రరావు, నియోజవర్గ కార్యదర్శి జెట్టి పరమేశ్వరరావు,జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ డి ఎండి షరీఫ్. కార్యవర్గ సభ్యులు పి శ్రీనివాసరావు. కోటి రత్నం. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి మామిళ్ళపల్లి సుబ్బారావు. పలువురు సీనియర్ నాయకులు యూనియన్ సభ్యులు పాత్రికేయులు పాల్గొన్నారు.

# వీరాపురంలో రైతు శిక్షణ

**పిడుగురాళ్ల, జులై 18 ప్రభాతవార్త:** మండలంలోని వీరాపురంలో శనివారం నరసరావుపేట జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యాన రైతు శిక్షణా కార్యక్రమం




నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా శిక్షణ కోఆర్డినేటర్ ఎం శివకుమారి మాట్లాడుతూ రైతులు పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులను ఎక్కువగా వాడుతున్నారని, దీనివల్ల భాస్వరం ఉపయోగపడకపోగా సూక్ష్మ పోషక లోపాలు కూడా వస్తాయని, మెట్ట పంటలకు విత్తిన నెల రోజుల లోపల, వరి నాటిన 10 రోజుల లోపల కాంప్లెక్స్ ఎరువులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, ఏవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# మండల సమాఖ్య ఆధ్వర్యాన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర

**పిడుగురాళ్ల, జులై 18 ప్రభాతవార్త:** జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పిడుగురాళ్ల మండల సమాఖ్య వెలుగు కార్యాలయ ప్రాంగణంలో శనివారం వెలుగు అధికారులు, సిబ్బంది సచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ



సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటరమణారావు, సీసీలు సురేష్, కోటేశ్వరరావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో కూడా స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పట్టణ ప్రజలకు సింగిల్ యాప్ ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేట మునిసిపాలిటీకి 15వ ర్యాంకు

**చిలకలూరిపేట, జులై19, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలందరి సహకారంతో రాష్ట్రంలోని 100కు పైగా మున్సిపాలిటీలలో చిలకలూరిపేట మున్సిపాలిటి స్వచ్ఛాంధ్ర ర్యాంకులలో 15వ ర్యాంకు స్థానంలో నిలిచిందని, అందుకు



కారణమైన అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లును ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. కూటమి ప్రభుత్వ సంకల్పం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పిలుపుతో శనివారం పట్టణంలో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రత్తిపాటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన ర్యాలీలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. అనంతరం చెత్త సేకరణ నిమిత్తం రూ4లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన తోపుడుబండ్లు, డస్ట్‌బిన్‌లను ప్రత్తిపాటి మున్సిపల్ సిబ్బందికి అందచేశారు. మున్సిపల్ శానిటరీ విభాగంలో చురుకుగా పనిచేసిన సిబ్బందిని ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలకు తోడు ప్రజలు సహకరిస్తే చిలకలూరిపేట పట్టణం స్వచ్ఛత, శుభ్రతలో ఆగ్రస్దానంలో ఉంటుందని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ముఖ్యమంత్రి అనుకున్న స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సాకారమవుతుందని అన్నారు. పట్టణంలో సేకరించే చెత్తను నిత్యం వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లకు తరలిస్తున్నారని, డంపింగ్ యార్డ్‌లను కూడా సుందరీకరించుకునే పనులు చురుకుగా జరుగుతున్నాయని ప్రత్తిపాటి అన్నారు. పట్టణంలో ఆక్రమణలను తొలగించి రోడ్ల విస్తరణ చేపట్టనున్నామని, వీధి



వ్యాపారులు,దుకాణదారులు ఎవరూ రోడ్లను ఆక్రమించవద్దని, ఇప్పటికే కాలువలు దాటి ముందుకు వ్యాపారాలు పెట్టుకున్నవారు స్వచ్ఛందంగా వెనక్కి జరుపుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమీషనర్ పి శ్రీహరిబాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, వైస్ చైర్మన్ గోల్డ్ శీను, టిడిపి నాయకులు పఠాన్ సమద్‌ఖాన్, గంగా శ్రీనివాసరావు, కందుల రమణ, మద్దిబోయిన శివ, బేరింగ్ మౌలాలి, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

# ఎన్ఈసి కళాశాలలో 102 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

**నరసరావుపేట, జులై 19 ప్రభాతవార్త :** ప్రముఖ ఐటీ సంస్థ శనివారం ప్రాంగణ ఎంపికలను నిర్వహించగా 102 మంది బిటెక్ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. వివరాలను విద్యార్థుల అభినందన కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి



కోటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌లు తెలియజేశారు. ప్రముఖ బహుళజాతి సంస్థలో ఒకే రోజు 102 మందికి బిటెక్, ఎంసిఏ విద్యార్థులకు ట్రైనీ ఎనలిస్ట్‌లుగా ఉద్యోగాలు రావడం సంతోషంగా ఉందన్నారు. రూ.3 లక్షల వార్షిక వేతనంతో విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. తమ కళాశాలలో మొదటి సంవత్సరం నుండి ఉద్యోగ అవకాశాలకై అవసరమైన శిక్షణ అందిస్తున్నామన్నారు. రీజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను నిరంతరం అందించడం ద్వారా ఉద్యోగాలు రావడం విద్యార్థులకు సులభం అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఏఎంరెడ్డి ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలతో కె.ఎల్.టెక్నాలజీ ఇన్క్యుబేటర్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం

**నరసరావుపేట, జులై 19 ప్రభాతవార్త :** ఏఎంరెడ్డి ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలతో కె.ఎల్.టెక్నాలజీ ఇన్క్యుబేటర్స్ ఫౌండేషన్ శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ



మేరకు కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి - శ్రీనివాసరెడ్డి, ఫౌండేషన్ సిఈవో బాబు హరికృష్ణ ఒప్పంద పత్రాలను తీసుకున్నారు. వారు మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు అవసరమైన స్టార్టప్‌లు, పరిశోధన, నూతన ఆవిష్కరణలలో అవగాహన విద్యార్థులకు కల్పించడం జరుగుతుందన్నారు. నూతన వ్యాపార ఆలోచనల అభివృద్ధి విద్యార్థులలో పెంచడమే లక్ష్యమన్నారు. అదే విధంగా సాంకేతిక అంశాలు ఎప్పటికప్పుడు విద్యార్థులకు తెలియజేయడం స్టార్టప్ సంస్కృతి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఏఎంరెడ్డి విద్యాసంస్థల అభివృద్ధిలో ఇది కీలక మైలు రాయి అని కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి - శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.

# రొంపిచర్లలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ

**రొంపిచర్ల, జులై 19 ప్రభాతవార్త :** రొంపిచర్ల మండలంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శనివారం జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి వారు మాట్లాడారు. రాబోయేది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. మోసం అంటేనే చంద్రబాబు అని తెలిపారు. అబద్ధాలు చెప్పడంలో ఎటువంటి జంకు లేకుండా మాట్లాడటం ఆయన నైజం అన్నారు. 2014లో రైతులను మోసం చేశారని, ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేస్తానని చేయలేదన్నారు. డ్వాక్రా మహిళల రుణాలను పూర్తిగా రద్దు చేస్తానని చేయలేదని గుర్తు చేశారు. 2024లో చంద్రబాబు మారాడని, సూపర్ సిక్స్ పథకాలను చెప్పిన విధంగా అమలు చేస్తాడని ప్రజలు నమ్మారన్నారు. ఇప్పటికే తల్లికి వందనం ఒక సంవత్సరం ఎగొట్టి రెండవ సంవత్సరం 30 లక్షల మందికి ఇవ్వకుండా మిగిలిన వారికి అరకొరగా రూ.5 వేలు, రూ.6 వేలు, రూ.7 వేలు ఖాతాలలో వేయడం జరిగిందన్నారు. స్వయంగా తెలుగుదేశంపార్టీ కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి వాళ్ళ నియోజకవర్గంలో ఒక పాఠశాలలో 50 మంది పిల్లలకు తల్లికి వందనం ఇవ్వలేదని ప్రశ్నించడం జరిగిందన్నారు. నాడు - నేడు పాఠశాలల అభివృద్ధి పూర్తిగా తొలగించారన్నారు. నిరుద్యోగ భృతి ఏ ఒక్కరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఉచిత బస్సు అంతా మోసమేనన్నారు. మోసాలతో చేస్తున్న పాలనను పవన్‌కళ్యాణ్ ఎందుకు ప్రశ్నించడో ఎవరికీ అర్థం కాదన్నారు. ప్రజలు రాబోయే రోజుల్లో తిరగబడతారని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు.



# కోర్టు భవనాల నిర్మాణానికి స్థలం కేటాయింపులో ప్రత్తిపాటి ప్రత్యేక శ్రద్ధ చూపారు : బార్ అసోసియేషన్ కార్యవర్గం

**చిలకలూరిపేట, జులై19, ప్రభాతవార్త:** ఏన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కోర్టు భవనాల నిర్మాణ నిమిత్తం స్థల సేకరణ



సమస్యను మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు పరిష్కరించారని బార్ అసోసియేషన్ నాయకులు అన్నారు. శనివారం మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక కోర్టు భవనాల నిర్మాణానికి సరైన స్థలం కావాలని తాము కోరిన వెంటనే ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్పందించారని, వెంటనే అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఆయనే స్వయంగా స్థలాలు పరిశీలించి తమను కూడా చూడాలని చెప్పారన్నారు. ఎట్టకేలకు నరసరావుపేట రోడ్డులోని గంగమ్మ తల్లి దేవస్థానం పక్కన సర్వేనెంబర్ 186లో గల 91 సెంట్లు ప్రభుత్వ భూమిని కోర్టు భవనాల సముదాయ నిర్మాణానికి కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాగా ప్రత్తిపాటిని శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు ఉన్నారు.

# షేక్ మౌలాలి భౌతికకాయానికి నివాళులు అర్పించిన మర్రి రాజశేఖర్

**చిలకలూరిపేట, జులై19, ప్రభాతవార్త:** పట్టణంలోని సుభాని నగర్‌కు చెందిన షేక్ మౌలాలి స్వర్గస్థులైనారు. విషయం తెలుసుకున్న



శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ శనివారం సుభానినగర్‌లో గల మౌలాలి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం మౌలాలి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చేతివ్రాతపై శిక్షణా తరగతులు

**చిలకలూరిపేట, జులై19, ప్రభాతవార్త:** విఐటి వికాస్ పాఠశాలలో విద్యార్దిని, విద్యార్దులకు ప్రముఖ క్యాలిగ్రఫిస్ట్ వై మల్లిఖార్జునరావుచే చేతివ్రాత గురించి శుక్రవారం, శనివారం శిక్షణా తరగతులను



నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ విద్యాసంస్థల డైరక్టర్ దండా పవన్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశంలోనే గొప్ప చేతివ్రాత నిపుణులలో ఒకరైన మల్లిఖార్జునరావుచే గత 9 సంవత్సరాలుగా వికాస్ స్కూల్‌లో హ్యాండ్ రైటింగ్ వర్క్‌షాప్‌నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో 6వతరగతి నుంచి 10వ తరగతివరకు విద్యార్దులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. క్యాలిగ్రఫిస్ట్ వై మల్లిఖార్జునరావు మాట్లాడుతూ కర్సివ్ హ్యాండ్ రైటింగ్ రాయడం ద్వారావిద్యార్దులు సమయం ఆదాచేసుకోవచ్చునని, అలాగే ఒక అక్షరాన్ని మరొక అక్షరంతో జాయిన్ చేసి రాయడం ద్వారా విద్యార్దులలో పనిపట్ల ధృడమైన అంకితబావం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థల డైరక్టర్ దండా రోజశ్రీ, ప్రిన్సిపల్స్ కల్పన, శ్యాంబాబులు, ఉపాధ్యాయులు, విద్యార్దిని, విద్యార్దులు పాల్గొన్నారు.


# పల్నాడు జిల్లాకు భాజపా నూతన కమిటీ

**నరసరావుపేట టౌన్, జులై 19 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాకు బిజెపి నూతన కమిటీని శనివారం పార్టీ జిల్లా అధ్యక్షులు ఏలూరి శశి శనివారం ప్రకటించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఉపాధ్యక్షులుగా ఇత్తడి కిరణ్, కామినేని హనుమంతరావు, మల్లెల శివ నాగేశ్వరరావు, గొడవర్తి సుజాత, జి.వెంకటరమణ, బి.సీతాదేవి, బ్రహ్మయ్య నియమితులయ్యారు. జనరల్ సెక్రటరీలుగా కె.సుబ్బారావు, శెట్టి హనుమంతరావులు, జిల్లా కార్యదర్శులుగా లక్ష్మి, హేమకుమార్, జాన్‌బాబు, సులోచన, జి.లక్ష్మి, ఎం.శివరత్నకుమార్, ఎస్.పుల్లారెడ్డి, ఆంజనేయులుతో పాటు ఐటి కన్వీనర్‌గా రామిశెట్టి యశ్వంత్, సోషల్ మీడియా కన్వీనర్‌గా వంకాయలపాటి వంశీ నియమితులైనట్లు జిల్లా అధ్యక్షులు శశి ప్రకటించారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద అకౌంటింగ్ పవర్‌హౌస్ ఐసిఏఐ

- -2047నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్
- -ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో భాగస్వామ్యం వహించండి
- -పెట్టుబడుల కోసం పోటీపడతాం
- -జనవరిలో అమరావతికి క్వాంటమ్ కంప్యూటర్
- -ఐసిఏఐ స్ఫూర్తి మెగా కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్య,ఐటి శాఖల మంత్రి లోకేష్

**గుంటూరు విద్య,జూలై 19,ప్రభాతవార్త :** ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా అన్నది భారతదేశ మేధోశక్తికి వెన్నెముక లాంటిది. ఐసిఏఐ స్థాపించి 76సంవత్సరాలు నిండినా ఆ సంస్థ ఇప్పటికీ యవ్వనంగానే ఉంది.ఇది భారతదేశంలో అతిపెద్ద సంస్థగా మాత్రమే కాదు,ప్రపంచంలోనే అతిపెద్ద అకౌంటింగ్ పవర్‌హౌస్‌గా ఉందని రాష్ట్ర విద్య,ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.స్థానిక బండ్లమూడి గార్డెన్స్‌లో ఐసిఏఐ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యాన "స్ఫూర్తి" చూస్తాము.పాలనా వ్యవస్థలో బడ్జెట్ ఆమోదం ఉన్న ప్రతి ప్రభుత్వ ఫైలుకు ఆడిట్ల ఆమోద



పేరుతో నిర్వహించిన మెగా సిఏ విద్యార్థుల ప్రారంభ సమావేశానికి లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఐసిఏఐ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన,విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందింది.ప్రపంచంలో ఫోరెన్సిక్ అకౌంటింగ్ ప్రమాణాలతో పనిచేస్తున్న మొట్టమొదటి సంస్థ ఇది.ఐసిఏఐ ద్వారా 10లక్షల మందికి పైగా చార్టర్డ్ అకౌంటింగ్ విద్యను అభ్యసిస్తుండగా ప్రతిఏటా 2లక్షల మంది పరీక్షలు రాస్తున్నారు.4.07లక్షల మంది సభ్యులు,54విదేశీ చాప్టర్లు కలిగిన అతిపెద్ద సంస్థ ఐసిఏఐ వ్యాపారం ఎక్కడ ఉంటే భారత్ అక్కడ ఉంటుంది,భారత్ ఎక్కడ ఉంటే అక్కడ ఐసిఏఐ ఉంటుంది.

**-సిఏ కోర్సు నిబద్ధతతో కూడుకున్న విద్య**

భారతదేశ గర్వించదగిన ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కుటుంబ సభ్యులు అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.నేను చార్టర్డ్ అకౌంటెంట్ కాకపోయినా స్టాన్‌ఫోర్డ్ ఎంబిఏ గ్రాడ్యుయేట్‌గా సిఏ ప్రాధాన్యత నాకు తెలుసు.ఇది కేవలం ఒక కోర్సు కాదు,నిబద్ధతతో కూడుకున్న విద్య.మా కుటుంబ వ్యాపారాల్లో సిఏల కష్టాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను.వ్యాపారాల్లో స్పష్టత లోపించినప్పుడు మేము సిఏ వైపే ముద్ర అవసరం.వ్యవస్థపై నమ్మకంకోసం మేము చార్టర్డ్ అకౌంటెంట్‌పై ఆధారపడతాం.సిఏలు కేవలం సంఖ్యా విశ్లేషకులు మాత్రమే కాదు,వారు ఆర్థిక వృద్ధి చోదకులు.వారు వ్యాపారాలకు మూలధనాన్ని సేకరించడానికి,ఉద్యోగాలను సృష్టించడానికి సహాయం చేస్తారు.సిఏలు ప్రతిరూపాలు,సృష్టించబడిన ప్రతి ఉద్యోగం కథలో సిఏ పాత్ర ఉంటుంది.మా ప్రభుత్వం సిఏల ఇన్‌పుట్‌లకు విలువ ఇస్తుంది.పాలనా నిర్ణయాల్లో మేము సిఏలను సంప్రదిస్తాము.మీరు బ్యాలెన్స్ షీట్‌లను మాత్రమే ధృవీకరించరు,రాష్ట్ర ఆర్థిక వెన్నెముకను తయారుచేస్తారు.న్యూ ఏజ్ సిఏ అనేది కాలిక్యులేటర్ కంటే ఎక్కువ నేటి సిఏలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం,ప్రపంచవ్యాప్తంగా అవగాహన,ఏఐ ఆధారిత కమ్యూనికేషన్,నైతికత కలిగి ఉంటారు.

**-చార్టర్డ్ అకౌంటెంట్స్ ఫ్యాక్టరీ గుంటూరు**

భారతదేశ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఫ్యాక్టరీ గుంటూరునగరం.ఆశ్చర్యకరంగా గుంటూరు సిటీ వైద్యులు,ఇంజనీర్లకంటే ఎక్కువగా సీఏలను తయారుచేస్తుంది.డాక్టర్లు,ఇంజనీర్లకంటే సిఏ చదువుతున్న 10వేల మంది విద్యార్థుల సంఖ్య ఎక్కువ.గుంటూరు నుండి గల్ఫ్,అమెరికా,ఆస్ట్రేలియా వరకు విస్తరించిన తెలుగు సీఏలు భారతదేశం గర్వపడేలా ప్రతిభను చాటుతున్నారు.

వజ్రాన్ని తయారుచేయడం ఎంత కష్టమైనా సీఏ డిగ్రీ సాధించడం కూడా అంతే కష్టం.

**-చంద్రబాబు నుండి స్ఫూర్తి పొందా**

నేను విజనరీ లీడర్ చంద్రబాబునుంచి స్ఫూర్తి పొందాను.ఆయన 75ఏళ్ల వయస్సులో 25ఏళ్ల యువకుడిలా పనిచేస్తున్నారు.మ్యాన్యుఫ్యాక్చరింగ్,ఎనర్జీ,ఐటి,ఫార్మా,అన్ని రంగాల్లో ఏపిని నెం.1 గా నిలపాలన్నదే మా లక్ష్యం,రాబోయే మూడేళ్లలో ఏపిమోడల్ ఎడ్యుకేషన్ తెచ్చేందుకు అవిశ్రాంతంగా కృషిచేస్తున్నాం.యువత రాజకీయాల్లోకి రావాలి..తెలుగుదేశం పార్టీయువత విద్యావంతులను ప్రోత్సహిస్తుంది.మహిళా సాధికారిత ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యం,మార్పు మన ఇంటి నుండే ప్రారంభం కావాలి,1992లో చంద్రబాబు ప్రారంభించిన హెరిటేజ్ ను నాతల్లి భువనేశ్వరి,భార్య బ్రాహ్మణి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

**-సీఏల భాగస్వామ్యంతో అవినీతికి చెక్**

నేటి ప్రపంచంలో ఐక్యూ మంచిది,ఈక్యూ మంచిది,కానీ టిక్యూ (టెక్ కోషెంట్) కూడా తప్పనిసరి పదునుగా,నైతికంగా,తాజాగా ఉండండి మీరే మా పెట్టుబడి లక్ష్యసాధనపై దృష్టి



కేంద్రీకరించి ఆదరణాత్మకంగా సానుకూలంగా ఉండండి మీరు ఎంచుకున్న ప్రయాణం కష్టమైనదే కానీ మీకు బంగారు భవిష్యత్తు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పనలో సీఏలు భాగస్వాములు కావాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి,ఐసిఏఐ వైస్ ప్రెసిడెంట్ డి.ప్రసన్న కుమార్,సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు,గుంటూరు బ్రాంచ్ చైర్మన్ ఎస్.రాజశేఖర్,సదరన్ ఇండియా చార్టర్డ్ అకౌంటెంట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచ్ చైర్మన్ చింతా రఘు నందన్,వైస్ చైర్మన్ బి.ఝాన్సీలక్ష్మీ,కార్యదర్శి వనిమిరెడ్డి, వి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చాప్టర్, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయం

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్

**మంగళగిరి, జూలై 19, ప్రభాతవార్త :** మంగళగిరిలోని ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ అండ్ జనరల్ హాస్పిటల్ నందు ఏపిడీకీ-డీవీ 2025 సదస్సును రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అట్టహాసంగా ప్రారంభించారు.దేశంలో పెరుగుతున్న హృదయ సంబంధిత వ్యాధులు,వాటి



పరిష్కారంపై ప్రముఖ కార్డియాలజిస్టులు, అధ్యాపకులు,వైద్య విద్యార్థులు సదస్సులో పాల్గొని చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ గుండె ఆరోగ్యం, రోగి సంరక్షణకు సంబంధించి కార్డియాలజిస్ట్స్ సొసైటీ ఆఫ్ ఇండియా-ఆంధ్రప్రదేశ్ చాప్టర్, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయమని, ప్రపంచవ్యాప్తంగా 33 శాతం మరణాలకు గుండె సంబంధిత రోగాలే(సీవీడీ) కారణమవుతున్నాయని అన్నారు.మన రాష్ట్రంలో 1.5 లక్షల మంది సీవీడీ కారణంగా ఏటా చనిపోతున్నారని మంత్రి తెలిపారు.స్టెమీ ప్రోగ్రామ్ కింద గోల్డెన్ అవర్లో ప్రాణాలు కాపాడే రూ.45 వేల విలువ చేసే టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ను ఉచితంగా అందిస్తున్నాం. ఇప్పటి వరకు ఈ ఇంజెక్షన్ ద్వారా మూడు వేలకు పైగా ప్రాణాలను కాపాడామని వివరించారు. ఎన్నారై అకాడమీ అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ రావు మాట్లాడుతూ ఇలాంటి సదస్సు ఎన్నారైలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, శరీరంలో గుండెకి ప్రత్యేక విశిష్టత ఉంటుందని,జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, పొగాకు, మద్యం మొదలైనవి గుండె సంబంధిత రోగాలకు దారి తీస్తున్నాయని తెలిపారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని సరైన జీవన విధానం, సరైన ఆహారం, మంచి ఆలోచనలు ఇవే మంచి ఆరోగ్యానికి సూత్రాలు అని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య విద్యాలయం ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మారుతున్న జీవన శైలికి తగిన వైద్య విధానాలను నిత్యం తెలుసుకుంటూ ఉండాలని వాటికి ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఎంతో అనుభవజ్ఞులైన వైద్యులు కూడా అందుబాటులో ఉన్నారని తెలిపారు.సమాజంలో వైద్య వృత్తికి ప్రత్యేక స్థానం ఉందని, వైద్య విద్యార్థులు మరియు అధ్యాపకులు రీసెర్చ్ పై దృష్టి సారించాలని, అటువంటి ప్రయత్నానికి యూనివర్సిటీ నుండి అవసరమైన నిధులను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ జాన్ సతీశ్, డాక్టర్ శ్రీనివాస్ చౌదరి, ఎన్నారై డీన్ డాక్టర్ లక్ష్మీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు సీనియర్ కార్డియాలజీ వైద్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలి

**బాపట్ల,జులై19,ప్రభాతవార్త :** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. "స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాన్ని వివరిస్తూ అవగాహన ర్యాలీని శనివారం బాపట్ల పట్టణంలో నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం ప్రాణాంతకం, భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకుందాం, ప్రకృతిని ప్రేమిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ విద్యార్థులు పెద్దపెట్టున నినదించారు. ర్యాలీలో 2000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా చెత్త డంపింగ్ యార్డు వద్దకు చేరుకున్న వేలాదిమంది విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై కలెక్టర్ స్వయంగా అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి కలిగే నష్టాన్ని వివరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ వెంకటమురళీ మాట్లాడుతూ ఈ తరం ప్రజలు చేస్తున్న పొరపాట్లు రాబోయే తరాలకు నష్టాన్ని కలిగించరాదన్నారు. చెత్తతో భూమి, వాయువు, జలాలు కాలుష్యం గాకుండా ప్రజలు, పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులు చైతన్యంతో భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలని కోరారు. భూమిలో కుళ్ళిపోయే వ్యర్థాలు ఒక బుట్టలో, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరొక బుట్టలో వేసేలా మీ ఇంటి నుంచి వ్యర్థాలను విభజించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజలందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా కలెక్టర్, బాపట్ల



శాసనసభ్యులు కలసి పారిశుద్ధ్య కార్మికులను పుష్పమాలతో సత్కరించారు. క్యాన్సర్ వ్యాధికి కారణమయ్యే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా నిషేధించామన్నారు.ప్రమాదకరంగా మారుతున్న ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ప్రభాకర్ రావు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఆర్డీవో గ్లోరియా, సిపిఓ షాలేమ్ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజధాని రైతులకు రీటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు

**తుళ్ళూరు,జూలై 19,ప్రభాతవార్త :** అమరావతి రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు.విజయవాడలోని ఏపి సీఆర్డీఏ కార్యాలయంలో శనివారం ఈ-లాటరీ విధానంలో 138ప్లాట్లను కేటాయించగా,59మంది రైతులకు ఈ లాటరీలో 91నివాస ప్లాట్లు,47వాణిజ్య ప్లాట్లు కేటాయి ంపు పత్రాలు అందజేశారు.ఈ కేటాయింపులో నవులూరు 2, కురగల్లు 1, నిడమర్రు 1 మరియు 2, అబ్బరాజుపాలెం,అనంతవరం,రాయపూడి1 మరియు 2, తుళ్ళూరు 1 మరియు 2 లింగాయపాలెం, బోరుపాలెం,నెక్కల్లు,ఉద్దండ్రాయునిపాలెం,ఉండవల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.ల్యాండ్స్ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎఫ్ఏసి) వి.డేవిడ్‌రాజు



మాటా ్లడుతూ...ప్లాట్లు పొందిన రైతులకు వాటి భౌగోళిక సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా జిఐఎస్ సిబ్బంది,గ్రామసర్వేయర్లను నియమించ ామన్నారు.రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని,అందుకు ఎలాంటి రుసుము వసూలు చేయమని తెలిపారు.కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు,ఎం.శేషిరెడ్డి,ఎ.జి.చిన్నికృష ్ణ,పి.పద్మావతి,జి.రవీందర్, బి.సాయిశ్రీనివాస్ నాయక్,కె.ఎస్.భాగ్యరేఖతో పాటు సీఆర్‌డిఏ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# రజక కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు క్రైమ్,జూలై 19,ప్రభాతవార్త :** స్థానిక 45వ డివిజన్‌లో రజక కమ్యూనిటి హాల్‌కు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుసా జరిగింది.రూ.21.50లక్షలతో నేడు మొదటి అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది.కొరిటెపాడు మహాప్రస్థానం నుండి



్థపన చేశారు.రూ.50లక్షలతో కొరిటెపాడు మహాప్రస్థానం నుండి ముత్యాలరెడ్డి నగర్ మెయిన్‌రోడ్డు వరకు దెబ్బతిన్న రహదారి భాగానికి,ఆర్‌సిసి రిటైనింగ్ వాల్,సిసి రోడ్డు,అదేవిధంగా రూ.21.50లక్షలతో గౌతమి నగర్ 6వ లైన్‌లో రజక కాలనీ కమ్యూనిటీ హాల్ భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ...రూ.71.50లక్షలతో రెండు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ముత్యాలరెడ్డి నగర్ మెయిన్‌రోడ్డు వరకు రోడ్డు దెబ్బతినింది.దీని వలన ప్రజలు తీ వ్ర ఇబ్బందులకు గురయ్యారు.దీనికి పరిష్కారంగా రూ.50లక్షలతో ఆర్‌సిసి రిటైనింగ్ వాల్,సిసి రోడ్డు నిర్మించబోతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వడ్లమూడి వెంకటేశ్వరరావు, నూహన్ నజీర్,దుడికి సాంబయ్య,షేక్ రఫీ,నాగుల్‌మీరా,శంకర్,రామారావు,నాగరాజు,స ంజీవరావు,గుర్రం ప్రసాద్,మొవ్వ వేణు బాబు తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులు ప్రతి ఒక్కరు గుర్తింపు కార్డు కలిగి ఉండాలి

**గుంటూరు తూర్పు, జులై 19 (ప్రభాతవార్త) :** నగరపాలక సంస్థ పరిధిలో వీధి వ్యాపారులు ప్రతి ఒక్కరు నగర పాలక సంస్థ జారీ చేసే గుర్తింపు కార్డు కలిగి ఉండాలని నగర కమీషన్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. గుర్తింపు కార్డు లేనిచో వీధి వ్యాపారానికి అనుమతించబడదని, ఆఖరి అవకాశంగా నూతన గురి ్తంపు కార్డుల దరఖాస్తుల స్వీకరణకు నేటి నుండి 25వరకు నగర పాలక సంస్థ ప్రధాన సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, గుర్తింపు కార్డు లేని వారు నిర్ధేశిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే గుర్తింపు కార్డుల సర్వే నగర పాలక సంస్థ నిర్వహించిందని, వీధి వ్యాపారాలు నిర్వహించు వ్యాపార సముదాయాల వద్దకు మెప్మా మరియు సచివాలయ సిబ్బంది వచ్చి తప్పని సరిగా సర్వే చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సర్వేకాని ప్రతి ఒక్క వీధి వ్యాపారి నగర పాలక సంస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని నగరపాలక సంస్థ నుండి గుర్తింపు కార్డు పొందాలన్నారు. వీధి వ్యాపారులు అందరూ దరఖాస్తుతో పాటుగా వ్యక్తిగత ఫోటో (వ్యాపారం చేయుచున్న పాస్ ఫోర్ట్ ఫోటో)కుటుంబ సభ్యుల ఫోటో (14సంవత్సరాలు మించిన వారు మాత్రమే), ఆధార్ కార్డు, పాస్‌ఫోర్ట్ ఫోటో, రేషన్ కార్డు, వోటర్ కార్డు, అర్జీదారుని ఫోన్ నెంబర్, బ్యాంకు ఎకౌంటు నకలు తదితర గుర్తింపు పత్రాలను జత పరచాలన్నారు. కేటాయించిన గుర్తింపు కార్డుల ప్రామాణికంతో వారు నిర్వహించే వ్యాపారాల మేరకు జిఎంసి ఏర్పాటు చేయనున్న వెండింగ్ జోన్లలో స్థల కేటాయింపు జరుగుతుందని తెలిపారు.

# సత్తెనపల్లి అభివృద్ధిపై ప్రజలు హర్షం వ్యక్తం


**సత్తెనపల్లి టౌన్ (జూలై 19ప్రభాతవార్త) :** సత్తెనపల్లి పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి లో సత్తెనపల్లిశాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ఎంతో మార్పు తెచ్చారని జిల్లా ఉపాధ్యక్షులు గన్నమనేని శ్రీనివాసరావు, అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ 48,49,51 బూత్ లలో



పర్యటించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు.వారు తెలియజేసిన వివరాలను ఎంవై టిడిపి యాప్లో అప్లోడ్ చేసామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గన్నమనేని శ్రీనివాసరావు, క్లస్టర్ రెండవ ఇంచార్జ్ చుక్కపల్లి శ్రీనివాసరావు, కో క్లస్టర్ చింతపల్లి రాంబాబు, 13 వ వార్డ్ అధ్యక్షులు జక్కుల శ్రీనివాసరావు, 12 వ వార్డ్ అధ్యక్షులు చొప్పవారపు శ్రీనివాసరావు, పద్మారావు, ఆర్ ఎం పి భాషా, ఎస్ నరసింహారావు, కాశి మల్లేశ్వరరావు, సుఖవాసి వెంకటేశ్వరరావు, వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ఇన్నోవేటివ్ పోటీల్లో ఆర్‌విఆర్ జేసి కళాశాల విద్యార్థి ప్రతిభ

**గుంటూరు విద్య,జూలై 19,ప్రభాతవార్త :** యువ ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థికి ప్రతిష్టాత్మక అవార్డుతో



పాటు రూ.20వేల నగదు పురస్కారం అందుకోవడం గర్వకారణమని ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్,డాక్టర్ జగదీష్ కె.మద్దినేని హర్షం వ్యక్తం చేశారు.ఇటీవల భారత ప్రభుత్వ గణాంకశాఖ,మై గవర్నమెంట్ సంయుక్తంగా నిర్వహించిన డేటా విజువలైజేషన్ హ్యాకథాన్ ఆన్‌లైన్ పోటీల్లో దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన వివిధ కళాశాలల,యూనివర్సిటీల నుండి వేల సంఖ్యలో ఎంట్రీలు రాగా అందులో నుండి 2,650సరైన ప్రాజెక్టులుగా ఎంపిక చేయగా, అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టాప్ 30 ప్రాజెక్టులకు విజేతలుగా నిర్ణయించారు.ఇందులో ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాలల్లో డేటా సైన్స్ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న పి.జయంత్ విద్యార్థి అందించిన ప్రాజెక్టు 4వ స్థానంలో విజేతగా నిలిచి కేంద్ర ప్రభుత్వం నుండి అవార్డుతోపాటు రూ.20వేల నగదు అందుకున్నారు. బహుమతి అందుకున్న పి.జయంత్‌ను కళాశాల సిబ్బంది అభినందిం చారు.కేంద్ర ప్రభుత్వం యువ ఆవిష్కర్తల ప్రతిభను వెలికితీసి వారినిప్రోత్స హించేందుకు నిర్వహిస్తున్న ఇలాంటి జాతీయస్థాయి పోటీల్లో తమ కళాశాలకు అరుదైన గౌరవం దక్కడం ఆనందదాయకమని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ,ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.తమ కళాశాల విద్యార్థి సమాజ శ్రేయస్సుకు దోహదపడే గణాంకాలను విశ్లేషించి రూపొందించిన ఎంప్లాయిమెంట్ ఎకనామిక్ డిస్పారిటీస్ ఎండ్ ఎంపిసిఈ ఇన్ ఇండియా అనే ప్రాజెక్టు కు జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అవార్డు లభించడం ఆనందదాయకమని పేర్కొన్నారు.విద్యార్థిని అభినందించిన వారిలో కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర,కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మిని స్ట్రేషన్ డాక ్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, కళాశాల డేటా సైన్స్ విభాగాధిపతి ఎం.వి.పి.చంద్రశేఖరరావు తదితరులు ఉన్నారు.

# మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం పలికిన మేయర్



**గుంటూరు తూర్పు, జులై 19 (ప్రభాతవార్త) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని స్థానిక అమరావతి రోడ్డు నందలి బండ్లమూడి గార్డెన్స్ లో జరిగిన మెగా కాన్ఫరెన్స్ టు సిఏ స్టూడెంట్స్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ మరియు ఆర్టీజీయస్ మంత్రి నారా లోకేష్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర.

# సాగర్ ఆయకట్టు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ భవన నిర్మాణానికి భూమిపూజ

**నరసరావుపేట, జూలై 19 ప్రభాతవార్త :** శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు శనివారం ఎన్ఎస్‌పి కాలనీలో నూతనంగా నిర్మించే



సాగర్ కుడి కాలువ ఆయకట్టు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పులిమి రామిరెడ్డి, కూటమి నాయకులతో పాటు ఎన్ఎస్‌పి అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ భవన నిర్మాణం ఏర్పాటుతో రైతులకు సాగర్ ఆయకట్టు పరిధిలో మెరుగైన సేవలను అందించేందుకు ఉపయోగమని తెలియజేశారు.

**పబ్లిక్ ప్రాసిక్యూటర్ గూండాల సురేష్‌కు ఎమ్మెల్యే సత్కారం...**

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన గూండాల సురేష్‌బాబుకు నిర్వహించిన అభినందన సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సామాజిక న్యాయానికి పెద్దపీత వేస్తూ బలహీన వర్గాల ప్రాతినిధ్యానికి సురేష్‌బాబు నియామకం దోహదపడుతుందన్నారు. అణగారిన వర్గాల కోసం నిలబడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టా కిరణ్, కొల్లి బ్రహ్మయ్య, అత్తులూరి సుబ్బారావు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు మెడికల్ రిప్రజంటేటివ్స్ వినతి...**

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబుకు శనివారం నాయకులు వినతిపత్రం అందజేశారు. యూనియన్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కలెక్టర్ మంజూరు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు.

# మంత్రి నాదెండ్ల తెనాలికి ఎంచేశారో చెప్పాలి

## మాజీఎమ్మెల్యే శివకుమార్ సూటిప్రశ్న

**తెనాలి, టౌన్ జులై 19 (ప్రభాతవార్త) :** కూటమి ప్రభుత్వంలో కీలకమైన మంత్రిగా ఉన్న నాదెండ్ల మనోహర్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న తెనాలి నియోజకవర్గానికి ఏంచేశారో చెప్పమని



మాజీ శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ సూటిగా ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడుతూ ఏది నిజం, ఏది అబద్ధం అంటూ ప్రశ్నలు సంధించారు. గతంలో స్పీకర్‌గా, నేడు మంత్రిగా ఉన్న నాదెండ్ల తెనాలి అభివృద్ధికి ఎం చేశారో ఎన్నుకున్న ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తెనాలి నుండి నందివెలుగు వరకు గుంటలు పుడ్చలేకపోయారని, తెనాలిని రాజధానిలో కలపటానికి ఎటువంటి కృషి చేయలేదని, పట్టణంలో ట్రాఫిక్ నియంత్రించలేక పోయారని, శాంతిభద్రతలు, గంజాయిని అరికట్టలేకపోయారని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారని, అన్ని రంగాల్లో విఫల మయ్యారని మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ధ్వజమెత్తారు. అంతే కాకుండా వారానికి ఒక్కసారి నియోజకవర్గానికి ఒకసారి వచ్చే ఆయన మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శిస్తున్నారని, అప్పుడప్పుడు వచ్చి మురుగు కాలువలు చూడటం తప్ప చేసింది ఏం లేదన్నారు. అలాగే పట్టణంలో రోడ్లు కూడా 15వ ఆర్థిక సంఘం నిధులతో మున్సిపాలిటీ వారు నిర్మించారని, ఈయన చేసింది ఏమి లేదన్నారు. మున్సిపల్ టెండర్లు పిలిస్తే ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రాలేదని, ఇది ఆయన పనితీరు అని దుయ్యబట్టారు. అదే మంటే ప్రజలు మమ్ములను చూసి ఓటేశారని అంటున్నారని, గతంలో ఆయన ఒంటరిగా పోటీచేస్తే కనీసం డిపాజిట్లు కూడా రాలేదని, వీకెండ్ ఎమ్మెల్యేగా మిగిలిపోయారని ప్రజలు అన్ని గమనిస్తున్నారని మాటలకు చేతలకు కూడా చూపిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధిచెపుతారని శివకుమార్ ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో పట్టణ వైసీపీ అధ్యక్షులు దేసు శ్రీనివాసరావు, రూరల్ అధ్యక్షులు చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తాడిబోయిన రమేష్, గోల్డ్ రెహమాన్, కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, పెచ్చింగ్ సుభాని, చింకా సురేష్, అక్కిదాసు కిరణ్‌కుమార్, పెదలంక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ 16వ మహాసభలు జయప్రదం చేయాలని ప్రచారం

**పెదకూరపాడు, జూలై 19 ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్ట్ పార్టీ నియోజకవర్గ 16వ మహాసభలను జయప్రదం చేయాలని కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు శనివారం పిలుపునిచ్చారు. ఈ నెల 20వతేదీన పోలీస్ క్వార్టర్స్ సమీపంలో 16వ మహాసభ జరుగుతుందన్నారు. మహాసభలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబులు హాజరౌతారని



మునగోటి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగుల్‌మీరా, ఏసోబు, ప్రసాద్, సుధాకర్, రత్నరాజు, పురుషోత్తం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

20-7Pg5.qxd:20-7Pg5.qxd 01/01/01 7:54 AM Page 1



# రష్యాపై ఇయు మరిన్ని ఆంక్షలు

## భారత్ చమురు కంపెనీలపై ప్రభావం



**న్యూఢిల్లీ,జూలై 19:** ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఉన్న రష్యా ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈక్రమంలోనే రష్యా చమురు ఎగుమతులపై తాజాగా మరిన్ని ఆంక్షలను ప్రకటించింది. వీటి ప్రభావం తొలిసారిగా భారత్‌పైనా పడింది. ఈయూ ఆంక్షలతో గుజరాత్‌లోని వాదినార్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న నయారా ఎనర్జీ కంపెనీ రిఫైనరీ (చమురు శుద్ధి కర్మాగారం) ప్రతికూలంగా ప్రభావితం కానుంది. రష్యాకు, నయారా ఎనర్జీకి సంబంధం ఏమిటంటే, ఈ రిఫైనరీలో రష్యా ప్రభుత్వానికి చెందిన రోస్‌నెఫ్ట్ కంపెనీకి 49.1 శాతం వాటా ఉంది. అందుకే నయారా ఎనర్జీపై ఆంక్షలను విధించామని ఈయూ విదేశాంగ విధానాల విభాగం అధిపతి కాజా కలస్ ఇటీవల వెల్లడించారు. దీనిపై భారత విదేశాంగ శాఖ ఘాటుగా స్పందించింది. యూరోపియన్ యూనియన్ ఏకపక్షంగా విధించిన ఆంక్షలను అంగీకరించేది లేదని తేల్చి చెప్పింది. చట్టపరమైన నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగానే విదేశాల నుంచి భారత్ బాధ్యతాయుతంగా చమురును దిగుమతి చేసుకుంటోందని స్పష్టం చేసింది. ఇంధన భద్రత విషయంలో ఈయూ దేశాల ద్వంద్వ ప్రమాణాలను భారత్ అంగీకరించదు. భారత ప్రజల కనీస అవసరాలను తీర్చేందుకు ఇంధన భద్రతకు భారత ప్రభుత్వం అత్యుత్తమ ప్రాధాన్యం ఇచ్చి తీరుతుంది. ఇంధన వాణిజ్యం విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు అస్సలు తావు ఉండకూడదని మేం పునరుద్ఘాటిస్తున్నామని పేర్కొంటూ భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. సంపన్న దేశాల కూటమి జీ7లో లేని దేశాలు రష్యా నుంచి దిగుమతి చేసుకునే ముడి చమురుకు చెల్లించాల్సిన రేటును యూరోపియన్ యూనియన్ (ఈయూ) మరింతగా తగ్గించింది. ఒక బ్యారెల్ రష్యన్ ముడి చమురుకు ప్రస్తుతం 60 డాలర్ల రేటు మాత్రమే ఉంది. దీని కంటే తక్కువ రేటును ఈయూ తాజా ఆంక్షల్లో భాగంగా నిర్దేశించింది. ప్రస్తుతం ఇతర దేశాలు ఒక బ్యారెల్ ముడి చమురును సగటున 69.35 డాలర్లకు విక్రయిస్తున్నాయి. చమురు ఎగుమతులతో రష్యాకు లభించే ఆదాయాన్ని వీలైనంత మేరకు తగ్గించేందుకు ఈవిధమైన ఆంక్షలను ఈయూ అమలు చేస్తోంది. తాము నిర్దేశించిన తక్కువ రేటుకు రష్యా నుంచి ముడి చమురును కొనే దేశాలకే ఐరోపా దేశాల చమురు రవాణా నౌకలు, బీమా సేవలను వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఈయూ ఇటీవలే స్పష్టం చేసింది. రాడార్‌కు చిక్కకుండా రష్యా ముడి చమురును రవాణా చేస్తున్న మరో 105 ఆయిల్ ట్యాంకర్ నౌకలను తమ ఆంక్షల జాబితాలో చేర్చామని యూరోపియన్ యూనియన్ వెల్లడించింది. ఇప్పటివరకు ఈవిధమైన మొత్తం 223 రాడార్‌కు చిక్కని నౌకలపై ఆంక్షలను విధించామని తెలిపింది. దాదాపు 400కుపైగా ఆయిల్ ట్యాంకర్ నౌకలతో విదేశాలకు రష్యా క్రూడ్ ఆయిల్‌ను ఎగుమతి చేస్తుంటుంది. దాదాపు 223 నౌకలను ఆంక్షల పరిధిలోకి చేర్చడం ద్వారా రష్యా చమురు ఎగుమతులను అడ్డుకునేందుకు ఈయూ యత్నిస్తోంది.

# మాతో పెట్టుకుంటే కనుమరుగే..



## బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, జూలై 19:** వాణిజ్య సుంకాల విషయంలో కఠిన వైఖరిని అవలంభిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బ్రిక్స్ కూటమిపై మరోసారి విరుచుకుపడ్డారు. అది 'చిన్న గ్రూప్' అంటూ విమర్శించిన ఆయన ఆ దేశాలు డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేస్తే గనుక 10 శాతం అదనపు సుంకాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని పునరుద్ఘాటించారు. క్రిప్టో కరెన్సీ చట్టబద్ధతకు సంబంధించిన 'జీనియస్' బిల్లుపై సంతకం చేసిన ట్రంప్ తర్వాత వైట్‌హౌస్ వద్ద మీడియాతో మాట్లాడారు. 'బ్రిక్స్ అనే చిన్న గ్రూప్ ఉంది. అది చాలా వేగంగా తన ఉనికిని కోల్పోతోంది. వారిని మేం చాలా బలంగా కొట్టాం. డాలర్ ఆధిపత్యాన్ని నియంత్రించాలని వారు చూస్తున్నారు. మా కరెన్సీ ప్రమాణాన్ని అధిగమించాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే వారిపై టారిఫ్‌లు విధిస్తామని ప్రకటించాం' అని ట్రంప్ వెల్లడించారు. 'మాతో ఆటలు వద్దు. అమెరికా డాలర్‌కు గ్లోబల్ రిజర్వ్ హోదా ఉంది. దాన్ని ఎప్పటికీ కొనసాగించాల్సిన అవసరం ఉంది. డాలర్ విలువ తగ్గడాన్ని మేం ఎన్నటికీ అంగీకరించబోం. మా కరెన్సీ స్టేటస్ పడిపోతే దాన్ని మేం ఓటమిగానే భావిస్తాం' అని ట్రంప్ స్పష్టం చేశారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలతో కలిసి బ్రిక్స్ కూటమి ఏర్పడింది. ఆ తర్వాత అందులో ఇరాన్, ఇథియోపియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేసియా కూడా చేరాయి. ఈ పది దేశాలను కలిపి బ్రిక్స్ ప్లస్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ట్రంప్ ఏకపక్ష సుంకాల పెంపుపై ఈ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా అధ్యక్షుడు బ్రిక్స్ అనుసరిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. బ్రిక్స్ దేశాల పైనా టారిఫ్‌లు ఉంటాయని ప్రకటించారు.

# నాలుగేళ్ల బాలికపై డిజిటల్ రేప్

**లక్నో,జూలై 19:** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో నాలుగేళ్ల బాలికపై జరిగిన లైంగిక వేధింపు ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనను డిజిటల్ అత్యాచారంగా పరిగణిస్తున్నారు. జులై 14న జరిగిన ఈ దారుణ ఘటనలో స్కూల్ వ్యాన్ డ్రైవర్ మొహమ్మద్ ఆరిఫ్‌ను ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ ఘటన ఇందిరానగర్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఆరిఫ్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), లైంగిక వేధింపుల నుంచి బాలల రక్షణ చట్టం (పోక్సో), మరియు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. బాధిత బాలిక తల్లి తెలిపిన వివరాల ప్రకారం, బాలిక తన మర్మావయవాల వద్ద నొప్పి గురించి ఫిర్యాదు చేయడంతో తల్లి పరీక్షించగా, ఆ భాగంలో గాయాలు కనిపించాయి. ఈ ఘటన గురించి పోలీసులకు సమాచారం అందించినప్పుడు, నిందితుడు ఆరిఫ్ బాధిత కుటుంబాన్ని బెదిరించి, ఫిర్యాదు చేయవద్దని హెచ్చరించినట్లు ఆరోపణలు వచ్చాయి. స్కూల్ మేనేజర్ సందీప్ కుమార్‌ను కూడా సహనిందితుడిగా పేర్కొన్నారు. ఈ ఘటనపై లక్నో ఈస్ట్ డిసిపి శశాంక్ సింగ్ మాట్లాడుతూ, నిందితుడు మొహమ్మద్ ఆరిఫ్‌ను అరెస్ట్ చేసి, ఘటన జరిగిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాధిత బాలిక వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించగా, మర్మావయవాల వద్ద గాయం ఉన్నట్టు నిర్ధారణ అయింది. ఈ ఘటన స్థానికంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది, మరియు స్కూల్ యాజమాన్యం బాధ్యతారాహిత్యంపై ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. డిజిటల్ రేప్ అంటే ఒక వ్యక్తి యొక్క ప్రైవేట్ భాగాలలో బలవంతంగా, సమ్మతి లేకుండా చేతి వేళ్ల లేదా కాలి వేళ్లను చొప్పించడం. ఇక్కడ "డిజిటల్" అనే పదం (డిజిట్స్) చేతి లేదా కాలి వేళ్లను సూచిస్తుంది. ఈ చర్యను తీవ్రమైన లైంగిక వేధింపుగానే పరిగణిస్తారు. కేవలం బాహ్య సంపర్కంతో కూడిన వేధింపులకు భిన్నంగా, డిజిటల్ రేప్ అనేది సమ్మతి లేని లైంగిక చర్యగా భావిస్తారు. ప్రపంచవ్యాప్తంగా వైద్య నిపుణులు మరియు మానవ హక్కుల సంస్థలు డిజిటల్ రేప్‌ను శరీరస్వయం ప్రతిపత్తి మరియు మానవ గౌరవంపైతీవ్రమైన ఉల్లంఘనగా గుర్తిస్తున్నాయి.

# 42దేశాలు చుట్టివచ్చిన మోడీకి మణిపూర్ వెళ్లాలనిపించలేదా?

## మైసూరులో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



**బెంగళూరు, జులై 19:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. ఇప్పటి వరకు 42 దేశాల్లో ప్రధాని మోదీ పర్యటించారనీ, కానీ జాతుల మధ్య వైరంతో ఏడాదికిపైగా అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్ సందర్శనకు సమ యం లేదని చురకలు వేశారు. రాజ్యాంగాన్ని హత్య చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చడానికి ఎంత యత్నించినా దేశ ప్రజలు అనుమతించరని చెప్పారు. రాజ్యాంగం వల్లే మోదీ ఒకప్పుడు ముఖ్యమంత్రి, ప్రస్తుతం ప్రధానమంత్రి అయ్యారని ఖర్గే గుర్తుచేశారు. కర్ణాటకలోని మైసూర్‌లో 2 వేల 500 కోట్లకుపైగా వ్యయం తో కూడిన అభివృద్ధి పనులకు ప్రారంభో త్స వాలు, శంకుస్థాపనలు చేసిన తర్వాత ఖర్గే మాట్లాడారు. మరోవైపు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాపై ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంపైనా మల్లిఖార్జున ఖర్గే స్పందించారు. వాద్రాతో పాటు గాంధీ కు టుంబానికి అపఖ్యాతి తెచ్చేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కానీ వారు అనుకున్న పనులు జరగవని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగానే ఈడీ ఇలా వ్యవహరిస్తుందని విమర్శించారు. వాద్రాను వేధించడం సరైనది కాదని, ఆయన చేసిన మంచి పనులకు తమ మద్దతు ఉంటుందని ఖర్గే పేర్కొన్నారు. కాంగ్రెస్ ల్యాండ్ జిహాద్‌కు పాల్పడుతుందంటూ బిజెపి చేసిన ఆరోపణలపైన స్పందించిన ఖర్గే, అదేంటో తనకు తెలియదని చెప్పారు. ఒకవేళ తనకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలనుకుంటే స్వాగతిస్తానని తెలిపారు. వారు ఎప్పుడు చర్యలు తీసుకున్నా, తాను స్పందిస్తానని వివరించారు. అంతకుముందు తన బావ రాబర్ట్ వాద్రాను పదేళ్లుగా బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం వెంటాడుతూనే ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. రాజకీయ కక్ష, దురుద్దేశంతో పెట్టిన ఈ కేసును ఎదుర్కొనేందుకు రాబర్ట్, ప్రియాంకల కుటుంబానికి తాను అండగాఉంటానని హామీ ఇచ్చారు. వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాపై షికోపుర్ ల్యాండ్స్ వ్యవహారానికి సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసుకు సంబంధించి 2018 సెప్టెంబర్‌లో వాద్రా పేరు ఎఫ్ఐఆర్‌లో నమోదు కాగా, ఇప్పటికే ఆయన్ను పలుమార్లు దర్యాప్తు సంస్థ విచారణకు పిలిచి ప్రశ్నించింది. ఈడీ ప్రకారం వాద్రాకంపెనీ 2008 ఫిబ్రవరిలో గురుగ్రామ్‌లోని షికోపూర్‌లో 3.5ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుక్కుంది. అయితే, దీని విలువ రూ.7.5కోట్లు కాగా, ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆభూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది.

# ప్రధాని వచ్చేవారం యుకె, మాల్దీవుల్లో పర్యటన



**న్యూఢిల్లీ, జులై 19:** ప్రధాని నరేంద్రమోడీ వచ్చే వారంలో విదేశ పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. జులై 23 నుంచి 26 వరకు యుకె, మాల్దీవుల్లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. గతేడాది మోడీపై, లక్షద్వీప్‌పై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. విభేదాల అనంతరం ప్రధాని ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాల్దీవులతో బలమైన దౌత్య సంబంధాలు, పరస్పర ప్రయోజనాలు పునరుద్ధరించడానికి ఈ పర్యటన సహకరిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. జులై 23,24 తేదీలలో మొదట యుకెలో జరగనున్న భారత్, బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై జరిగే చర్చల్లో మోడీ పాల్గొని ఒప్పందంపై సంతకం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. యుకె ప్రభుత్వంతో దౌత్య, వాణిజ్య చర్చలు జరపనున్నారు. అనంతరం జులై 25,26 తేదీలలో ప్రధాని మాల్దీవులకు వెళ్లనున్నారు. మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరవుతారు.

## రాజస్థాన్‌లో భారీగా వరదలు: యాత్రికుడిని కాపాడిన స్థానికులు



**జైపూర్, జులై19:** రాజస్థాన్‌లోని అజ్మేర్‌ను భారీ వర్షాలు ముంచెత్తడంతో రోడ్లన్నీ నదులను తలపించాయి. ఖ్వాజా గరీబ్ నవాబ్ దర్గా ప్రాంతాన్ని వరద నీరు చుట్టుముట్టింది. ఇరుకు సందుల్లోకి ఆకస్మికంగా వరదనీరు రావడంతో ఓ వ్యక్తి కొట్టుకుపోతున్న దృశ్యాలు ప్రతిఒక్కరిని భయభ్రాంతులకు గురిచేశాయి. అది చూసిన వారంతా అతడకి సహాయం చేసేందుకు తమ వంతు ప్రయత్నాలు చేయడం మొదలెట్టారు. వెంటనే అక్కడ హోటల్‌లోని ఒక వ్యక్తి ధైర్యంగా ముందుకువచ్చాడు. చేయి అందిపుచుకుని, ఇతరుల సహాయంతో పైకి లాగాడు. దాంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గత 24గంటలుగా రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కోటాలోని సంగాడ్‌లో రికార్డుస్థాయిలో వర్షపాతంనమోదైంది. కాగా అల్పపీడన ప్రభావంతో రానున్న 24గంటల్లో వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం వెల్లడించింది.

# భారీ రుణాలిస్తానని ఫీజులురూపంలో రూ.32కోట్లు స్వాహా

## రహస్య గదిలో దాక్కున్న నిందితుడిని అరెస్టుచేసిన పోలీసులు

**బెంగళూరు,జూలై 19:** పెద్ద మొత్తంలో రుణాలు ఇస్తానని అనేక మంది వ్యాపారవేత్తలను కర్ణాటకలో ఒక వ్యక్తి రూ.32 కోట్లు మోసం చేశాడు. పోలీసులు కేసునమోదు చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా అతడిని తన విలాసవంతమైన ఇంటిలోని ఒకరహస్య బేస్‌మెంట్ గదిలో ఉన్నట్లు గుర్తించి వెంటనే అరెస్ట్ చేశారు. మంగళూరు జెప్పినమొగరు ప్రాంతంలోని బొల్లాగుడ్డకు చెందిన నిందితుడు రోషన్ సల్దాన్హాపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని వివిధ విభాగాల కింద కేసులు నమోదయ్యాయి. తన విలాసవంతమైన ఇంటిలోని ఒక రహస్య బేస్‌మెంట్ గదిలో రోషన్ సల్దాన్హా అనే నిందితుడు దాక్కున్నట్లు పోలీసులకు సమాచారమిచ్చారు. వార్డ్‌రోబ్ వెనుక ఉన్న రహస్య ద్వారాన్ని గుర్తించిన పోలీసులు భూగర్భ గదిలోకి వెళ్లారు. సల్దాన్హానుగుర్తించి అరెస్టు చేసిన తర్వాత మరొక రహస్య గదిని కూడా కనుగొన్నారు. ఆ తర్వాత సీక్రెట్ బేస్‌మెంట్‌లో సోదాలు చేపట్టారు. ఆ సమయంలో అనుమతి లేకుండా నిల్వ చేసిన విదేశీ, దేశీయబ్రాండ్‌లతో సహా రూ.6.72 లక్షల విలువైన మద్యాన్ని కూడా పోలీసులు కనుగొని స్వాధీనం చేసుకున్నారు. అదనంగా అధికారులు ముఖ్యమైనపత్రాలు, ఖాళీ చెక్కులు, దాదాపు 667 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2.75 కోట్ల విలువైన వజ్రాల ఉంగరాలను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోనే కాకుండా ముంబయి,గోవా,బెంగళూరు, పుణె, విజయపుర, తుమకూరు, కోల్‌కతా, సాంగ్లి, లక్నో, భాగల్‌కోట్ వంటినగరాలకు చెందిన వ్యాపారవేత్తలకు సల్దాన్హా మోసం చేశారని నగర పోలీసు కమిషనర్ సుధీర్‌కుమార్ రెడ్డి తెలిపారు. పెద్దమొత్తంలో వ్యాపార రుణాలు ఇస్తానని హామీ ఇచ్చి, ప్రాసెసింగ్ లేదా ఫెసిలిటేషన్ ఫీజులుగా భారీ మొత్తాలను వసూలు చేశారని చెప్పారు.ఆపై ఎటువంటి రుణాలు ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయని సిపి తెలిపారు. గత మూడు నెలల్లోనే బాధితుల నుంచి రూ.32 కోట్లకుపైగా వసూలుచేసినట్లు తెలిపారు. సల్దాన్హాను కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

## కేన్సర్ చికిత్సకోసం కొత్త టీకా..

**న్యూఢిల్లీ,జూలై 19:** ఫ్లోరిడా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ప్రయోగాత్మక ఎంఆర్ఎన్ఏ (మెసెంజర్ రిబోన్యూక్లియిక్ యాసిడ్) టీకాను అభివృద్ధి చేశారు. కేన్సర్‌నివారణకు ఇదొక కొత్త ఔషధంగా పేర్కొంటున్నారు. ఇది కణతులు (ట్యూమర్లు)పై శరీర రోగ నిరోధక వ్యవస్థ స్పందనను పెంచుతుంది. ఈ టీకాను ప్రామాణిక ఇమ్యునో థెరపీ ఔషధాలతో కలిపి ఎలుకలకు ఇచ్చినపుడు కణతులపై గట్టి ప్రభావం చూపింది. ఈ అధ్యయన నివేదికను 'నేచర్ బయోమెడికల్ ఇంజినీరింగ్' జర్నల్‌లో ప్రచురించారు. ఈ టీకా పట్ల భరోసా ఎందుకంటే, ఇది నిర్దిష్ట ట్యూమర్ ప్రొటీన్స్‌ను లక్ష్యంగా చేసుకోదు. ఇది ఓ వైరస్‌తో పోరాడుతున్నట్లుగా, రోగ నిరోధక వ్యవస్థను క్రియాశీలం చేస్తుంది. కణతులలోని పీడీఎల్1 అనే ప్రొటీన్ ఎక్స్‌ప్రెషన్‌ను బలోపేతం చేయడం ద్వారా ఈ ఫలితాన్ని సాధించారు. దీనివల్ల కణతులు చికిత్సకు మరింత ఎక్కువగా స్పందిస్తాయి.

# సంక్షిప్తంగా..

## బోల్సొనారోపై ఆంక్షలు.. బ్రెజిల్ 'జడ్జి' వీసా రద్దు చేసిన యుఎస్



**వాషింగ్టన్, జూలై 19:** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో కాలి చీలమండకు ఎలక్ట్రానిక్ పర్యవేక్షక పరికరాన్ని అమర్చి ఆయన కదలికల్ని గమనించాలని ఆ దేశ సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ చర్యలపై అమెరికా దీటుగా స్పం దించింది. బోల్సొనారోపై ఆంక్షలు విధిం చిన బ్రెజిల్ న్యాయమూర్తి వీసా రద్దు చేసింది. అంతకు ముందు ట్రంప్ స్పందిస్తూ తన మిత్రుడైన బోల్సొనారో పట్ల బ్రెజిల్ న్యాయ వ్యవస్థ అన్యాయంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. మాజీ అధ్యక్షుడు బోల్సొనారోపై బ్రెజిల్ సుప్రీం ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆరోపించారు. న్యాయస్థానం చర్యలు బ్రెజిలియన్ల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే కాకుండా అమెరికన్లను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నమేనని మండిపడ్డారు.

## 12వ తరగతి విద్యార్థినికి నిప్పంటించిన దుండగులు

**భువనేశ్వర్,జూలై 19:** బిజెపి పాలిత ఒడిశాలో నేరాలు పెరుగుతున్నాయి. స్నేహితురాలి ఇంటికి వెళ్తున్న అమ్మాయిని ముగ్గురు వ్యక్తులు అడ్డుకున్నారు. ఆమెకు నిప్పంటించి పారిపోయారు. తీవ్రంగా కాలినగాయాలైన బాలిక ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. ఒడిశాలోని పూరీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బయాబర్ గ్రామానికి చెందిన 12వ తరగతి చదువుతున్న బాలిక బుక్స్ తిరిగి ఇచ్చేందుకు శనివారం ఉదయం 8.30 గంటలకు స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నది.భార్గవి నదిసమీపంలోని నిర్జన ప్రదేశంలో ముగ్గురువ్యక్తులు ఆమెను అడ్డుకున్నారు. ఆ అమ్మాయిని కట్టేసి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు.ఆతర్వాత అక్కడి నుంచి పారిపోయారు. కాగా అరుస్తున్న బాలికను స్థా నికులు పిపిలీలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## బీవర్‌జిల్లాలో గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ బోగీల్లో మంటలు

**జైపూర్,జూలై 19:** రాజస్థాన్‌లో బీవర్ జిల్లాలోని ఓ రైలు అగ్ని ప్రమాదానికి గురైంది. పైలట్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. పైలట్ రైలును నిలిపివేసి కంట్రోల్ రూమ్‌కి సమాచారం ఇవ్వగా, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. కాగా ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం నేపథ్యంలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బీవర్ జిల్లాలో శనివారం ఉదయం సెంద్రా రైల్వే స్టేషన్ సమీపంలో రైల్లో అగ్ని ప్రమాదం జరిగింది. ముంబయిదిల్లీకి వెళ్లే 12216 గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో మంటలు చెలరేగాయి. మొదట చక్రాల నుంచి పొగలు రావడంతో గమనించిన పైలట్ రైలును నిలిపివేసి కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన రైల్వే సిబ్బంది అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్(ఏడీఆర్ఎం) వికాస్ బురా, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ ఆఫీసర్‌స్వాతి జైన్ తమ బృందంతో ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇంజిన్ కింది నుంచి వస్తున్న పొగలను నియంత్రించారు.

## అజారుద్దీన్ మాజీ భార్య సంగీతా బిజ్లాని ఫామ్‌హౌస్ ధ్వంసం

**పూణె,జూలై 19:** క్రికెట్ దిగ్గజం మహ్మద్ అజారుద్దీన్ మాజీ భార్య, బాలీవుడ్ నటి సంగీతా బిజ్లానీకి చెందిన ఫాంహౌస్ ధ్వంసమైంది. మహారాష్ట్రలోని పుణే సమీపంలోని టికోనా గ్రామంలో సంగీతా బిజ్లానీకి ఫాంహౌస్ ఉంది. ఈ నెల 18న ఆమె తన ఇద్దరు సహాయకులతో కలిసి ఫాంహౌస్‌ను సందర్శించినప్పుడు ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మెయిన్ గేటు, కిటికీల గ్రిల్స్ విరిగిపోయిన స్థితిలో కనిపించాయి. రూ.7 వేల విలువైన ఒక టీవీ చోరీకి గురైంది. అంతేకాక, మరో టీవీ, బెడ్‌లు, రిఫ్రిజిరేటర్, సీసీటీవీ కెమెరాలు ధ్వంసం అయ్యాయి. ఫాంహౌస్‌లో ఉన్న ఇంటిలో ఎగువ అంతస్తు పూర్తిగా దెబ్బతింది. ఇంట్లోని గృహోపకరణాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. తన తండ్రి ఆరోగ్య సమస్యల కారణంగా నాలుగు నెలలుగా ఫాంహౌస్‌ను సందర్శించలేదని సంగీతా బిజ్లానీ తెలిపారు. ఇప్పుడు వచ్చి చూసేసరికి అంతా ధ్వంసమై ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

## కరుణానిధి పెద్దకుమారుడు ముత్తు మృతి

**చెన్నై,జూలై 19:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పెద్దకుమారుడు ముత్తువేల్ కరుణానిధి ముత్తు (ఎంకే ముత్తు) అనారోగ్యంతో మరణించారు.ముత్తు శనివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో చెన్నైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఈయన 1948 జనవరి 14న కరుణానిధిపద్మావతి దంపతులకు జన్మిం చారు. తన తండ్రి కళాభిరుచి లాగే ఎం.కె. ముత్తు కూడా తొలుత నాటకాల్లో, తరువాత సినిమాల్లో నటించడం ప్రారంభించారు. ఇదే సమయంలో 70వ దశకంలో డీఎంకే వేదికలపై పార్టీ విధానాలను వివరిస్తూ పాటలు పాడటం ద్వారా ప్రజల్లో ఎంతోఆదరణ పొందారు. ఆయ న నటించిన చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. ఆయన డీఎంకే వేదికలపైనే కాకుండా పలు సినిమాల్లో కూడా పాటలు పాడారు.

# 300కుపైగా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా!



**కీవ్, జూలై 19:** కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు కొనసాగుతున్నప్పటికీ ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తోంది. తాజాగా మాస్కో కీవ్‌పై 300కి పైగా డ్రోన్లు, 30 క్షిపణులతో విరుచుకుపడినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. దాడిలో అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. భవనాల శిథిలాల కింద అనేక మంది ప్రజలు చిక్కుకున్నారని వారిని బయటకు తీసుకొచ్చేందుకు భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. రష్యన్ దళాలు ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులు ప్రయోగించడంతో ఒకరు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్ర గాయాలపాలైనట్లు ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. భారీ ఆస్తి నష్టం సంభవించిందని, ఈశాన్య సుమీ ప్రాంతంలో కీలకమైన మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని తెలిపారు. యుద్ధ సమయంలో తమకు అండగా ఉంటూ, ఆయుధాలను సరఫరా చేస్తున్న మిత్ర దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు. రష్యాతో జరుగుతున్న యుద్ధాన్ని ఎదుర్కోవడానికి ఉక్రెయిన్‌కు ఆస్ట్రేలియా ఆయుధ సహాయం చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం కీవ్‌కు ఎం1ఎ1 అబ్రమ్స్ ట్యాంకులను అందజేసింది. ఇతర సామగ్రిని రాబోయే నెలల్లో పంపనున్నట్లు ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ పేర్కొన్నారు.మాస్కో, కీవ్‌పై చేస్తున్నచట్ట విరుద్ధమైన, అనైతిక దండయాత్రకు వ్యతిరేకంగా తాము ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

# ఒక వధువు ఇద్దరు భర్తలు..

## హిమాచల్‌లో కొనసాగుతున్న పురాతన ఆచారం

**సిమ్లా,జూలై 19:** పురాతనకాలం నాటి ఆచారానికి హిమాచల్ ప్రదేశ్‌లోని ఓ గ్రామం వేదికగా మారింది. హట్టి తెగకు చెందిన ఇద్దరు అన్నాదమ్ముళ్లు ఒకే అమ్మాయిని పెళ్లి చేసుకున్నారు. ఈ ఘటన ఆ రాష్ట్రంలోని సిర్‌మోర్ జిల్లాలో జరిగింది. షిల్లాయి గ్రామానికి చెందిన ప్రదీప్ నేగి, కపిల్ నేగి అనే అన్నదమ్ములు సమీపంలోని కున్హాత్ గ్రామానికి చెందిన సునీతా చౌహాన్ అనే అమ్మాయిని మ్యారేజ్ చేసుకున్నారు. ఆ ముగ్గురూ హట్టి తెగకు చెందినవారే. ఆ తెగలో ఇన్నాళ్ల వరకు ఆ వివాహ సంప్రదాయం చాలా గోప్యంగా జరిగేది. కానీ నేగి సోదరులు మాత్రం తమ పెళ్లిని ఘనంగా చేసుకున్నారు. శతాబ్దాల క్రితం నాటి సంప్రదాయాన్ని నిలబెట్టినట్లు వాళ్లు చెప్పుకుంటున్నారు. వివాహ వేడుకను అందరి అనుమతితో శాస్త్రోక్తంగా నిర్వహించారు. బహుభార్యత్వానికి సంబంధించిన ఈ వేడుకను ఆ గ్రామంలో చాలా గ్రాండ్‌గా చేపట్టారు. హట్టి వర్గ ప్రజల్లో ఉండే ఈ సంప్రదాయాన్ని జోడీధారణ లేదా ద్రౌపది ప్రాథ అని పిలుస్తారు. ఈ సంప్రదాయంలో అన్నాదమ్ముళ్లు ఒకే భార్యను షేర్ చేసుకుంటారు. సిర్‌మోర్ జిల్లాల్లోని ఈ సంప్రదాయం ఇక్కడ ఆచారంగా మారింది. ప్రదీప్ నేగి ఆ రాష్ట్ర జలశక్తిశాఖలో పనిచేస్తున్నాడు. ఇక సోదరుడు కపిల్ విదేశాల్లో ఉద్యోగం చేస్తు న్నాడు. ఇద్దరూ దూరంగా పనిచేస్తున్నా సునీతా ను మనువాడే విషయంలో ఆ ఇద్దరూ శాస్త్రాలను అనుసరించారు. పరస్పర అంగీకారంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రదీప్ తెలిపాడు. పారదర్శకతను తానేప్పుడూ నమ్ముతానని, నేను విదేశాల్లో ఉన్నా, మ్యారేజీ వల్ల భార్యకు సపోర్టు, సెక్యూర్టీ, ప్రేమ లభిస్తుందని కపిల్ తెలిపాడు. ఈ పెళ్లి తన ఇష్టప్రకారమే జరిగిందని, నన్ను ఎవరూ వత్తిడి చేయలేదని, ఈ ఆచారం గురించి తనకు తెలుసు అని, అందరం కలిసి ప్రతిజ్ఞ చేశామని, మా బంధంపై నాకు నమ్మకం ఉందని వధువు సునీత తెలిపింది.మూడు రోజుల పాటు పెళ్లి వేడుకను వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు, బంధువులు ఆ పెళ్లికి హాజరయ్యారు. అతిథులకు స్థానిక ఆచారాల ప్రకారమే భోజనాలు పెట్టారు. పాహరి సంప్రదాయ పాటలు, నృత్యాలతో పెళ్లి వేడుకను ఎంజాయ్ చేశారు.

# వాల్‌స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు పైలట్ల సంఘం లీగల్ నోటీసులు

## తప్పడు కథనాల ప్రచారానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్




**న్యూఢిల్లీ, జూలై 19:** జూన్ 12న జరిగిన అహ్మదాబాద్ విమానం ప్రమాదంపై విదేశీ మీడియా తప్పుడు వార్తలపై ఇండియన్ పైలట్ల సంఘం (ఎఫ్ఐపి) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ది వాల్ స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు లీగల్ నోటీసులు పంపింది. తప్పుడు కథనాలు ప్రచారం చేసినందుకు రెండు సంస్థలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఇండియన్ పైలట్ల సంఘం (ఎఫ్ఐపి) అధ్యక్షుడు ఎసి రంధవా మాట్లాడుతూ తాము చట్టపరమైన చర్యలు ప్రారంభించామన్నారు. ఆయా వార్తా కథనాలపై ది వాల్ స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు నోటీసులు పంపినట్లు చెప్పారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశామన్నారు. ఆ సంస్థలకు పంపిన మెయిల్‌లో ధ్రువీకరించని సమాచారంతో ప్రమాదంపై పదే పదే తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారంటూ తమకు తెలిసిందని పైలట్ల సంఘం పేర్కొంది. ఈ ప్రమాదం ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపింది. అధికారికంగా నిర్ధారణ లేకుండా ప్రమాదానికి గల కారణాలపై ఊహాగానాలు చేస్తూ మరణించిన పైలట్లదే తప్పు అని ఏ వార్తనైనా మీడియా సంస్థలు ప్రచారం చేయకూడదని పైలట్ల సంఘం పేర్కొంది.

ఊహాజనిత సమాచారంతో వార్తలు ప్రచురించడం బాధ్యతారహితమైన చర్య అని, మరణించిన పైలట్ల ప్రతిష్టకు తీవ్రమైన, కోలుకోలేని నష్టాన్ని కలిగించిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. మృతి చెందిన పైలట్లతో పాటు ప్రయాణికుల కుటుంబాలు తీవ్రంగా ఆవేదనకు గురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 17న ప్రచురించిన వార్తపై వెంటనే సమీక్షించి సవరించాలని రాయిటర్స్‌కు సూచించింది. 'పైలట్లదే కారణం' అన్న ఏ విషయాన్ని అయినా తొలగిస్తూ వివరణ ఇవ్వాలని పైలట్ల సంఘం రాయిటర్స్‌కు సూచించింది. ఈ విషయంలో స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నోటీసుల్లో హెచ్చరించింది. ఎన్‌టిఎస్‌బి బోర్డు ప్రకటనపై పైలట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంధవా హర్షం వ్యక్తంచేశారు. యుఎస్ ఫెడరల్ ఏజెన్సీ అయిన నేషనల్ ట్రాన్స్ పోర్టేషన్ సేఫ్టీ బోర్డు (ఎన్‌టిఎస్‌బి) ఇటీవలి విమాన ప్రమాదం మీడియా కవరేజీని తీవ్రంగా తప్పుపట్టింది. ఎయిర్ ఇండియా 171 కూలడంపై వచ్చిన వార్తలన్నీ ఊహాజనితమైనవని ఎన్ఎస్‌బిటి చైర్ జెన్నిఫర్ హోమెండి పేర్కొ న్నారు. భారత దేశ ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదికను విడుదల చేసింది.

# అవినీతిలో మాజీ మంత్రి రోజా ఫ్యామిలీ రికార్డు

## - త్వరలో రోజా, తమ్ముడు, భర్త, వైసిపి నేతల అవినీతిని బయటపెడతాం

## - నగరి నియోజక వర్గ టిడిపి నేతల సంచలన వ్యాఖ్యలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుత్తూరు జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, నేతలు భాస్కర్‌రెడ్డి, తదితరులు

**తిరుపతి హెల్త్, జూలై 19 ప్రభాతవార్త :** మచ్చలేని నాయకుడు మా నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అని, అలాంటి ఎమ్మెల్యేలో మాజీ మంత్రి ఆర్.కె రోజా అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని నగరి నియోజక వర్గ టీడీపీ నేతలు, వడమాలపేట జెడ్పీటీసీ మురళీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఏలుమలై రోజాపై మండిప డారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అవినీ తిలో మాజీ మంత్రి ఆర్‌కె. రోజా ఫ్యామిలీ ఫస్ట్ అన్నారు. దాదాపు రూ. 2వేల కోట్లుకు రోజా అవి నీతికి పాల్పడిం దన్నారు. ఒకప్పుడు కారుకు డీజల్ లేని పరిస్థితి అని ఆరోపించారు. ఇసుక మాఫి యా, ప్రభుత్వ భూముల కబ్జా, గ్రావెల్, టీటీడీ దర్శనాల్లో ఆర్.కె రోజా పెద్ద ఎత్తున అవినీతి చేసిందని వారు ఆరోపించారు. అలాంటి అవినీతి రోజాను గత ఎన్నికల్లో 45 వేల ఓట్ల పై చిలుకతో ఓడించి గాలి భాను ప్రకాష్‌ను గెలిపించుకున్నామన్నారు. ఒక పుత్తూరు మున్సిపాలిటీలోనే టీడీపీ 16 వేల ఓట్లు వచ్చిన విషయాన్ని రోజా గుర్తు చేసుకోవాలన్నారు. అసలు ఏ స్థాయిలో రోజా అవినీతికి పాల్పడినదో అర్థం చేసుకోవచ్చు నన్నారు. మచ్చలేని నాయకుడు గాలి భాను ప్రకాష్ అని, మా ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోప ణలు చేస్తే ఊరుకోం అని వారు హెచ్చరించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఐదు మండలాలకు చెందిన నేతలను గుంటకు గుక్కెడు నీళ్ళు తాగించి మమ్మల్ని అనిచి వేయడం జరిగిం దన్నారు. రోజా హయంలో నగరి నియోజక అభివృద్ధిని గురించి నియోజక వర్గ ప్రజలకు చెప్పాలని, ప్రస్తుత మా ఎమ్మెల్యే భాను ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని గురించి మేము వివరిస్తామన్నారు. రోజా ఎమ్మెల్యే భానుపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని, లేనిచో ఫ్యామిలీ అవినీతిని త్వరలో బయటపెడతామన్నారు.

## సత్యదేవుని ఉపాలయం కనకదుర్గమ్మ ఆలయంలో నెయ్యి చోరీ ఉప ప్రధాన అర్చకుడు, పరిచారకుడు సస్పెన్షన్

**కాకినాడ జూలై 19,(ప్రభాత వార్త):** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఉపాలయమైన కొండ దిగువ మెట్ల మార్గం వద్ద గల కనకదుర్గమ్మ ఆలయంలో హోమాలు, నిత్య ధూప, ధీప నైవేద్యాలకు వినియోగించే నెయ్యిని ఆలయ పరిచారకుని సాయంతో అర్చకుడు చోరీ చేస్తూ పట్టుపట్టాడు.తదుపరి సస్పెన్సన్ కు గురయ్యారు. కనకదుర్గమ్మ ఆలయంలో ఉప ప్రధాన అర్చకునిగా చిట్టెం విఎస్ఎస్ హరగోపాల్ విధులు నిర్వహిస్తున్నాడు. పరిచారకునిగా ఎన్ ఎస్ సుబ్రహ్మణ్యం కృష్ణ కుమార్ అక్కడే పని చేస్తున్నాడు. ఆలయంలో పూజలకు గాను కొండపై గల స్టోర్ నుండి 15 కేజీలు గల ఆవు నెయ్యి డబ్బాలు కనకదుర్గమ్మ ఆలయానికి వచ్చాయి. అందులో మూడు నెయ్యి డబ్బాలు అర్చకులు హర గోపాల్ సొంత కారులో తరలిస్తుండగా ఆ సమాచారం ఇఒ వీర్ల సుబ్బారావు కు చేరింది. ఇఒ ఆదేశాలతో హుటాహుటిన ఆలయ ఎఈవో పెండ్యాల భాస్కర్ అక్కడకు చేరుకుని సీసీ కెమేరాలను క్షుణ్ణంగా పరిశీలించిన పిదప వాస్తవమేనని నిర్ధారించుకున్న తరువాత ఈ నేరానికి పాల్పడిన చిట్టెం హర గోపాల్ తో పాటు అతనికి సహకరించిన పరిచారకుడు కృష్ణ కుమార్ ను సస్పెండ్ చేస్తూ ఇఒ ఆదేశాలు జారీ చేసారు.దీంతో అన్నవరం దేవస్థానం ఈవో అందుబాటులో ఉండకుండా ఉద్యోగం నిర్వహిస్తూండడం వల్లనే ఆలయంలో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్టర్ లు, అర్చకులు వారి ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఆలయం ఆదాయానికి గండివేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ దోపిడీ లో స్థానిక ప్రజాప్రతినిధుల చేతివాటం ఉందని అందుచేతన ఆరోపణల్లో ఇరుక్కున్న వారిని తప్పించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆలయంలో పనిచేసే సిబ్బంది బాహటంగా చెబుతున్నారు.ఇప్పటికైనా అన్నవరం దేవస్థానంలో జరిగిన అవినీతి,ఉప ఆలయంలో జరిగిన నెయ్యి చోరి సంఘటనలతో పాటు ఆలయం పరిధిలోని ఉప ఆలయాలు వాటి అభివృద్ధి నిధులు వినియోగం తదితర వాటిపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.ఈవో అందుబాటులో లేకపోవడంపైన సమగ్ర దర్యాప్తు జరపాలని వారు కోరుతున్నారు.

## దుర్గమ్మ ఆలయంలో ఆగస్టు 8 నుండి పవిత్రోత్సవాలు

**ఇంద్రకీలాద్రి, జూలై 19, ప్రభాతవార్త**

దుర్గమ్మవారి ఆలయంలో ఆగస్టు 8 నుండి 10వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. 10వ తేదీ ఉదయం 10.30 లకు పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు.



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

- ఆగస్టు 8న వరలక్ష్మి వ్రతాలు:

దుర్గమ్మవారి ఆలయంలోఆగస్టు 8న వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

- ఆగస్టు 22న సామూహిక వరలక్ష్మి వ్రతాలు:

దుర్గమ్మవారి ఆలయంలో ఆగస్టు 23న సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తామని ఇఒ తెలిపారు. ఈ సామూహిక వ్రతాలు ఉదయం ఉదయం 7 నుండి 9గంటల వరకు ఆర్జిత సేవగా నిర్వహిస్తామన్నారు. ఆర్జిత సేవలో పాల్గొనదలచిన వారు ఉదయం 7 గంటలకు రు.1500 లు (ఒక్కరికి మాత్రమే) చెల్లించి పాల్గొంటే వారికి వ్రతం అనంతరం రు.300 క్యూలైన్లో దర్శనం, కుంకుమ, రవికముక్క, పెద్దలడ్డు, పూర్ణములు 2, గాజులు 6, శక్తికంకణము అందిస్తామన్నారు. ఇక ఉదయం 10 గంటల నుండి 11.30 వరకు ఉచిత సేవగా నిర్వహిస్తామన్నారు. ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న వారికి వ్రతం అనంతరం రు.100 క్యూలైన్లో దర్శనం ఏర్పాటు చేస్తామన్నారు. వారికి కుంకుమ, రవికముక్క, 2 పూర్ణములు, పులిహోర 1, గాజులు 6, శక్తికంకణము అందిస్తామన్నారు. పాల్గొనదలచిన వారు 18-8-2025న ఆఫీసులో దరఖాస్తులు తీసుకోవాలన్నారు.

- వేడుకగా ఆషాడం సారె:

దుర్గమ్మవారికి శనివారం నాడు పలువురు భక్తబృందాలు వేడుకగా ఆషాడం సారెను సమర్పించారు.

- నేడు క్యూలైన్లన్నీ ఉచితం:

గత రెండు ఆదివారాలలో దుర్గమ్మను దర్శించుకోడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నందున ఈ ఆదివారం నాడు దుర్గమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు క్యూలైన్లలన్నీ ఉచిత దర్శనాలు చేసుకోవాలని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఉదయం 10 నుండి సాయంత్రం 3గంటల వరకు అన్ని క్యూలైన్లు ఉచితమేనన్నారు. ఈ సందర్భంగా భక్తుల రద్దీకి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలను ఇఒ అధికారులు, సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

**నెల్లూరు ( పెంచలకోన రాపూరు),జూలై 19ప్రభాతవార్త**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ,చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చిఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

## ప్రజారోగ్య సిబ్బందిని సన్మానించిన సిఎం చంద్రబాబునాయుడు

**విజయవాడ కార్పొరేషన్,జులై 19,ప్రభాతవార్త**

ప్రతి 3వ శనివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో సిఎం చంద్రబాబునాయుడు ఎపిలో 2024 స్వచ్ఛ సర్వేక్షన్‌లో అవార్డులు గెలుపొందిన నగరాలకు,అందులో ఒకటైన విజయవాడకు సిఎం చంద్రబాబునాయుడు అవార్డు ఇచ్చి ప్రజారోగ్య సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నందు శానిటనీ సూపర్‌వైజర్ డి.సోమరాజు,శానిటరీ మేస్త్రి జె.రమేష్,పిహెచ్ వర్కర్స్ అయిన వై చాణిక్యకు పురస్కారం అందించి అభినందించారు.



## పని ఒత్తిడి తాళలేక బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య!

**పుణె, జూలై 19:** విధినిర్వహణలో పని ఒత్తిడిని అధిగమించలేకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయిన బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య చేసుకు న్నాడు. పూణె జిల్లాలోని బారామతి బ్రాంచ్ బ్యాంక్ ఆఫ్ బరోడాలో 52 యేళ్ల శివశంకర్ మిత్రా పనిచేస్తున్నాడు. నెలరోజులక్రితమే రాజీనామా చేసిన మిత్రా ఇపుడు నోటీస్ కాలంలో ఉన్నాడు. 90 రోజులముందే ఆతడు బ్యాంకు ఉన్నతాధికారులకు నోటీసు పంపించాడు. ఆమోదం పొందేంతవరకూ విధులకు హాజరవుతున్నట్లు తేలింది. ఈనెల 17వ తేదీ రాత్రి మేనేజర్‌మిత్రా ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమా నిస్తున్నారు. కేవలం పనిఒత్తిడివల్లనే ఆత్మహత్యచేసుకున్నట్లు భావిస్తున్నారు. అంతేకాకుండా ఆతడి వద్దనుంచి ఒక స్యూసైడ్‌నోట్ కూడా స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు గంటలుముగిసాక అందరినీ వెళ్లిపోవాలని మిత్రా ఆదేశించి ఆ తర్వాత బ్రాంచ్‌ను మూసివేయించాడు. సెక్యూరిటీ గార్డుకూడా రాత్రి 9.30గంటలప్రాంతంలో వెళ్లిపోయాడు. అంతకుముందే మిత్రా తన సహోద్యోగి ఒకరిని తాడు తీసుకురావాలని కోరాడని, ఆ తాడుసాయంతోనే ఆతడు ఉరివేసుకున్నట్లు భావిస్తున్నారు. బ్యాంకుశాఖ సీలింగ్‌కు రాత్రి పదిగంటలసమయంలో ఉరివేసుకుని ఉన్నట్లు తేలింది. బ్యాంకు సిసిటివి ఫుటేజిలో స్పష్టంగా కనిపించింది.ఎన్నిసార్లు ఫోన్లుచేసినా స్పందన లేకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదుచేసింది. అంతేకాకుండా ఆమె స్వయంగా బ్యాంకు నరబాంచ్‌వద్దకువెళ్లింది. లైట్లు ఇంకా వెలుగుతూనే ఉండటం, లోపలినుంచి ఎలాంటిస ్పందన లేకపోవడంతో ఇతర సిబ్బందిని అప్రమత్తంచేసారు.

తలుపులు తెరిచిన తర్వాత తన భర్త మిత్రా జీవచ్ఛవంగా వేలాడుతున్న స్థితిని గమనించి ఆమె ఒక్కసారిగా రోదిస్తూ కూలబడి పోయింది. బారామతి సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విలాస్ నాలే మాట్లాడుతూ ఆయన రాజీనామా లేఖ, ఆత్మహత్య లేఖలను స్వాధీనంచేసుకున్నామని, ఇందులో ఎలాంటి నాటకం లేదని అనుకోని, అనుచిత ఒత్తిడి ఏదైనా ఉందే మోనన్న కోణంలోను, నోటీస్‌పీరియడ్‌లో వచ్చిన వొత్తిడులపైనా విచారణ చేస్తామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించారు.

## రాష్ట్రంలో తారాస్థాయికి కక్షసాధింపు రాజకీయాలు

### - ఎంపి మిథున్‌రెడ్డి అరెస్ట్‌పై అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, జూలై 19 (ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్షసాధింపు రాజకీయాలు తారాస్థాయికి చేరాయని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. మద్యం అక్రమ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడంపై ఆయన స్పందించారు. ఉద్యోగులను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి స్టేట్‌మెంట్లు తీసుకుని అక్రమ కేసులో మిథున్‌రెడ్డిని ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు రాజకీయ జీవితం అంతా కుట్రలతో సాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుండడంతోనే వైసీపీలోని కీలక నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు.



పెద్దవరం గ్రామంలో జరిగిన స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

## ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములవుదాం

### - ప్రతి గ్రామాన్నీ స్వచ్ఛ గ్రామం, స్వర్ణగ్రామంగా తీర్చిదిద్దుదాం..

### - ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు డా.లక్ష్మీశ

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు.తద్వారా మన ఆరోగ్యాన్ని, పర్యావరణాన్నీ, ఆర్థిక ఆరోగ్యాన్నీ కాపాడుకుందామన్నారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం, పెద్దవరం గ్రామంలో జరిగిన స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి నెలా మూడో శనివారం ప్రత్యేక థీమ్‌తో స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది జనవరిలో న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్‌తో కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఈ నెల ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం ఇతివృత్తంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగం దిశగా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఈ కార్యక్రమాలను ఊరూవాడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం లేచింది మొదలు, పడుకునే వరకు రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ భాగమై పోయిందని.. ఇది ఇలానే కొనసాగితే పర్యావరణానికీ, మన ఆరోగ్యానికీ పెను ముప్పు తప్పదని, భావితరాల మనుగడ ప్రమాదంలో పడుతుందన్నారు. ప్లాస్టిక్ వస్తువులను విచ్చలవిడిగా వాడి బయటపడేస్తే.. అవి డ్రెయిన్లలోకి చేరుతాయని, దాంతో కాలువలు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తుందన్నారు. దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలబారినపడే ప్రమాదముందన్నారు. అదేవిధంగా భూమిలోకి చేరిన ప్లాస్టిక్‌లు మైక్రో ప్లాస్టిక్స్‌గా మారి మనల్ని మెల్లమెల్లగా కబళించేస్తాయన్నారు. ఈ నేపథ్యంలో తొలి అడుగుగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉందామని, క్లాత్ బ్యాగ్స్, జ్యూట్ బ్యాగ్స్, పేపర్ ప్యాకింగ్ వంటివాటికి చేరువవుదామని కలెక్టర్ పేర్కొన్నారు. గౌరవ ప్రధాని, గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు ప్రతిరూపాలైన వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి సమష్టిగా కృషిచేద్దామని.. మనసుంటే మార్గం ఉంటుందని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందమున్న పాలిథీన్ కవర్లు వినియోగించినా, ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్ వస్తువులు వినియోగించినా చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపర చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ వస్తువులు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తదితరాలతో ఏర్పాటుచేసిన స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. తడి చెత్త పొడిచెత్తను సక్రమంగా, క్రమశిక్షణతో, నిబద్ధతతో వేరుచేసి ఇస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న 12 మందికి మొక్కలు, సర్టిఫికెట్లు, జ్యూట్ బ్యాగులు అందించారు.

## నేటి నుంచి అజ్మీర్ మీదుగా కాచిగూడ-భగత్‌కీ కోఠి మధ్య కొత్త రైలు

### - రాయలసీమ వాసులకు అందుబాటులో రైలు వేళలు

**గుంతకల్లు రైల్వే, జూలై 19,ప్రభాతవార్త** రాయలసీమలోని అనంతపురం, కర్నూలు జిల్లాల ప్రజలకు అందుబాటు వేళల్లో ముస్లింల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అజ్మీర్ మీదుగా నేటి(ఈనెల 20)నుంచి దక్షిణ మధ్య రైల్వే కాచిగూడ-భగత్‌కీ కోఠి మధ్య కొత్తగా డైలీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను ప్రవేశపెడుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. కాచిగూడ నుంచి భగత్‌కీ కోఠి వెళ్లే నెంబర్ 17605డైలీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20వ తేదీన ఆదివారం రాత్రి 11.50గంటలకు కాచిగూడలో బయలుదేరి, నిజామాబాద్‌కు(రెండోరోజు) తెల్లవారుజామున 3.15/17,నాందేడ్ ఉదయం 6.55/7.00పూర్ణా 7.45/8.05,హింగోళీ 9.29/30,వాశీమ్ 10.54/55,అకోల12.50/55,మలక్‌పూర్ మధ్యాహ్నం 2.10/12,ఖండ్వా సాయంత్రం 6.02/05,ఇటార్సీ రాత్రి 8.55/9.05,నర్మదాపురం (హోసంగాబాద్) 9.22/24,రాణీకమలాపతి(హబీబ్‌గంజ్) అర్ధరాత్రి 12.25/30,సంత్ హర్ధరంనగర్ (బైరా ఘర్) 1.15/20,సెహోర్ 1.41/43,మక్సీ 3.22/24,ఉజ్జయిని తెల్లవారుజామున 4.10/15,రత్లాం(మూడోరోజు) ఉదయం 7.05/15,జౌరా 7.45/47,మన్‌డ్‌సోర్ 8.24/26,నిమచ్ 9.14/16,ఛిత్తౌర్‌ఘర్ 10.40/45,భిల్వారా 11.45/50,విజయనగర్ 12.33/35,నసీరాబాద్ మధ్యాహ్నం 1.02/04,అజ్మీర్ మధ్యాహ్నం 2.10/45,పాలీ మర్వార్ 6.25/30,భగత్‌కీ కోంకి రాత్రి 8గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో భగత్‌కీకోఠి నుంచి కాచిగూడకు వెళ్లే నెంబర్ 17606డైలీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22న మంగళవారం నుంచి రాత్రి 10.30గంటలకు బయలుదేరి,పాలీ మార్వార్ 11.30/35,మర్వార్ అర్ధరాత్రి 12.12/45,సోజత్ రోడ్ 1.04/06,బేవార్ 1.56/58,అజ్మీర్ తెల్లవారుజామున 3.05/40, నసీరాబాద్ 4.18/20,విజయ్‌నగర్ 4.48/50,భిల్వారా 5.55/6.00,ఛిత్తౌర్ ఘర్(రెండోరోజు) ఉదయం 7.20/25,నిమచ్ 8.08/10,మన్‌డ్‌సోర్ 8.54/56,జౌరా 9.48/50,రత్లాం 10.40/50,ఉజ్జయిని మధ్యాహ్నం 1.00/05,మక్సీ 1.50/52,సెహోర్ 3.19/20,సంత్ హర్ధరం నగర్ (బైరా ఘర్) సాయంత్రం 4.30/35,రాణీకమలాపతి(హబీబ్‌గంజ్) 5.10/15,నర్మదాపురం(హోసంగబాద్) 7.08/10,ఇటార్సీ 7.40/50,ఖండ్వా రాత్రి 10.42/45,మలక్‌పూర్ అర్ధరాత్రి 12.58/1.00,అకోల 2.45/50,వాశీమ్ 3.54/55,హింగోళీ 4.54/55,పూర్ణా(మూడోరోజు)ఉదయం 6.40/7.00,నాందేడ్ 7.45/50,నిజామాబాద్ 11.25/27,కాచిగూడకు మధ్యాహ్నం 3.40గంటలకు చేరుకుంటుంది.



## నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నివేదికను, కలెక్టర్‌కు సమర్పించిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

**నెల్లూరు కలెక్టరేట్, జూలై 19, ప్రభాతవార్త** శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జిల్లా కలెక్టర్‌తో భేటీ అయ్యారు. ఈ భేటిలో విద్య, వైద్యంతో పాటు జాఫర్ సాహెబ్ కెనాల్ వద్ద ఫుడ్ కోర్ట్స్‌పై ఎన్జిటి ఇచ్చిన నివేదికను జిల్లా కలెక్టర్ సమర్పించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నివేదిక ప్రకారమే కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. 200 ఫుడ్ కోర్ట్స్ ఒకే దగ్గర పెడితే ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని జాఫర్ సాహెబ్ కెనాల్ మొత్తం వ్యర్థాలతో కూడుకు పోతుందని దానివల్ల అక్కడ ఉన్న ప్రజలు అనారోగ్యం పాలవుతారని ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. చంద్రశేఖర్ రెడ్డి వెంట వైఎస్ఆర్సిపి కార్పొరేటర్ నాగార్జున వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగష్టు 1,2 వ తేదీలలో భారీగా జాబ్ మేళా

### - దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**నెల్లూరు ( చేజర్ల ) జులై 19 ప్రభాతవార్త** ఆత్మకూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఆగష్టు 1,2 తేదిలలో భారీ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కున్నారు.ఈ సందర్భంగా మండలంలోని పెరమళ్ళపాడు వ్యవసాయ క్షేత్రంలో శనివారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నియోజకర్గంలో 87.26 గృహాలను సందర్శించామని తెలిపారు. నియోజకవర్గంలో 86696 కుటుంబాలు ఉండగా 75619 కుటుంబాలను కలవడం జరిగిందని అన్నారు.ఈనెలాఖరుకు వందశాతం గృహాలను సందర్శించి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ ఫలాలను వివరించుచున్నామని తెలిపారు. ఈ ఏడాదిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని



తెలిపారు. ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పెంచి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అలాగే మహిళలకు ఏడాదికి 3 సిలిండర్లను ఫ్రీగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి నగదు ఇవ్వడం జరిగిందని అన్నారు. రైతులకు ఇబ్బంది కరంగా ఉన్న ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయడం జరిగిందని అన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ అమలు చేస్తామని అలాగే ఆగష్టు 15న మహిళలకు ఆర్టీసిలో ఉచితంగా ప్రయాణం చేయన్నుట్లు తెలిపారు.మెట్ట ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఆగష్టు 1,2 తేదిలలో భారీగా జాబ్ మేళ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ సహకారంతో జాబ్ మేళాకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.జాబ్ మేళాలలో అన్ని రకాల అర్హత కలిగిన యువత యువకులు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని ఉద్యోగాలు పొందాలని కోరారు. సుమారు 60కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గోని వారికి అవసరమైన ప్రతిభ గల యువతి యువకులకు ఉద్యోగులుగా నియమ ఇంచుకునేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఆత్మకూరులో ప్రభుత్వ ఐటిఐ, పాలిటిక్నెకు ,ప్రవేటు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసించి ఖాళీగా ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధీ కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని అన్నారు.

సాఫ్ట్ వేర్ ఉద్యోగులు కూడా జాబ్ మేళాలో పాల్గొంటున్నారని సుమారు 3 వందలపైగా సాఫ్ట్ వేరు ఉద్యోగాలు కల్పించేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. జాబ్ మేళా పై ఆత్మకూరు ఆర్‌డిఒ పావనీ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలోని ప్రజా ప్రతినిదులు,అధికారులు, ఈ జాబ్ మేళా పట్ల ముమ్మర ప్రచారం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జి. సతీష్‌రెడ్డి,జిల్లా మంత్రి పొంగూరు నారాయణ,ఎంపి వేమిరెడ్డి ఉన్నారు.

## మానసిక ఉల్లాసానికి హాస్యం దివ్య ఔషధం

### - ప్రపంచ రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుత పరిస్థితుల్లో హాస్య నాటికలు మరిన్ని రావాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు అన్నారు. భావ తరంగిణి ఆధ్వర్యాన స్థానిక మహతి కళావేదికలో శనివారం సాయంత్రం హాస్య లఘు నాటికల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ ఎన్నో రకాల ఒత్తిడిలకు గురవుతూ జీవితాన్ని సాగిస్తున్న నేపథ్యంలో ఇటువంటి హాస్య నాటికలు మానసిక ఆనందాన్ని ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. మానసిక ఉల్లాసానికి హాస్యం దివ్య ఔషధమని ప్రతి ఒక్కరూ జీవితంలో హాస్యాన్ని ఆస్వాదించాలని అన్నారు.ఆర్టీసీ మచిలీపట్నం డిపో మేనేజర్ టి. పెద్దిరాజు మాట్లాడుతూ మన సాహిత్యంలో హాస్యానికి ప్రత్యేక స్థానం ఉందని గతంలో వచ్చినటువంటి హాస్య నవలలు నాటికలు నాటి నుంచి నేటి వరకు నిలిచి ఉండటమే అందుకు నిదర్శనం అన్నారు.

## ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం : ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు ( విడవలూరు ), జూలై 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటింటికి తెలుగుదేశం సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు తెలియజేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న పథకాలపై శ్రీకర చుట్టినట్లు ఆమె తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. శనివారం చౌక చర్ల, దంపూరు పంచాయతీల్లో ప్రజలు ఎమ్మెల్యే రాకతో ప్రజలు పెద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస మౌలిక వసతులకు నోచుకోని గ్రామాలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే ఆ గ్రామాలను పర్యటించారు. స్థానిక టిడిపి, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి గడప గడపకు వెళ్లి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. ఇళ్ళు, ఇళ్ల స్థలాలు లేని పరిస్థితిని పరిశీలన చేయడం జరిగింది ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పేదల సొంతింటి కల సాకారం నెరవేరుస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రాగానే రైతులకు ప్రయోజనం చేకూర్చే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిన విషయాన్ని ప్రజలకు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలు చేసిన పెన్షన్ పెంపు, దీపం 2, మత్స్యకార సేవలో, తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాల గురించి ఆమె ప్రజలకు తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందిచడంతో పాటు ఆగస్ట్ 15 వ తేదీ నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించబోతున్నట్టు ఆమె వెల్లడించారు. పార్టీ ప్రతిపక్షంలో వున్నపుడు జండా మోసిన కార్యకర్తల కష్ట ఫలితంగానే ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిచానని, ఏ సమస్య వున్నా తనతో స్వయంగా చెప్పాలని ఎవరూ నిరాశ చెందవద్దని కోరారు. కోవూరు ప్రజల ఆదరాభిమానాలే తన బలమన్నారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి వాగ్దానం అమలు చేస్తానని ప్రజలకు హామీ యిచ్చారు. గత ప్రభుత్వం కొత్త రోడ్లు వేయకపోగా అక్రమంగా తవ్విన గ్రావెల్ భారీ వాహనాలలో తరలించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు ధ్వంసం చేశారన్నారు.

# వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా మోదుగుల బసవపున్నారెడ్డి



**బాపట్ల, జులై19, ప్రభాతవార్త:** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా మోదుగుల బసవపున్నారెడ్డి రెడ్డి ని వైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్నియమించారు. బాపట్ల నియోజకవర్గంలో మొట్ట మొదటిసారిగా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసిన సీనియర్ నాయకులు పార్టీ అవిర్భావం నుండి పార్టీ పురోభివృద్ధి కోసం పనిచేసి నియోజకవర్గంలోపార్టీ గెలుపుకు విశేష కృషి చేసిన వ్యక్తి మోదుగుల, పిట్టలవానిపాలెం మాజీ ఎంపిపి మోదుగుల బసవన్న రెడ్డి ని మాజీ ముఖ్యమంత్రివర్యులు, పార్టీ అధినేత శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ నియామకంపై బాపట్ల నియోజకవర్గంలోని మోదుగుల అభిమానులందరూ ఆనందం వ్యక్తం చేశారు.

# ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్ల కూడదు : పట్టణ ఎస్ఐ చెన్నకేశవులు

**చిలకలూరిపేటటౌన్, జులై 19, ప్రభాతవార్త:** ఆటోలలో పరిమితికి మించి ప్రయాణీకులను తీసుకెళ్లడం, ఆటో వెనుకవైపు డోర్లు తెరిచి, మరియు డ్రైవర్కి ఇరువైపులా ప్రయాణీకులను కూర్చోబెట్టుకొని ప్రయాణం చేయడం వంటివి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని పట్టణ ఎస్ఐ డి చెన్నకేశవులు అన్నారు. శనివారం జిల్లా రవాణాశాఖాధికారి జి సంజీవ్కుమార్ ఉత్తర్వుల మేరకు రవాణాశాఖ అధికారి కార్యాలయంలో స్థానిక ఆటో రిక్షా డ్రైవర్లకు రోడ్డు భద్రతపై స్థానిక మోటారు వాహనములు తనిఖీ అధికారి ఎన్ గోపాల్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న పట్టణ ఎస్ఐ చెన్నకేశవులు మాట్లాడుతూ ఆటోలలో ఎక్కువ శబ్దంతో కూడిన టేప్ రికార్డర్స్ను వాడి శబ్ద కాలుష్యం చేయకూడదని,



మద్యం సేవించి వాహనం నడపటం, ప్రయాణీకులతో అసభ్యంగా ప్రవర్తించడం, వంటివి చేయకూడదని తెలిపారు. ప్రయాణీకులతో మర్యాదగా ప్రవర్తించాలని, తనిఖీ అధికారులు అడిగినప్పుడు వాహనమును సంబందించి అన్ని పత్రాలు చూపించాలని తెలిపారు. నిబంధలన్నీ తప్పనిసరిగా పాటించి రోడ్డు ప్రమాదాలు జరుగకుండాభాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆటోరిక్షా డ్రైవర్లు, యంవిఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజాన్ని వినాశనం నుండి చైతన్యం వైపు మేల్కోలపాలి

## - లోక్సత్తా నాయకుడు మాదాసు భానుప్రసాద్

**చిలకలూరిపేట, జులై19, ప్రభాతవార్త:** ప్రపంచ దేశాలన్ని అభివృద్ధితో పోటీపడుతుంటే ఒక్క భారతదేశం మాత్రమే వివిధ అంశాలపై అవగాహన రాహిత్యంతో రోజురోజుకి సమస్యల వలయంలోకి నెట్టబడుతుందని లోక్సత్తా రాష్ట్ర నాయకుడు మాదాసు భానుప్రసాద్ అన్నారు. శనివారం ఈ మేరకు వివిధ అంశాలతో కూడిన వినతిపత్రాన్ని నాయకులతో కలసి తహసిల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్కు అందచేశారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో వివిధ కార్యక్రమాల పేరిట ఉన్న కొద్దిపాటి రోడ్లను కూడా ఆయా కార్యక్రమాలు నిర్వహించుకునే నిమిత్తం బ్లాక్ చేస్తున్నారని, రాకపోకలు అపివేస్తే వాహనదారులు కానీ, అవతలి వైపుకు వెళ్లే వారు కానీ ఎంత బాధపడతారు అన్న కనీస విచక్షణ లేకుండా రోడ్లకు అడ్డం కట్టేసి విచిత్రం చూస్తున్నారని, కనీసం అత్యవసర పరిస్థితులలో అంబులెన్స్, ఉద్యోగస్తులు, కూలీలు, రోజువారి పనులు చేసుకునే వారి వ్యధ ఆలోచించటంలేదని వాపోయారు. సామాజిక స్పృహ లేని వారు చేసే ఇటువంటి పనులను ప్రభుత్వాధికారులు చూస్తూ ఊరుకోవడం సరికాదన్నారు. అదేవిధంగా ఫంక్షన్లలో, రోడ్లమీద ఊరేగింపుల పేరిట డిజె సౌండ్ సిస్టం ఎక్కువ డెసిబుల్స్లో పెట్టి అనేక మంది గుండెపోటుతో చనిపోవడానికి కారణమవుతున్నారన్నారు. ప్రజా ధనంతో ప్రభుత్వం సిసి కెమేరాలు ఏర్పాటుచేస్తే వాటిపై ఫ్లెక్సీలు వేయడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో లోక్సత్తా నాయకులు డాక్టర్ కృష్ణప్రసాద్, మురకొండ వెంకట్రావు, అందెల శౌరి, డాక్టర్ విన్సెంట్పాల్, తన్నీరు వీరయ్య, రమేష్, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాధికార సాధనకై దళితులందరూ ఐక్యతతో ఉద్యమించాలి


## -స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏసుబాబు మాదిగ

**గుంటూరు విద్య, జులై 19, ప్రభాతవార్త :** దళితుల అభివృద్ధి అభ్యున్నతి మరియు అన్ని సమస్యలకు రాజ్యాధికా సాధనే ఏకైక పరిష్కార మార్గామని రాజ్యాధికార సాధనకై దళితులందరూ ఉద్యమించాలని స వ్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏసుబాబు మాదిగ పిలుపు నిచ్చారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఏసుబాబు ఆధ్వర్యంలోఎ కారంచేడు మృతవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారంచేడు ఘటన సమాజానికి మాయని మచ్చఅని అన్నారు. కారంచేడు సంఘటన జరిగి నేటికి 40సంవత్సరాలు అయినా కూడా ఇప్పటికి సమాజంలో దళితులపై వివక్షత కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. కారంచేడు గ్రామంలో ఒక మంచి నీటి చెరువువద్ద జరిగిన సంఘటనలో అగ్రవర్ణాలు మాదిగ పల్లెపై మారణాయుధాలతో దాడిచేసి 6గురిని చంపిన ఘటన భారతదేశ సామాజిక చరిత్రలో ఒక బ్లాక్ డేగా ఆనాడు నిలిచిందని ఈ సంఘటన దళతుల ఆత్మగౌరవ పోరాటలకు ఉద్యమాలకు మార్గదర్శమైందన్నార.

# 5వ వార్డులో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ

**తాడేపల్లి, జులై 19, ప్రభాతవార్త :** పట్టణంలోని 5వ వార్డు అంజిరెడ్డికాలనీలో "బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి విచ్చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాటాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి సంవత్సర కాలం గడిచినా వాటిని అమలు చేయకుండా ప్రజలను ఎలా మోసం చేస్తున్నారు, ఎన్నికలకు ముందు అధికారం కోసం దొంగ హామీలు ఇచ్చి ఇప్పుడు ఆహామీలు అడిగే వారిమీద ఎలా కక్షపూరిత రాజకీయాలు చేసి కేసులు పెడుతున్నారు, బాబు చెప్పిన సూపర్ సిక్స్ హామీల ద్వారా ప్రజలకు రావలసిన సంక్షేమాలు ఈ సంవత్సర కాలంలో ఎంత మోసపోయారు అన్నది వివరించారు. అలాగే పార్టీ బలోపేతం కోసం వార్డు కమిటీలు వేసి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైసీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, పట్టణ ఉపాధ్యక్షులు జిలగా పెదగాలయ్య, వేల్పుల ఎలీషా, ప్రధానకార్యదర్శులు చిన్నపోతుల దుర్గారావు, చిట్టిమల్ల స్నేహ సంధ్య, పట్టణ కార్యవర్గ సభ్యుడు తాళ్లూరి ప్రభాత్కుమార్ (అమృత రావు), పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ, పార్టీ సీనియర్ నాయకులు పెరికే అంకయ్య(బాబు), మొద్దు మహేష్బాబు (మార్క్), డేవిడ్ (లైటింగ్ అండ్ సౌండ్స్), కటికల ఉష మరియు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# అనాథ ఆశ్రమంలో అన్నదానం



**రాజుపాలెం, జూలై 19 ప్రభాతవార్త :** మండలంలోని కొండమోడు వద్ద గల వీరమ్మకాలనీలో ఉన్న దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కోనేటి నరసింహారావు - ప్రసన్నల పెళ్ళి రోజు సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. కేక్ కట్చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గరికపాటి శంకరరావు, రామ్సాయి తదితరులు పాల్గొన్నారు.

# రాజుపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు



**రాజుపాలెం, జూలై 19 ప్రభాతవార్త :** సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మండల కేంద్రమైన రాజుపాలెంలో నిర్వహించారు. సీనియర్ నాయకులు పగడాల శ్రీనివాసరావు కార్యక్రమానికి నాయకత్వం వహించారు. గ్రామాలలో ఇంటింటికి వెళ్ళి పథకాల గురించి తెలియజేశారు. ఉచిత గ్యాస్ సిలెండర్ల నగదు ఎంత మందికి అందాయో అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా అన్నదాత సుఖీభవ డబ్బులు త్వరలోనే పతాయన్నారు. తల్లికి వందనం డబ్బులు ప్రతి ఒక్కరికీ అందాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చొక్కా శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, వీరయ్య, వెంకటేశ్వర్లు, రామారావు, వలిరాజు, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ముగిసిన శ్రీచండీ సహిత

# శ్రీ మహారుద్ర యాగం

**పొన్నూరు, జూలై 19, ప్రభాతవార్త:** శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ సహస్రలింగేశ్వరస్వామివారికి త్రయాహ్నిక పూర్వక శ్రీ చండీ



సహిత శ్రీ మహారుద్రయాగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి నిర్వహించిన యాగం శనివారం పూర్ణాహుతి, శివకళ్యాణంతో ముగిసింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో భక్తులు పాల్గొని హోమ ద్రవ్యాలను అగ్నిదేవునికి అర్పించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. అనంతరం శ్రీ శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా, కన్నుల పండువగా నిర్వహించారు. నాగలింగం చందో బసవేశ్వరశాస్త్రి యాజ్ఞీకత్వంలో పొన్నూరు షణ్ముఖ రఘు కిషోర్ శర్మ పర్యవేక్షణలో కళ్యాణోత్సవాన్ని, యాగాన్ని నిర్వహించారు. దేవాలయం కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారికి ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ చీమకుర్తి నాగభూషణరావ )(అచ్చియ్య) దంపతులు కార్యక్రమంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. చావలి రాంబాబు శర్మ, కైయితేపల్లి కిరణ్కుమార్ శర్మ, పోగుల శ్రీనివాసశర్మ తదితరులు యాగ కార్యక్రమాన్ని



నిర్వహించారు. కమిటి సభ్యులు, దేవాలయం అధికారులు, సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.

# ప్లాస్టిక్ రహిత పట్టణంగా ఉంచుదాం

**తెనాలి, మున్సిపాలిటీ జులై 19 (ప్రభాతవార్త) :** ప్లాస్టిక్ రహిత పట్టణంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ ఛైర్మన్ తాడిబోయిన రాధిక సూచించారు. శనివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత దివస్ను పురస్కరించుకుని ప్లాస్టిక్ వాడకం వలన కలుగు కాలుష్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించుటకు గాను వమాత్మాగాంధీ మున్సిపల్ కూరగాయల మార్కెట్ నుండి చిట్టి ఆంజనేయ స్వామి గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ ప్రారంభించిన ఛైర్పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని,




అంతే కాకుండా ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు కలుగుతుందని, మానవాళికి చేటు కలిగించే ప్లాస్టిక్ వాడకం నిషేదిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, కొమ్మరబత్తుని జయపాల్, కమీషనర్ వివిఎం లక్ష్మీపతి, హెల్త్ ఆఫీసర్ ఏసుబాబు, డిఇఇలు, ఏఇఇలు మరియు పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతంచేద్దాం


**రాజుపాలెం, జూలై 19 ప్రభాతవార్త :** ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతంచేద్దామని ఆయుష్ వైద్యశాల డాక్టర్ ఆర్.శ్రీనివాస్ అన్నారు.




హెచ్ఎం ఎం.శైలజా ఆధ్వర్యంలో కోటనెమలిపురి జెడ్పీ పాఠశాలలో శనివారం స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులు వాడవద్దన్నారు. వస్త్ర సంచులు, జూటు బ్యాగులను ఉపయోగించాలన్నారు. స్వరాణ్ంధ్రప్రదేశ్ సాధించడమే లక్ష్యంగా ఉండాలన్నారు. ప్రకృతిలోని గాలి, నీరు, భూమి కాలుష్యం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు సాంబయ్య, నిర్మల, ఆయుష్ సిబ్బంది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పెదకూరపాడులో సుపరిపాలనలో తొలి అడుగు


**పెదకూరపాడు, జూలై 19 ప్రభాతవార్త :** పెదకూరపాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.



160వ బూత్ పరిధిలో ఈ కార్యక్రమం జరిగింది. నాయకులు ఏటుకూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో డోర్ టూ డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బూత్ కన్వీనర్ ఎస్.కె.మున్నీ, మాజీ మండల అధ్యక్షులు బెల్లంకొండ రాంగోపాలరావు, గల్లా బాబూరావు, భాష్యం ఆంజనేయులు, మస్తాన్షరీఫ్, కరిముల్లా, ఎస్.కె.దిలీప్ తదితరులు పాల్గొని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధిని ప్రజలకు తెలియజేశారు.

# నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ జిల్లా అధ్యక్షునిగా శ్రీనివాసరెడ్డి

**నరసరావుపేట టౌన్, జూలై 19 ప్రభాతవార్త :** నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ పల్నాడు జిల్లా అధ్యక్షునిగా తుమ్మూరు శ్రీనివాసరెడ్డి



నియమితులయ్యారు. ఆయనకు నియామకపత్రాన్ని రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ శ్యామల జయకోటిరెడ్డి శనివారం అందజేశారు. ఛైర్మన్ డాక్టర్ యాసీన్ ఆదేశాల మేరకు శ్రీనివాసరెడ్డి నియామకం జరిగిందని వారు తెలియజేశారు. కమిటీ ఛైర్మన్ కోటిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పౌరహక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ మేరకు ఆయనను పలువురు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# అంగన్వాడి కేంద్రాలకు పిల్లలను ఆకట్టుకునే విధంగా టీచర్లు పనిచేయాలి : బాపట్ల జిల్లా కలెక్టర్

**బాపట్ల, జులై19, ప్రభాతవార్త:** అంగన్వాడి కేంద్రాలకు పిల్లలను ఆకట్టుకునే విధంగా టీచర్లు పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని విస్తరణ శిక్షణా కేంద్రంలో అంగన్వాడి టీచర్ల శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు.



ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా నుండి సోదన శిక్షణా బృందం గౌరవ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బాపట్లలోని అంగన్వాడీ టీచర్లకు 4 బ్యాచ్లవారీగా రెండు రోజులు పాటు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులలో అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పాఠాలను బోధించే క్రమంలో, పిల్లల యొక్క శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే విధంగా పిల్లలను పాఠశాలకు ఆకర్షితులు అయ్యే విధంగా ఆటపాటలతో పిల్లలకు ఏ విధంగా పాఠాలు చెప్పాలో ఈ విషయమై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంగన్వాడ మాట్లాడుతూ టీచర్లు కేంద్రాలకు వచ్చే పిల్లలను సొంత బిడ్డల వలె చూడాలని, వారికి మంచి విద్యాబుద్ధులు నేర్పాలని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని ఆయన టీచర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, సిడిపిఓ లక్ష్మీపార్వతి,, అంగన్వాడీ టీచర్లు, సోధన శిక్షణా బృందం తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా నేర సమీక్షా సమావేశం

## - పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, న్యాయమూర్తులు

**నరసరావుపేట క్రైం, జూలై 19 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం జిల్లా నేర సమీక్షా



సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ పి.అరుణ్బాబు, న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి, ఫోరెన్సిక్ శాస్త్రవేత్త రవికుమార్, రెవిన్యూ, ఎక్సైజ్, ఫైర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ అరుణ్బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఆరు నెలల్లో నేర గణాంకాలపై సమీక్ష, కేసుల దర్యాప్తు, ఫిర్యాదులపై మాట్లాడారు. న్యాయ, ఫోరెన్సిక్, పోలీస్ సమిష్టి కృషితో సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు న్యాయ సేవలు అందించి ప్రభుత్వంపై నమ్మకం పెంచాలన్నారు. మత్తు పదార్థాలపై నిరంతర డ్రైవ్లు ఉంటాయన్నారు. మైనర్లు వాహనాలను నడపడం, ఓవర్ లోడింగ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయమూర్తి సత్యశ్రీ మాట్లాడుతూ కేసుల పరిష్కారం వేగంగా ఉండాలన్నారు. సరైన సాక్ష్యాధారాలను కోర్టుకు అందించాలన్నారు.

**వన్టౌన్ సి.ఐ. విజయ్చరణ్కు ప్రశంసాపత్రం...**

గత ఆరు నెలల కాలంలో కేసుల దర్యాప్తులో ఉత్తమ ప్రతిభ చూపిన సి.ఐ. విజయ్చరణ్కు కలెక్టర్ పి.అరుణ్బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావులు మెమోంటోను, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. జిల్లాలో నేరాల నివారణ, ప్రజల భద్రత న్యాయ పరిరక్షణకు సి.ఐ. విజయ్చరణ్ ఎంతో కృషి చేశారని వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు.

# ప్రజలపై విద్యుత్తు భారాలు తగ్గించాలి. పొగాకు కొనుగోలు కేంద్రం పెదనందిపాడులో ఏర్పాటు చేయాలి : ప్రజా సంఘాల పిలుపు

**పెదనందిపాడు జూలై 19 (ప్రభాతవార్త :** .ప్రజల మీద విద్యుత్ చార్జీల పెంపు భారాన్ని ఉపసంహరించుకోవాలని, పెదనందిపాడు లో పొగాకు కొనుగోలు కేంద్రం వెంటనే ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన



కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాసంఘాల సమావేశం రైతు సంఘం నాయకులు కొత్త వెంకటశివరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం , కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆదేశంతో విద్యుత్ రంగ ప్రైవేటీకరణ లో భాగంగా ఆదాని కంపెనీకి స్మార్ట్ మీటర్ల బిగింపు అనుమతించిందని, స్మార్ట్ మీటర్ల బిగింపు వలన విద్యుత్ వినియోగదారులందరి మీద తీవ్రమైన భారం పడబోతుందని తెలిపారు. స్మార్ట్ మీటర్లు బిగింపుకు సింగిల్ ఫేస్ కు 9,000, త్రీఫేస్ కు 18,000 రూపాయలను వినియోగదారుల వద్ద ప్రతినెల వసూలు చేస్తారని తెలిపారు. గతంలోని వైసీపీ ప్రభుత్వం ఆదాని నుండి ముడుపులు తీసుకుని 25 సంవత్సరాల ఒప్పందంలో లక్ష కోట్ల భారాన్ని ప్రజల మీద మోపిందని తెలిపారు. మేము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్ల ను రద్దు చేస్తామని, చార్జీల భారాన్ని తగ్గిస్తామని హామీ ఇచ్చిన తెలుగుదేశం, జనసేన కూటమి ప్రస్తుతం ఆ ఒప్పందాన్ని రద్దు చేయకుండా కొనసాగించటం ప్రజలను మోసం చేయడమేనని తెలిపారు. స్మార్ట్ మీటర్ల వలన ప్రజలకు తెలియకుండానే రిమోట్ కంట్రోల్ ద్వారా పంపిణీ నియంత్రించడానికి, డిమాండ్ ను బట్టి విద్యుత్ ఛార్జీలు పెంచడానికి విద్యుత్ కంపెనీ సంస్థలకు సంపూర్ణ అవకాశాన్ని కలిగిస్తుందని తెలియజేశారు. సెల్ ఫోన్లకు చేసుకున్నట్టుగా స్మార్ట్ మీటర్లకు ముందుగా రీఛార్జి చేసుకోవాలని, కట్టిన డబ్బు అయిపోగానే ముందు హెచ్చరిక లేకుండానే కరెంటు ఆగిపోతుందని తెలియజేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను, ఆదాయాలను ఆదాని లాంటి ప్రైవేటు వారికి కట్టబెట్టి , అత్యధిక లాభాలు కార్పొరేట్లకు చెల్లించటానికి మార్గం సుగమం చేస్తుందన్నారు. ఇప్పటికే ప్రజల మీద ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో భారం మోపిందన్నారు. విద్యుత్ భారాల గురించి ఈ సమావేశంలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణం ఆపాలని, బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని, ట్రూ అప్ చార్జీలుఇందనపు సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ సుంకాన్ని తగ్గించాలని, ఆదానీ కంపెనీతో జరిగిన సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని, కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసినట్లుగా విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ప్రమాదమైన విద్యుత్ సంస్కరణ లను నిలిపివేయాలని తీర్మానాలు చేసినట్లు తెలిపారు. వీటి మీద ప్రచార, ఆందోళన కార్యక్రమాలను దశలవారీగా నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా నల్లబర్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పెదనందిపాడు లో వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసిన చోట్ల కొనుగోలు మందంగా జరుగుతుందని వేగంగా కొనాలని కోరారు. నిబంధనల పేరుతో పొగాకు వెనక్కి పంపించకుండా మొత్తం కొనాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంతో కాలం నుండి గుంటూరు ఛానల్ పొడిగింపునకు, నల్లమడ వాగు ఆధునీకరణ పనులు ప్రారంభిస్తామని, అధికార, ప్రతిపక్ష నాయకులు హామీలు ఇచ్చారని తెలిపారు. కానీ ఇంతవరకు ఆచరణలోకి రాలేదన్నారు. వెంటనే గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ వాగు ఆధునికరణ పనులు పూర్తి చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్ మొదలైందని రైతు సేవా కేంద్రాలలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, పంట రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని కోరారు. సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల అంశం మీద పెదనందిపాడు, కాకుమాను మండలాలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. దానిలో భాగంగా ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, అన్నల దాసు ఆశీర్వాదం, మహిళా సంఘం నాయకులు షేక్ షమీ, పి భువనేశ్వరి, మర్రి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనానికి కూటమి ప్రభుత్వం స్థలం కేటాయింపు పై పట్టణ ఆర్య వైశ్యుల హర్షం

**సత్తెనపల్లి టౌన్( జూలై 19ప్రభాత వార్త) :** పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని గాంధీచౌక్ లోనీ గాంధీ బొమ్మల వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి శనివారం పట్టణ ఆర్య వైశ్య చలివేంద్ర సంఘము, పట్టణ ఆర్య వైశ్య సంఘము మరియు సత్తెనపల్లి పట్టణ ఆర్య వైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములువిగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం విగ్రహానికి పూలమాల వేశారు, అనంతరం అక్కడ ఉన్న మిగిలిన జాతీయ నాయకుల విగ్రహాలకు పూల మాలలు వేశారు ఈ సందర్భంగా సత్తెనపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ కొల్లిపర కాశీ విశ్వనాథం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమరజీవి పొట్టి శ్రీరాములుకి అరుదైన గౌరవం ఇవ్వటం ఆనందదాయకం , ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి (శాఖమురు)నందు అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమరజీవి 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయటం భావితరాలకు పొట్టి శ్రీరాములుచరిత్ర ను తెలపటానికి సదవకాశం అన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు స్మృతి వనానికి కూటమి ప్రభుత్వం 6.8 ఎకరాలు స్థలం కేటాయించటము హర్షణీయం అని , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకి, లోకేష్ బాబుకి, పవన్ కళ్యాణ్ కి, బీజేపీ అధిష్ఠానం పెద్దలకు మరియు సత్తెనపల్లి నియోజకవర్గం శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణకి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ కి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో కొల్లిపర కాశీ విశ్వనాథం, చౌట శ్రీనివాసరావు, బీజేపీ పట్టణ అధ్యక్షులు కందకట్ల శంకర్, ఆర్య వైశ్య చలివేంద్ర సంఘము అధ్యక్షులు బచ్చు వెంకటేశ్వర్లు ఊరఫ్ కొండలు, సత్తెనపల్లి పట్టణ ఆర్య వైశ్య సంఘము అధ్యక్షులు అన్నం బాల సుబ్రమణ్యం, సత్తెనపల్లి పట్టణ ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షులు చల్లంచర్ల కళ్యాణ్ నాయకులు జవ్వాజి రామమోహనరావు, పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ, కాపుగంటి రత్తయ్య, పోతుగంటి నరసింహారావు, దూపగుంట్ల జానకి రామారావు, దేవతి సుబ్బారావు, బాలనాగు శివ కోటేశ్వరరావు, దేవతి శివప్రసాద్, పులిపాటి శ్రీరామమూర్తి, చిలకల శ్రీనివాసరావు, కొత్తూరి విశ్వేశ్వరరావు, దేవరశెట్టి సైదారావు, నోముల వెంకటరమణ, భవిరిశెట్టి వెంకట సుబ్రమణ్యం, కటకం బాబు, భవిరిశెట్టి రంజిత్, లఘుమవరపు రమేష్, కొర్రప్రోలు బదరీ నారాయణ, మారేమళ్ళ సాయి తదితరులు పాల్గొన్నారు.

# యువైఎఫ్ఐ రాష్ట్ర సదస్సు

మంగళగిరి, జులై 19, ,ప్రభాతవార్త:యువతలో చైతన్యాన్ని నిర్వీర్యం చేయడానికి మత్తుకు బానిసలుగా చేస్తుంది ఈ పాలకవర్గం వైన్ షాపులు, క్లబ్బులు, పబ్బులు, విచ్చలవిడిగా ఏర్పాటు చేసుకోవడానికి లైసెన్సులు ఇస్తున్నాయి. గంజాయి, మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, నల్లమందు, తదితర మత్తు పదార్థాలు విచ్చలవిడిగా అమ్మకాలు పెరిగిపోయాయి. దీని ఫలితంగా మహిళలపై అత్యాచారాలు, గుండాయిజం, రౌడీయిజం, దారిదోపిడీలు, మరియు వైట్ కాలర్ నేరాలు సమాజంలో పెరిగిపోతున్నాయని యం సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మర్రెడ్డి.వెంకటరెడ్డి అన్నారు. భారత ఐక్య యువజన సమైక్య యు వై ఎఫ్ ఐ ఆధ్వర్యంలో "రాష్ట్ర సదస్సు" శనివారం మంగళగిరి పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో "నేటి విద్యార్థి, యువత సమాజం పట్ల వారి బాధ్యత" అనే అంశం మీద రాష్ట్ర సదస్సు కార్యక్రమం జరిగినది. ముఖ్య వక్తులుగా పాల్గొన్న మర్రెడ్డి.వెంకటరెడ్డి, డాక్టర్ టి.బాల వెంకట్రావులు యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి యువైఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ బాబు అధ్యక్షత వహించగా ఈ సదస్సులో సామాజిక ఉద్యమ నేతలు కే.నవీన్, గుంటూరు జిల్లా ఎం సిపిఐ పార్టీ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, నాయకులు వల్లెపు లక్ష్మీనారాయణ, సాగర్, రాధిక, అరుణ క్రాంతి, ప్రసాద్, రైతుసంఘం నాయకులు సురేష్, బోరుగడ్డ విజయ్, గుంటూరు జిల్లా యుఎస్ఎఫ్ఐ కార్యదర్శి కూర జాన్ బాబు, యువజన నాయకులు కంకిపాటి అనిల్, మణి, యువరాజ్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

20-7pg10.qxd:20-7pg10.qxd 01/01/01 7:52 AM Page 1





## యూరోపియన్ ఛాంపియన్‌షిప్‌లో
# నెదర్లాండ్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ సమాఖ్య (ఎఫ్ఐబిఎ) అండర్ 20 పురుషుల యూరోపియన్ ఛాంపియన్‌షిప్ లీగ్‌లో టర్కియే 81-61 తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఆర్మేనియా రాజధాని యెరెవాన్‌లో కరెన్ డెమిర్చ్యాన్‌క్రీడలుకాన్సర్ట్ కాంప్లెక్స్‌లో శనివారం జరిగిన మ్యాచ్‌ను టర్కియే ప్రారంభించి, మొదటి పిరియడ్‌ను 24 -15తో ముగించింది. రెండవ క్వార్టర్‌లో నెదర్లాండ్స్ అంతరాన్ని తగ్గించడానికి ప్రయత్నించగా, జాతీయ జట్టు 39-36 ఆధిక్యంతో లాకర్ రూమ్‌లోకి వెళ్లింది. రెండవ అర్ధభాగంలో క్రెసెంట్‌స్టార్స్ జట్టు ఆటపై ఆధిపత్యం చెలాయించింది, ముఖ్యంగా బలమైన రక్షణాత్మక ప్రదర్శనతో నెదర్లాండ్స్‌ను మట్టి కరిపించింది. ఫలితంగా జాతీయ జట్టు టర్కియే కేవలం తొమ్మిది పాయింట్లు మాత్రమే ఇచ్చి చివరి క్వార్టర్‌లోకి 66-45 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మ్యాచ్ చివరి దశలో అంతరాన్ని తగ్గించడానికి అనుమతించని టర్కియే, 81-61 తేడాతో విజయం సాధించి కోర్టును విడిచిపెట్టి సెమీఫైనల్లో క్రొయేషియా ప్రత్యర్థిగా మారింది. జాతీయ జట్టు నుండి, ఎమ్రే మెలిహ్ తుంకా 20 పాయింట్లతో మరియు ఓజ్గున్ సెంగిజ్ 17 పాయింట్లతో విజయంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. క్రొయేషియాటర్కియే సెమీఫైనల్ మ్యాచ్ ఈ నెల 20న రాత్రి జరుగుతుంది.



## వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో..
# శ్రీహరి సంచలన రికార్డు

**న్యూఢిల్లీ:** ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలు-2025లో భాగంగా జరిగిన ఈత పోటీల్లో శ్రీహరి నటరాజ్ రికార్డు సృష్టించాడు. 2025 ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలలో ఈతగాడు శ్రీహరి అత్యుత్తమ సమయాన్ని నమోదు చేశాడు. పురుషుల 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో భారత ఈతగాడు శ్రీహరి తన రికార్డు బద్దలు కొట్టే ఫామ్‌ను కొనసాగించాడు. రెండవ సెమీఫైనల్ హీట్‌లో, నటరాజ్ 1:48.11 సెకన్ల సమయం సాధించాడు. హీట్స్‌లో అతను నెలకొల్పిన 1:48.22 సెకన్లతో తన జాతీయ ఉత్తమ సమయాన్ని మెరుగుపరుచుకున్నాడు. వ్యక్తిగత మైలురాయి ఉన్నప్పటికీ, పారిస్ ఒలింపియన్ ఫైనల్‌లో తృటిలో స్థానం కోల్పోయాడు, టాప్ ఎనిమిది అర్హత బ్రాకెట్ వెలుపల మొత్తం మీద తొమ్మిదో స్థానంలో నిలిచాడు. అంతకుముందు రోజు, నటరాజ్ 1:48.22 సెకన్ల సమయంతో హీట్ 5లో అగ్రస్థానంలో నిలిచాడు, అతని మునుపటి అత్యుత్తమ సమయం 1:48.66 సెకన్ల కంటే కీలకమైన మిల్లీ సెకన్లు తక్కువ. అతని ప్రదర్శన ప్రాథమిక రౌండ్లలో ఐదవ అత్యుత్తమం, సెమీఫైనల్స్లో బలమైన బెర్తును సాధించింది మరియు రౌండ్లలో అతని స్థిరత్వాన్ని నొక్కి చెబుతుంది. మరోవైపు, అదే ఈవెంట్‌లో అనీష్ గౌడ 1:52.42 సెకన్ల సమయంతో 33వ స్థానంలో నిలిచి మరపురాని ప్రదర్శన ఇచ్చాడు. ఈ క్రీడల్లో సెమీఫైనల్‌కు చేరుకున్న రెండవ భారతీయ స్విమ్మర్ శ్రీహరి, బెనెడిక్షన్ రోహిత్ తర్వాత, 50 మీటర్ల బటర్‌ఫ్లైలో రెండు కొత్త ఉత్తమ సమయంను నెలకొల్పి మొత్తం మీద 13వ స్థానంలో నిలిచాడు.

# ఫ్రీస్టైల్ చెస్ సెమీ ఫైనల్లో అర్జున్ ఓటమి
## ప్లేఆఫ్‌లో ముందుకు ప్రజ్ఞానంద

**న్యూఢిల్లీ:** ఫ్రీస్టైల్ చెస్ టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన సెమీ ఫైనల్లో భారత్ టాప్ గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ ఓటమి పాలయ్యాడు. లాస్ వెగాస్‌లో జరిగిన 2025 ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్‌స్లామ్ సెమీ ఫైనల్స్‌లో అర్జున్ లెవాన్ అరోనియన్ చేతిలో పరాభం చెందాడు. ఫ్రీస్టైల్ చెస్ ఈవెంట్‌లో సెమీ ఫైనల్‌కు చేరుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన 21 ఏళ్ల అర్జున్ అమెరికన్ గ్రాండ్ మాస్టర్ అర్మేనియన్ చేతిలో 0-2 తేడాతో ఓటమి చెంది తన కలల పరుగును నిలిపివేశాడు. సెమీ ఫైనల్స్‌లో అతడు మొదటి గేమ్‌లో సౌకర్యవంతమైన స్థానాన్ని పొందినా, అరోనియన్ తన అత్యుత్తమ సామర్థ్యాలతో డిఫెండ్ చేయడంలో అవకాశాలను అందిబుచ్చుకోలేకపోయాడు. మరింత అను భవజ్ఞుడైన అరోనియన్ తన ప్రత్యర్థి అర్జున్‌పై వత్తిడి తేవడంతో చివరకు దాని నుండి బయటపడలేక కుప్పకూలాడు. రెండో గేమ్‌లో అరోనియన్ జోరును ప్రదర్శించాడు. ఈ అర్మేనియన్ ఆటగాడు తొలి ఆటలోనే స్వల్ప ఆధిక్యాన్ని సాధించడంతో ఆత్మస్థైర్యంతో దూసుకుపోయాడు. అయితే తప్పక గెలవాల్సిన పరిస్థితుల్లో అర్జున్ బలవంతంగా ఆటను




కొనసాగిచండానికి ప్రయత్నించినా, అవి సఫలం కాలేదు. ఇక ఇదే టోర్నీలో పోటీలో ఉన్న మరో భారత్ గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద 3 నుండి 8వ స్థానం కోసం జరిగిన ప్లే ఆఫ్ మ్యాచ్‌లో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌పై 1.5-0.5 తేడాతో విజయం సాధించాడు. మొదటి గేమ్‌లో నల్ల పావులతో ప్రజ్ఞానంద డ్రాగా ముగించాడు. తద్వారా రెండవ గేమ్‌లో కీమర్‌ను ఓడించి తెల్ల పావులతో విజయం సాధించాడు.



# పాక్ విక్టరీ
## ఇంగ్లండ్‌పై 5 పరుగుల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** ఉత్కంఠభరితమైన వరల్డ్ క్రికెట్ లీగ్ (డబ్ల్యూసిఎల్)-2025 ఓపెనర్‌లో పాకిస్తాన్ 5 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ ఛాంపియన్స్‌పై విజయం సాధించింది. ఈ వరల్డ్ ఛాంపియన్స్ లీగ్ ప్రారంభ మ్యాచ్ బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగింది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. అయితే, పాకిస్తాన్ ఛాంపియన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనను ప్రదర్శించింది, ముఖ్యంగా ఇన్నింగ్స్ డెత్ ఓవర్లలో బంతితో ఇంగ్లాండ్ టాప్ ఆర్డర్ బలమైన ప్రతిఘటనను ప్రదర్శించినప్పటికీ, పాకిస్తాన్ చివరి వరకు పోరాడి స్వల్ప తేడాతో గెలుపొందింది. పాకిస్తాన్ తమ 20 ఓవర్లలో 9 వికెట్లకు 160 పరుగులు చేసింది. కెప్టెన్ మొహమ్మద్ హఫీజ్ 34 బంతుల్లో 54 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు స్థిరత్వాన్ని అందించాడు. ఆమేర్ యామిన్ 13 బంతుల్లో 27 పరుగులు చేసి వేగంగా రాణించాడు. సోహైల్ తన్వీర్ కూడా 11 బంతుల్లో 17 పరుగులు చేసి స్కోరును పెంచాడు. అయితే, ఇంగ్లాండ్ బౌలర్లు విరామాలలో





వికెట్లు తీయడం కొనసాగించారు. లియామ్ ప్లంకెట్ (2/28) మరియు క్రిస్ ట్రెమ్లెట్ (2/36) కీలకమైన వికెట్లు తీయగా, ర్యాన్ సైడ్‌బాటమ్ 3 ఓవర్లలో 1/18 పరుగులు చేశాడు. ఇక విజయం కోసం 161 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లాండ్ స్థిరమైన ఆరంభాన్ని ఇచ్చింది కానీ ముఖ్యమైన సమయంలో అదే జోరును కొనసాగించలేకపోయింది. ఫిల్ మస్టర్డ్ 51 బంతుల్లో 58 పరుగులతో ఇన్నింగ్స్‌కు మద్దతు ఇవ్వగా, ఇయాన్ బెల్ 35 బంతుల్లో 51 పరుగులతో అద్భుతమైన ఆటతీరును కనబరిచాడు. అయితే, చివరి ఓవర్లలో ఫినిషింగ్ పవర్ లేకపోవడం ఇంగ్లాండ్‌కు సవాలుగా మారింది. పాకిస్తాన్ బౌలర్లు డెత్ ఓవర్లలో ఆటను బిగించారు. రమ్మాన్ రయీస్ (1/14), అమీర్ యామిన్ (1/27), మరియు సోహైల్ తన్వీర్ (1/41) తమ ధైర్యాన్ని నిలుపుకుని పాకిస్తాన్‌కు 5 పరుగుల స్వల్ప తేడాతో విజయాన్ని అందించారు.




# రెజ్లింగ్‌లో భారత్‌కు రెండు స్వర్ణాలు
## మెరిసిన పంఘల్, హర్షిత

**న్యూఢిల్లీ:** పాలియాక్ ఇమ్రే వర్గా జానోస్ మెమోరియల్ ర్యాంకింగ్ సిరీస్‌లో 53 కిలోల టైటిల్‌ను గెలుచుకుని, భారత రెజ్లింగ్ స్టార్ ఆంటిమ్ పంగల్ అంతర్జాతీయ సర్క్యూట్‌లో తన స్వర్ణ పరుగును కొనసాగించింది. మహిళల 72 కిలోల విభాగంలో హర్షిత స్వర్ణ పతకం గెలుచుకోవడంతో భారతదేశం యొక్క బలమైన ఫామ్ కొనసాగింది, ఫైనల్‌లో నాలుగుసార్లు ఆసియా ఛాంపియన్ కజకిస్తాన్‌కు చెందిన జామిలా బక్‌బెర్గెనోవాను 10-0 తేడాతో ఓడించి అద్భుతం చేసింది. గత నెలలో మంగోలియాలో విజయం సాధించిన తర్వాత, 20 ఏళ్ల ఆంటిమ్ రష్యాకు చెందిన నటాలియా మలిషేవాను 7-4 తేడాతో ఓడించి వరుసగా రెండో ర్యాంకింగ్ సిరీస్ బంగారు పతకాన్ని గెలుచుకుంది. అండర్ 20 ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకున్న తొలి భారతీయ మహిళ అయిన పంగల్, భారత రెజ్లింగ్‌లో ప్రకాశవంతమైన అవకాశాలలో ఒకరిగా తనను తాను స్థిరపరచుకుంది. జూన్‌లో జరిగిన మంగోలియా ర్యాంకింగ్ సిరీస్‌లో ఆధిపత్య ప్రచారం తర్వాత కొన్ని వారాల తర్వాత బుడాపెస్ట్‌లో ఆమె విజయం సాధించింది, అక్కడ ఆమె వరుస నమ్మకమైన విజయాలతో స్వర్ణ పతకం సాధించింది. హర్యానాలోని హిసార్‌లోని భగనా గ్రామానికి చెందిన ఆంటిమ్ తన చిన్నప్పటి నుంచీ అత్యుత్తమ ప్రదర్శనకారిని. పంఘల్ అలంకరించబడిన కెరీర్‌లో ఇప్పటికే వయస్సు సమూహం మరియు సీనియర్ స్థాయి పోటీలలో అంతర్జాతీయ పతకాల శ్రేణి ఉంది. ఆమె 2023లో బెల్‌గ్రేడ్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో మరియు 2022లో హాంగ్‌జౌలో జరిగిన ఆసియా క్రీడలలో కాంస్యం గెలుచుకుంది.



# ఎగుమతుల్లో భారత్ దూకుడు!

**న్యూఢిల్లీ, జూలై 19:** వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతుల్లో భారత్ గణనీయమైన వృద్ధిని కనబర్చింది. 2025-26 మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) భారతదేశ వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతులు సంవత్సరానికి 7 శాతానికి పైగా పెరిగి 5.96 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. బియ్యం, మాంసం, పండ్లు, కూరగాయల ఎగుమతులు దీనికి కారణమయ్యాయని ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. బాస్మతి, బాస్మతియేతర రకాలు రెండూ సహా బియ్యం ఎగుమతులు 3.5 శాతం పెరిగి 2.9 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో బియ్యం ఎగుమతులు రికార్డు స్థాయిలో 12.47 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇది 2023-24తో పోల్చుకుంటే 20 శాతానికి పైగా పెరిగింది. ప్రపంచ బియ్యం మార్కెట్లో 40 శాతానికి పైగా వాటా కలిగి ఉన్న భారతదేశం, దశాబ్దానికి పైగా ప్రధాన బియ్యం ఎగుమతిదారుగా తన స్థానాన్ని నిలుపుకుంది. మాంసం, పాలు, పౌల్ట్రీ ఎగుమతులు 17 శాతం పెరిగి 1.18 బిలియన్ డాలర్లకు చేరుకోగా, పండ్లు, కూరగాయల ఎగుమతులు 13 శాతం పెరిగి 0.95 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. నివేదిక ప్రకారం. భారతీయ గేదె మాంసం నాణ్యత, పోషక విలువల కారణంగా ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోందని అధికారులు గుర్తించారు.



భారతదేశం ఇప్పుడు ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద గేదె మాంసం ఎగుమతిదారుగా ఉంది. వియత్నాం, మలేషియా, ఈజిప్ట్, ఇరాక్, సౌదీ అరేబియా, యుఎఇలలో కీలక మార్కెట్లు ఉన్నాయి. అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ బాస్కెట్ కింద ఎగుమతులు 2025లో 25.14 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇది 2024 నుండి 12 శాతానికి పైగా పెరిగి మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో 51 శాతం వాటాను కలిగి ఉంది. మిగిలిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో పొగాకు, కాఫీ, టీ ఉన్నాయి.

# హెచ్‌డిఎఫ్‌సి నిరకలాభం రూ.18,155 కోట్లు


**ముంబై, జూలై 19:** ప్రైవేటుబ్యాంకింగ్‌రంగంలో అతిపెద్దబ్యాంకు హెచ్‌డిఎఫ్‌సి నికరలాభాల్లో 12.2శాతం వృద్ధిని నమోదుచేసింది. తొలి త్రైమాసికంలో 18,155 కోట్ల నికరలాభం అర్జించినట్లు ప్రకటించింది. నికర వడ్డీ ఆదాయంలో వృద్ధి, రుణాల వృద్ధి మందగించడంతో లాభాలు పెరిగాయి. బ్యాంకు అనుబంధ సంస్థ హెచ్‌డిబి ఫైనాన్సియల్ సర్వీసెస్ పాక్షిక పెట్టుబడుల ఉపసంహరణ కూడా కొంత లాభాలకు ఊతం ఇచ్చింది. బ్యాంకు నికరంగా 6,949.27 కోట్ల రూపాయలు వాటాలు విక్రయంద్వారా రాబడులు పెంచుకుంది. కేటాయింపుల పరంగా 14,441 కోట్లుగా ఉన్నాయి. వీటిలో 9 వేల కోట్లు ఫ్లోటింగ్ కేటాయింపులున్నాయి. అదనపు తక్షణ కేటాయింపులు కింద 1700 కోట్లు కేటాయించింది. ఈ కాలంలో నికరవడ్డీ ఆదాయం 5.4శాతం పెరిగి 31,438 కోట్ల వరకూ వచ్చింది. నికర వడ్డీ మార్జిన్ కూడా 3.35శాతంగా పెరిగింది. డిపాజిట్ల కంటే మొత్తం ఆస్తులవృద్ధి అధికంగా ఉంది. ఇతర ఆదాయాలపరంగా చూస్తే 21,730 కోట్లు ఆర్జించింది. బ్యాంకు స్థిరాస్తి ప్రమాణాలు కొంతమేర క్షీణించాయి. స్థూల నిరర్ధక ఆస్తులు 1.4శాతంగా ఉన్నాయి. అంతకు ముందు ఏడాది ఇదేకాలంలో 1.33శాతంగా ఉన్నాయి. ఇక




నికర ఎన్‌పిఎలు మొత్తం అడ్వాన్సుల్లో 0.47 శాతంగా ఉన్నాయి. స్థూల అడ్వాన్సులు 6.7 శాతం పెరిగి 26.53 లక్షల కోట్లకు చేరాయి. రిటైల్ రుణాలు 8.1శాతం, చిన్న, మధ్య తరహా మార్కెట్ సంస్థలకు 17.1శాతం రుణాలు అధికంగా ఇచ్చింది. మొత్తంగా టోకురుణాలు 1.7శాతంగా ఉన్నాయి. డిపాజిట్లు 27.64 లక్షల కోట్ల వరకూ ఉన్నాయి. 16.2శాతం వృద్ధిని నమోదు చేసింది. నికర లాభాలు పెరగ డంతో 1:1 నిష్పత్తిన బోనస్ ఈక్విటీషేర్లు ప్రక టించింది. ఒకరూపాయి ముఖవిలువ కలిగిన ప్రతిషేరుకు ఒక అదనపు షేరు వస్తుంది. అదనంగా ప్రత్యేకతాత్కాలిక డివిడెండ్ ను ఈక్విటీషేరుకు ఐదు రూపాయలు చొప్పున పెంచింది.

# సెంట్రల్ బ్యాంకు నికర లాభంలో వృద్ధి

ప్రభుత్వరంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 33శాతం నికరలాభాల్లో వృద్ధిని నమోదు చేసి 1169 కోట్ల రూపాయలు సాధించింది. కీలక రాబడుల్లో వృద్ధి, రుణాల్లో తగ్గుదల వల్లనే లాభాలు పెంచుకోగలిగింది. గత ఏడాది ఇదే కాలంలో 880 కోట్లు ఆర్జించిన బ్యాంకు ఈసారి 33శాతం వృద్ధిని నమోదు చేసింది. బ్యాంకు మొత్తం రాబడులు రూ.9500 కోట్లనుంచి రూ. 10,374 కోట్లుగా ఉన్నాయి. బ్యాంకు వడ్డీ రూపేణా 8589 కోట్లు రాబట్టుకోగా గత ఏడాది ఇదే కాలంలో 8335కోట్ల నుంచి కొంతమేర వృద్ధిని నమోదుచేయ గలిగింది. బ్యాంకు నిర్వహణ లాభం 2304 కోట్లుగా ఉంది. స్థూల నిరర్ధక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 3.13శాతంగా ఉన్నాయి. ఇక మొత్తం అడ్వాన్సులు 9.97శాతం పెరిగి 2,75,595 కోట్లుగా ఉన్నాయి. అలాగేనికర నిరర్ధక ఆస్తులు,రానిబాకీలు 0.49శాతానికి తగ్గాయి. ఇక తక్షణ కేటాయింపులు రూ.521కోట్లకు తగ్గాయి. కేటాయింపుల కవరేజి రేషియో 97.02శాతంగా ఉంది. ఆస్తులపై రాబడులు 1.02శాతం మెరుగు పడ్డాయి. క్యాపిటల్ అడక్వసీ రేషియో 17.6శాతంగా ఉన్నాయి. మొత్తం బ్యాంకు బిజినెస్ రూ.6,35,564 కోట్లనుంచి 7,04,485 కోట్లకు పెరిగింది.




# 59% పెరిగిన యాక్సిస్‌బ్యాంకు లాభం

**ముంబై,జూలై 19:** ప్రైవేటురంగంలో అభివృద్ధిలోకి వస్తున్న ఎస్‌బ్యాంకు నిరకరలాభం 59శాతంపెరిగి రూ.801కోట్లకు నమోదుచేసింది. తొలిత్రైమాసిక ఫలితాలను ప్రకటించిన బ్యాంకు నికరవడ్డీ ఆదాయాన్ని పెంచుకుంది. బ్యాంకు నికరవడ్డీ ఆదాయం కూడా రూ.502కోట్లకు పెరిగింది. క్రామనుగతంగా చూస్తే నికరలాభం 8.5శాతం పెరిగి 738 కోట్లుగా గత త్రైమాసికంలో నమోదు చేసింది. నికరవడ్డీ కూడా 5.7 శాతం పెరిగింది. వార్షిక పద్ధతిన గణిస్తే 2371 కోట్లుగా ఉంది. వడ్డీయేతర ఆదాయం 46.12 శాతం పెరిగి 1752 కోట్లుగా నమోదయింది. బ్యాంకు నికరవడ్డీ మార్జిన్ చూస్తే 2.5శాతంగా ఉంది. ఇక వివిధరంగాలకు కేటాయింపులు 34శాతంగా ఉండి 284 కోట్లుగా ఉన్నాయి. స్థూల నిరర్ధక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 1.60శాతంగా ఉన్నాయి. నికర ఎన్పీయేలు కూడా 0.30శాతంగా ఉండటం బ్యాంకు ఆర్థికపరిపుష్టిని సూచిస్తోంది. బ్యాంకు ఈ త్రైమాసికంలో ఐదుశాతం రుణాల్లో వృద్ధినమోదు చేసింది. 2.41లక్షల కోట్లుగా న్నాయి. డిపాజిట్లు కూడా 4.1శాతం పెరిగి 2.75 లక్షల కోట్ల రూపాయలకు చేరాయి.




# ఎస్‌బిఐకి గ్లోబల్ ఫైనాన్స్ అవార్డ్

**న్యూఢిల్లీ, జూలై 19:** భారత దేశపు అతిపెద్ద బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2025 సంవత్సరానికిగాను ప్రపంచంలోనే అత్యుత్తమ కన్జ్యూమర్ బ్యాంక్‌ అవార్డును గెలుచుకుంది. విశ్లేషణ, ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ ఫైనాన్స్ నిపుణులు, విశ్లేషకులు, బ్యాంకర్ల అభిప్రాయాల ఆధారంగా ఈ ఎంపిక జరిగింది. గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ తన వార్షిక "వరల్డ్స్ బెస్ట్ బ్యాంక్ కార్యక్రమంలో భాగంగా, ఐఎంఎఫ్/ప్రపంచ బ్యాంకు వార్షిక సమావేశాల సందర్భంగా 2025 అక్టోబర్ 18న వాషింగ్టన్ డీసీలో ఈ అవార్డును ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టికి ప్రదానం చేయనున్నారు.ఈ సందర్భంగా ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి మాట్లాడుతూ, తమ విలువైన ఖాతాదారు లకు, అంకితభావం తో పనిచేసే ఉద్యోగులకు, నమ్మకం ఉంచిన భాగస్వాములంద రికీ కృతజ్ఞతలు తెలిపారు. వినియోగదారులకు మెరుగైన అనుభూతిని అందించడమే తమ వృద్ధి వ్యూహానికి కీలకమని ఆయన పేర్కొన్నారు. ఆన్‌బోర్డింగ్‌ను సరళీకరించడం, ప్రాంతీయ భాషల్లో వాయిస్ బ్యాంకింగ్‌ను ప్రవేశపెట్టడం, 24/7 డిజిటల్ సపోర్ట్ అందించడం వంటి చర్యలతో గ్రామీణ, సెమీఅర్బన్ ప్రాంతాల్లోని వినియోగదారులకు మరింత నిరాటం కమైన, సమ్మిళి తమైన బ్యాంకింగ్ అనుభవాన్ని అందించడమే తమ లక్ష్యమ న్నారు. అలాగే, ఏఐ సామర్థ్యాలతో హైపర్‌పర్సనలైజ్డ్ సేవలను అందిస్తూ, ఆమ్ని ఛానల్ ఎంగేజ్‌మెంట్ మోడళ్లను కూడా అభి వృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మ్యాగజైన్ గ్లోబల్ ఫైనాన్స్ నాలుగు దశాబ్దాలుగా ఈ అవార్డులు అంద జేస్తోంది. ఎడిటోరియల్ విశ్లేషణలు, అంతర్జాతీయంగా ఫైనాన్షియల్ నిపుణుల అభిప్రాయాల ఆధారంగా 150కి పైగా దేశాలకు చెందిన సంస్థలను ఈ పురస్కారం కోసం ఎంపిక చేస్తారు.




# వాణిజ్యం

# గూగుల్, మెటాకు ఇడి నోటీసులు

**ముంబై, జూలై 19:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు ఎంతో మందిని ఆర్థికంగా కుంగదీసి, చివరికి ప్రాణాలనే బలితీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ కేసులో తన దర్యాప్తును మరింత వేగంగా కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఈ యాప్‌ల ప్రమోషన్ ఆరోపణలపై ఇడి విచారణకు హాజరైన విషయం విదితమే. తాజాగా ఈ కేసులో పెద్ద మలుపు తిరిగింది. టెక్ దిగ్గజాలు గూగుల్, మెటా కంపెనీలు కూడా ఇడి సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్, హవాలా లావాదేవీలు ఇతర ఆర్థిక నేరాలకు సంబంధించి దర్యాప్తులో ఉన్న బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి ఈ రెండు టెక్ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లలో వేదిక కల్పించాయని ఇడి ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 21న విచారణకు హాజరుకావాలని ఇడి అధికారికంగా నోటీసులిచ్చింది. దీనిపై ఈ రెండు సంస్థలు ఏ విధంగా స్పందిస్తాయన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.




# ఐసిఐసిఐ నికరవడ్డీ రాబడి రూ.21,635కోట్లు!

**ముంబై, జూలై 19:** దేశంలోనే రెండో అతిపెద్ద ప్రైవేటు బ్యాంకు ఐసిఐసిఐ బ్యాంకు నికరలాభాల్లో 15.5శాతం వృద్ధినమోదుచేసి రూ.12,768 కోట్లు ఆర్జించింది. తొలిత్రైమాసికంలో 2025-26 కాలానికిగాను ట్రెజరీ రాబడులు పెంచుకోగలిగింది. నికరవడ్డీ ఆదాయం 10.6శాతం వృద్ధిని నమోదుచేసి 21,635 కోట్లుగా ఉంది. వడ్డీయేతర ఆదాయం ట్రెజరీ రాబడులు మినహాయిస్తే 13.7శాతంగా పెరిగి 7264 కోట్లుగా ఉంది. ట్రెజరీ రాబడులు తొలిత్రైమాసికంలో రెట్టింపు అయ్యాయి. ట్రెజరీ లాభాలు రూ.1241 కోట్లుగా ఉన్నాయి. గత తొలిత్రైమాసికంలో 613కోట్లు మాత్రమే రాగా ఈసారి రెట్టింపు అయ్యాయి. దేశీయంగా అడ్వాన్సులు 12శాతంపెరిగాయి. రిటైల్ రుణపరపతి కూడా 6.9శాతంపెరిగింది. మొత్తం రుణాల పోర్టుఫోలియోలో 52.2శాతంగా ఉంది. బిజినెస్ బ్యాంకింగ్ విభాగం కూడా 29.7శాతం వృదిధని నమోదుచేస్తే దేశీయ కార్పొరేట్ పోర్టుఫోలియో 7.5శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం 0.4శాతం క్షీణించింది. మొత్తం అడ్వాన్సులు 11.5శాతంగా ఉన్నాయి.రూ.12.64 లక్షలకోట్లకు చేరాయి. మొత్తం డిపాజిట్లు కూడా 12.8శాతం పెరిగి 16.08 లక్షల కోట్లుగా ఉన్నాయి. కేటాయింపులు 1815 కోట్లుగా ఉంటే స్థూల నిరర్ధక ఆస్తులు 2.15 శాతంగా ఉన్నాయి. నికర అడ్వాన్సుల పరంగాచూస్తే 0.41 శాతంగా ఉన్నట్లు బ్యాంకు ప్రకటించింది. స్థూల ఎన్పీయేలు 6245 కోట్లుగా ఉన్నాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14